ఈ-వ్యర్థాలపై సమరం

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై విస్తృత అవగాహన

- జిల్లా అంతటా ర్యాలీలు, సభలు
- పలుచోట్ల వ్యర్థాల సేకరణ
- ఒంగోలులో రీసైక్లింగ్ కేంద్రం ప్రారంభం
- ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



ఈ-వేస్ట్‌పై అవగాహన కల్పిస్తూ ఒంగోలులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న జిల్లా ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ అన్సారియా, టూరిజం బోర్డు చైర్మన్ బాలాజీ, మేయర్ సుజాత, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు

ఒంగోలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో ఇబ్బడిముబ్బడిగా పేరుకుపోతున్న ఈ-వ్యర్థాలపై ప్రభుత్వం సమరం ప్రారంభించింది. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర పేరుతో ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న కార్యక్రమంలో ఈసారి ఈ-వ్యర్థాల నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతోపాటు వాటిని సేకరించి రీసైక్లింగ్ చేయడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇచ్చింది. తదనుగుణంగా శనివారం జిల్లావ్యాప్తంగా ఈ-వ్యర్థాలపై అవగాహన పేరుతో పెద్దఎత్తున ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించారు. ఒంగోలులో రీసైక్లింగ్ సెంటర్‌ను కూడా ప్రారంభించారు. అలాగే పలుచోట్ల రోడ్లు, డ్రైన్ల పరిశుభ్రత కార్యక్రమాలను నిర్వహించారు. జిల్లాకేంద్రమైన ఒంగోలులోని పీవీఆర్ హైస్కూలు నుంచి కొత్త మార్కెట్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ సభ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, జిల్లా ప్రత్యేక అధికారి సురేష్‌కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారియా తదితరులు పాల్గొన్నారు. కనిగిరిలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పట్టణంలోని పలు డ్రైన్ల పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొనగా మార్కాపురం పట్టణంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, దర్శిలో నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్యలు ఈ వ్యర్థాల అవగాహన ర్యాలీలు, సభలకు హాజరయ్యారు. అలాగే పలు ఇతర పట్టణాలు, మండల కేంద్రాల్లోనూ ఇదే తరహా కార్యక్రమాలు జరిగాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమలను నిర్వహించారు.



కనిగిరిలో కాలువను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

మాయలోళ్లు



మార్కాపురం కేంద్రంగా నకిలీ ధ్రువీకరణ పత్రాల రాకెట్

- ఇప్పటికే లెక్కలేనన్ని భూఅక్రమాలు
- అధికారుల ఉదాసీనతతో రెచ్చిపోతున్న ఓ ముఠా..
- రూ.కోట్లకు పడగలెత్తిన అక్రమార్కులు
- తాజాగా దేవరాజుగట్టులో ఘటన



మార్కాపురం కేంద్రంగా ఫోర్జరీ దందా యథేచ్ఛగా నడుస్తోంది. అధికారుల సంతకాలతో కొందరు మాయ చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో దొంగ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రూ.కోట్ల విలువైన భూములు కొల్లగొట్టిన ఉదంతాలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై సిట్ ఏర్పాటు చేసి విచారణ నిర్వహించడంతో కళ్లుబయర్లు కమ్మే వాస్తవాలు వెలుగుచూశాయి. మార్కాపురం పట్టణానికి చెందిన ఓ వ్యక్తి తన అవినీతి సామ్రాజ్యాన్ని జిల్లాలు కూడా దాటించినట్లు తేలింది. అప్పట్లో అతనికి సహకరించిన కొందరు ఆ పరంపరను నేటికీ కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. తాజాగా దేవరాజుగట్టు ఘటన ఇందుకు నిదర్శనం. అయితే అక్రమాలు బయటపడినప్పుడు అధికార యంత్రాంగం చూపించే చొరవ తర్వాత నెమ్మదిస్తుండటంతో మాయలోళ్లు దర్జాగా తిరుగుతూ దందాను కొనసాగిస్తున్నారు.

రెచ్చిపోతున్న ముఠా సభ్యుడు

మార్కాపురం మండలంలోని గోగులదిన్నె గ్రామానికి చెందిన ఆ ముఠాలోని ఓ సభ్యుడు సుమారు 50 ఎకరాల వరకు నకిలీ పట్టాలతో అసైన్డ్ భూములు కాజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అతని సహకారంతోనే గత సంవత్సరం పెద్దారవీడు మండల కేంద్రానికి చెందిన ఓ వైసీపీ నాయకుడు జగనన్న కాలనీలో సామాజిక అవసరాల కోసం వదిలిన ఆరు ప్లాట్లను నకిలీ పట్టాలతో కాజేశాడు. గ్రామస్థులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదు. దీంతో అతను మరింత రెచ్చిపోయి ప్రస్తుతం పెద్దారవీడు మండలం దేవరాజుగట్టులో పట్టా భూమికి సైతం నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రూ.కోట్ల విలువైన భూమిని కాజేసేందుకు ప్రయత్నించాడు. ఇదేరీతిన ఆ మండలంలోని కీలకమైన హనుమాన్ జంక్షన్ కుంటలో కూడా భూఅక్రమాలు కోకొల్లలుగా చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది.

మార్కాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం డివిజన్‌లో రెవెన్యూ శాఖలో జరుగుతున్న అక్రమాలు అన్నీఇన్నీ కావు. భూఅక్రమాలకు అయితే అంతేలేదు. గత వైసీపీ పాలనలో అవినీతి కొత్త పుంతలు తొక్కిన విషయం విదితమే. అయితే అప్పట్లో సిట్ వేసి విచారణ చేయడంతో కొంతమేరకు ఆ మాయజాలం ఆగింది. తర్వాత విచారణ నెమ్మదించడంతో అప్పట్లో ఆ దందాలో పండిపోయిన వారు మళ్లీ అక్రమాల పరంపరను కొనసాగిస్తున్నారు. ఎంతటిస్థాయి అధికారి సంతకాలనైనా ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టిస్తున్నారు. వాటితో చెలరేగిపోతున్నారు. అధికారులు చిన్నపాటి కేసులతో సరిపెడుతుండటంతో భూచోళ్లు రెచ్చిపోతున్నారు.

తలుచుకుంటే చిటికెలో నకిలీ పత్రాలు

మార్కాపురం పట్టణంలో ఐదేళ్ల క్రితం చర్మకార వృత్తి పనిచేసుకునే ఓ వ్యక్తి కళ్లుమూసి తెరిచేలోగానే కోటీశ్వరుడయ్యాడు. మార్కాపురం కేంద్రంగా నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించేందుకు ఒక ముఠాను తయారు చేసుకున్నాడు. తొలుత చిన్నపాటి అక్రమాలకు పాల్పడ్డాడు. తర్వాత జిల్లాకేంద్రానికి మకాం మార్చి పెద్దస్థాయి అక్రమాలకు తెరలేపాడు. ఈక్రమంలో ఈ దందా అప్పట్లో జిల్లాలు కూడా దాటింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో నాయకుల అండదండలు పుష్కలంగా ఉండటంతో ఈ అక్రమ తంతు మూడు నకిలీ సర్టిఫికెట్లు, ఆరు భూఅక్రమాలుగా నిరాటంకంగా కొనసాగింది. చివర్లో అతనిపై కొరడా ఝులిపించారు. కొందరు సభ్యులు మాత్రం ఇంకా మార్కాపురం కేంద్రంగా నకిలీ పత్రాలు సృష్టించే కార్యక్రమాన్ని నిరాటంకంగా కొనసాగిస్తున్నారు.

చర్యలకు వెనుకాడుతున్న అధికారులు

ప్రభుత్వ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీపత్రాలు సృష్టించి అక్రమాలకు పాల్పడుతున్నా సంబంధిత శాఖల బాధ్యులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అక్రమాలు బయటపడినప్పుడు లోతుగా విచారించి ఎవరెవరి పాత్ర కీలకంగా ఉందో తెలుసుకుని కఠినంగా వ్యవహరిస్తే పునరావృతం కాకుండా ఉంటాయి. కానీ పలురకాల ఒత్తిళ్లతో ప్రాథమిక స్థాయిలోనే పోలీసు, రెవెన్యూ అధికారులు కేసులను నీరుగారుస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. నకిలీ పత్రాలు సృష్టించే ముఠాలు భూములను కొల్లగొట్టే క్రమంలో పలువురిపై అక్రమ కేసులు కూడా పెట్టి ఇబ్బందులకు గురిచేసిన దాఖలాలు ఉన్నాయి. తాజాగా దేవరాజుగట్టులో జరిగిన భూఆక్రమణ విషయంలో కూడా తొలుత నకిలీ ధ్రువపత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వాళ్లు భూయజమానిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కానీ రెవెన్యూ అధికారులు భూయజమానికి అండగా ఉండటంతో ఇబ్బందులు తప్పాయి. ప్రస్తుతం రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో అక్రమార్కులపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై లోతుగా దర్యాప్తు చేస్తే అసలు దోషులు బయటపడే అవకాశం ఉంది.



హనుమంత వాహనంపై చెన్నయ్య

మార్కాపురంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. శనివారం స్వామివారు శ్రీరాముని అలంకారంలో హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. నాలుగు మాడవీధుల్లో విహరించారు. సర్వాలంకార శోభితుడైన శ్రీవారిని దర్శించుకొని భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు.

- వివరాలు 9వ పేజీలో

ఒంగోలుకు మరో బైపాస్

- పశ్చిమం వైపు ఏర్పాటుపై దృష్టి
- రెండు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- త్రోవగుంట సమీపంలోని చీరాల రోడ్డు నుంచి చెరువుకొమ్ముపాలెం మీదుగా రింగ్‌రోడ్డు
- రూ. వెయ్యి కోట్ల ప్రాజెక్టు అయితేనే ఓకే చేస్తున్న కేంద్ర ప్రభుత్వం
- డీపీఆర్ పూర్తయ్యాక ఎమ్మెల్యేలతో భేటీకానున్న యంత్రాంగం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రమైన ఒంగోలులో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పశ్చిమం వైపు మరో బైపాస్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు మొదలయ్యాయి. అందుకు సంబంధించి సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అధికారులు సిద్ధం చేస్తున్నారు. రూ.వెయ్యి కోట్ల లోపు ప్రాజెక్టులకు అయితే కేంద్ర ప్రభుత్వం వెంటనే అనుమతులు మంజూరు చేస్తుండటంతో అందుకు అనుగుణంగా రెండు రకాల ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రెండో బైపాస్ రోడ్డుపై ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఈనెల 9న కలెక్టరేట్‌లో కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. తదనుగుణంగా సమగ్ర ప్రాజెక్టు నివేదికలు తయారుచేసేలా చర్యలు తీసుకున్నారు.

రెండు ప్రతిపాదనలు

ముందుగా మద్దిపాడు మండలం కొష్టాల నుంచి టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెం వద్ద కలిపే విధంగా డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ ప్రాజెక్టు విలువ రూ.1,400 కోట్లకుపైన

మిగతా 8వ పేజీలో



ఉపాధ్యాయులకు ఊరట

- తగ్గిన యాప్‌ల భారం
- ప్రత్యామ్నాయంగా ఒకటే ఏర్పాటు
- అందుబాటులోకి లీవ్ యాప్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉపాధ్యాయులకు ఊరట లభించింది. ఎన్నికల సందర్భంగా యాప్‌ల భారాన్ని తగ్గిస్తామంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికి అమలులోకి వచ్చింది. అన్నింటికీ ప్రత్యామ్నాయంగా ఒకే యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. లెర్నింగ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ (లీప్) పేరుతో ప్రభుత్వం రూపొందించిన ఇది గత బుధవారం నుంచి ఉపాధ్యాయులకు అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు లీప్ యాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంది. పాఠశాలలకు సంబంధించిన అన్ని వివరాలను ఇక నుంచి అందులోనే నమోదు చేస్తారు. దీంతో టీచర్లపై పెనుభారం తప్పినట్లు అయింది.



గతంలో సగం సమయం యాప్‌లకే..

గత ప్రభుత్వంలో విద్యాశాఖలో యాప్‌ల గోల టీచర్లను కలవరపెట్టింది. ప్రతి పనికి సంబంధించిన సమాచారం ప్రత్యేక యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి రావడంతో టీచర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పాఠశాలలో ఉన్నంతసేపు ఎక్కువ టైం యాప్‌లతో సతమతమవుతూ బోధనకు సమయం కేటాయించలేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం అడుగుపెట్టింది మొదలు పాఠశాల ముగిసి బయటకు అడుగు వెళ్లే వరకు యాప్‌లతో ఇబ్బందులు పడుతుండేవారు. ఈ భారాన్ని తగ్గించాలని టీచర్లు గగ్గోలు పెట్టినా అప్పట్లో వారి మొర ఆలకించిన నాథుడు లేరు. ధర్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది. పాఠశాలల్లో టీచర్లు, విద్యార్థుల హాజరు నమోదుకు ఒకటి, మధ్యాహ్న భోజనం వివరాల నమోదుకు మరొకటి, విద్యా కానుక వివరాల నమోదుకు ఇంకొకటి, ఉపకార వేతనాల నమోదుకు మరొక యాప్, విద్యార్థుల మార్కుల నమోదు, మరుగుదొడ్ల పరిశుభ్రత ఇలా ప్రతి పనికి వేర్వేరుగా యాప్‌లు కావడంతో సమయమంతా వాటికే సరిపోయేది. ఈనేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో యాప్‌ల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి మాట నిలుపుకొంది. టీచర్లకు లీప్ యాప్ అందుబాటులోకి రావడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు. మొదటి రోజు బుధవారం టీచర్లు తమ మొబైల్ నుంచి అటెండెన్స్ యాప్‌ను తొలగించి ప్లేస్టోర్ నుంచి లీప్ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నారు. ప్రస్తుతం పాత లాగిన్, పాస్‌వర్డ్‌లతోనే హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. పాఠశాలకు సంబంధించి మిగిలిన యాప్‌లను కూడా తమ మొబైల్ నుంచి డిలీట్ చేసి వాటి లాగిన్ పాస్‌వర్డ్‌లను మాత్రం భద్రపర్చుకోవాలి. ప్రస్తుతానికి అన్ని వివరాలను పాత లాగిన్, పాస్‌వర్డ్‌లతోనే లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

24 నుంచి టీచర్లకు మెడికల్ క్యాంపులు

బదిలీల కోసం సర్టిఫికెట్లు జారీ : 9లో


గంజాయి సరఫరా చేసే అంతర్ రాష్ట్ర ముఠా గుట్టురట్టు

- నలుగురు అరెస్ట్
- ఐదు కిలోల సరుకు స్వాధీనం

వివరాలు 8వ పేజీలో

నేడు చంద్రబాబు జన్మదినోత్సవం

భారీ కార్యక్రమాలకు తెలుగు తమ్ముళ్ల సన్నాహాలు



ఒంగోలు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు తెలుగు తమ్ముళ్లు సన్నాహాలు చేస్తున్నారు. ఆయన 76వ ఏట అడుగుపెడుతుండటం, తిరిగి పార్టీ అధికారంలోకి వచ్చాక తొలి జన్మదినం కావడంతో భారీ కార్యక్రమాల నిర్వహణకు సిద్ధమయ్యారు. జిల్లావ్యాప్తంగా ప్రధాన పట్టణాలు, నియోజకవర్గ, మండలకేంద్రాలతోపాటు పలు గ్రామాల్లోనూ ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ సందర్భంగా పెద్దఎత్తున కేక్ కటింగ్‌లు, రక్తదాన శిబిరాలు, అన్నదానం, మెడికల్ క్యాంపులు వంటివి నిర్వహించనున్నారు. ఇప్పటికే టీడీపీ కీలక నేతలు కిందిస్థాయి నాయకులకు ఇందుకు సంబంధించిన కార్యక్రమాలపై పలు సూచనలు చేయగా తదనుగుణంగా ఆయా ప్రాంతాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రి స్వామి నుంచి ఎంపీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు వంటి వారంతా తమ తమ ప్రాంతాల్లో ఈ వేడుకలకు హాజరు కానున్నట్లు సమాచారం.



నిర్మాణం నిలిచిన అంగన్‌వాడీ భవనంలో కట్టేసిన ఎద్లు

పశువుల కొష్టాలుగా అంగన్‌వాడీ భవనాలు

- గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనులు ప్రారంభం
- బిల్లులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం

పెద్దారవీడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో నూతన అభివృద్ధి పనులు చేపట్టక పోగా గత టీడీపీ ప్రభుత్వం ప్రారంభించిన అభివృద్ధి పనులను కొనసాగించకుండా అడ్డుకొంది. పెద్దారవీడు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు నిలిచిపోవడమే దీనికి నిదర్శనంగా నిలుస్తున్నాయి.

నిలిచిన ఏడు భవన నిర్మాణాలు

మండలంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఏడు అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతిచ్చింది. అందుకుగాను ఒక్కొక్క భవన నిర్మాణానికి రూ.7.50 లక్షల నిధులు కేటాయించింది. నిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. అయితే భవన నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్న సమయంలో 2019లో జరిగిన ఎన్నికలలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి వరకూ జరిగిన పనులకు గాను టీడీపీ ప్రభుత్వం రూ.4.60 లక్షల చొప్పున బిల్లులు మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన బిల్లులు మంజూరు చేయడంలో జాప్యం కారణంగా నిర్మాణదారులు పనులను నిలిపివేశారు. దీంతో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది.

పశువులకు నిలయం

మండలంలోని పెద్దారవీడు, వై.డి.పాడు, బద్వీడు, కర్రోల, సీహెచ్ అగ్రహారం, బద్వీటి చెర్లోపల్లి, కంభంపాడులలో నిర్మాణ పనులు నిలిచిపోయి ఇప్పటికి ఏడేళ్లు గడిచింది. నిరుపయోగంగా ఉన్న అంగన్‌వాడీ భవనాలలో సమీపంలోని రైతులు తమ పశువులను కట్టేస్తున్నారు. దీంతో ఆయా భవనాలు పశువుల కొష్టాలుగా దర్శనమిస్తున్నాయి.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

మండలంలో నిలిచిన అంగన్‌వాడీ భవనాల పరిస్థితిపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. అధికారులు నిర్ణయించిన వెంటనే నిర్మాణ పనులకు చర్యలు తీసుకుంటాం.

- ఎం.లక్ష్మీదేవి, సూపర్‌వైజర్



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయాధికారి శాంతి

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

పర్చూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో మే 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారి పీ శాంతి పోలీసు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌ను కక్ష్యదారులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు చొరవ చూపాలన్నారు. అర్జీదారులు, కక్ష్యదారులతో చర్చలు జరిపి రాజీ మార్గంలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని న్యాయాధికారి శాంతి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మాల్యాద్రి, యద్దనపూడి ఏఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి

బల్లికురవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండల బారిన పడకుండా బల్లికురవ గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన తాగు నీటి చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని ఎంపీపీ బీశ్రీలక్ష్మి కోరారు. శనివారం బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ, ఎంపీడీవో కుసుమకుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వ ఆదేశాల మేరకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పం దిరి అంజిబాబు, ఈవోపీఆర్డీ సుమతి, గ్రామ టీడీపీ నేతలు గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకోండలు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ప్రతిభామూర్తుల చిత్రపటాలకు పూల మాలల వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

విలువలకు మూలస్తంభం నాగినేని

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : విలువల కోసం పదవులను, ఆస్తిపాస్తులను త్యజించిన రాజకీయ, సామాజిక విలువల మూలస్తంభం స్వాతంత్ర్య సరమయోధులు, అద్దంకి తొలి శాసనసభ్యుడు నాగినేని వెంకయ్య అని ఉపాన్యాసకులు, రిటైర్డ్ హెచ్‌ఎం కోట అంజమ్మ అన్నారు. శనివారం రాత్రి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి ఆధ్వర్యంలో ప్రతిభామూర్తులు- మధురస్మృతులు 42వ సభ చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మరాజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రతిభామూర్తులు నాగినేని వెంకయ్య, సినీ నటులు గొల్లపూడి మారుతీరావు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపన్యాసకులు చందలూరి నారాయణ రావు, సంఘ అధ్యక్షుడు కోటయ్య, రిటైర్డ్ పీఈటీ నర్రా నాగేశ్వరరావు, నాగినేని రామకృష్ణ, మన్నం త్రిమూర్తులు, చప్పిడి వీరయ్య, జ్యోతి చంద్రమౌళి, దేవపాలన, రామాంజనేయులు, డీవీఎం సత్యనారాయణ, శ్రీనివాసరావు, బాబురావు, బ్రహ్మం, మస్తానరావు పాల్గొన్నారు.

రాజకీయ కుట్రేనా?

మాజీ మంత్రి కాకానితో సంబంధాలపై ఆరా

మార్టూరు వైసీపీ నేత గోడౌను, ఫ్యాక్టరీలో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

పరారీలో పలువురు వైసీపీ నేతలు

ఉలిక్కిపడ్డ మార్టూరు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ నేత గోదాము, ఫ్యాక్టరీలలో భారీగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచటం వెనుక రాజకీయ కుట్ర ఉందన్న అనుమానాలపై పోలీసు దర్యాప్తు ప్రారంభమైంది. ముఖ్యంగా ఈ పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన వైసీపీ నేతకు మైనింగ్ కేసులో పోలీసులకు దొరకకుండా తిరుగుతున్న మాజీ మంత్రి కాకాని గోవర్థనరెడ్డికి ఉన్న సంబంధాలపై ఆరాతీయటం ప్రారంభించారు. గ్రానైట్ వ్యాపారం ముసుగులో భారీగా పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచిన ఆ నాయకుడు గతంలో పలు కేసులలో నిందితుడిగా ఉన్న నేపథ్యంలో తాజా ఘటన మార్టూరు, బల్లికురవ ప్రాంత గ్రానైట్ వ్యాపారులనే కాక యావత్తు పర్చూరు నియోజకవర్గ ప్రజానీకాన్ని ఉలికిపాటుకు గురిచేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్టూరు, బల్లికురవ ప్రాంతాలలో వైసీపీ నాయకుల గోదాములు, ఫ్యాక్టరీలలో భారీగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినట్లు బాపట్ల జిల్లా ఎస్పీకి నిఘా విభాగం నుంచి సమాచారం అందింది. ఆయన పకడ్బందీగా పోలీసులను రంగంలోకి దించి శనివారం సదరు వైసీపీ నేత గోదాములు, ఫ్యాక్టరీలపై దాడులు నిర్వహించారు. నాగరాజుపల్లి పరిధిలో గోదాములోను, బల్లికురవ వద్ద అతనికున్న గ్రానైట్ ఫ్యాక్టరీలోను భారీగా పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. టన్నుల కొద్దీ బయటపడటంతో పోలీసులు కూడా ఆశ్చర్యపోయ్యారు. అనుమతులు లేని శక్తివంతమైన పేలుడు పదార్థాలు నిల్వ ఉన్నాయని తనిఖీ చేసిన అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో రాష్ట్ర, జిల్లా స్థాయి పోలీసు అధికారులు రంగంలోకి వచ్చి మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేపట్టారు. ఆ గోదాము, ఫ్యాక్టరీలకు యజమానిగా ఉన్న హనుమంతరావు వైసీపీలో కీలక నేతగా ఉన్నారు. పార్టీ పెద్దల అండతో గతంలో పేలుడు పదార్థాల వ్యాపారం అక్రమంగా నిర్వహించారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా సదరు అక్రమ వ్యాపారం జోరుగానే సాగుతోంది. ఈ నేపథ్యంలో నిఘా విభాగం నుంచి సమాచారం మేరకు పోలీసులు రంగప్రవేశం చేసి టన్నులకొద్దీ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

ముమ్మర దర్యాప్తు

కాగా గ్రానైట్ క్వారీలకు అవసరమైన జిలిటెన్ స్టిక్స్ నిల్వ ఉంచేందుకు ఉన్న అనుమతికి మించి పెద్దమొత్తంలో వారు నిల్వ ఉంచటం ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు తేటతెల్లమైంది. దీంతో పోలీసులు మొత్తం వ్యవహారంపై దర్యాప్తునకు రంగంలోకి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు అధికారులు కూడా రంగంలోకి వచ్చారు. ఈ పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన వైసీపీ నేతకు నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి కాకానితో సంబంధాలు ఉన్నాయన్న అనుమానాలు ఉన్నాయి. మరో వైపు పదిరోజుల క్రితం మాజీ మంత్రి, ఆ జిల్లా వైసీపీ అధ్యక్షుడైన మేరుగ నాగార్జున అకస్మాత్తుగా మార్టూరు వచ్చారు. ప్రస్తుత కేసులో నిందితునిగా ఉన్న హనుమంతరావు లాడ్జికి సమీపంలో ఒక ప్రైవేటు ఆఫీసులో గంటలకొద్దీ తిష్టవేశారు. ఆ కార్యక్రమానికి పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి కూడా హాజరుకాలేదు. దీంతో మాజీమంత్రి నాగార్జున అకస్మాత్తుగా అంత రహస్యంగా ఎందుకు వచ్చినట్లు అన్న అనుమానాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. మైనింగ్ మాఫియా ఆరోపణలపై మాజీ మంత్రి కాకాని పరారీలో ఉండగా నాగార్జున మార్టూరుకు ఆకస్మికంగా వచ్చి హనుమంతరావుతో సమావేశమై వెళ్లారు. ప్రస్తుతం పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన వైసీపీ నేతకు, కాకానితో ఉన్న సంబంధాలు కూడా వెల్లడికావటంతో పోలీసులు ఆ వైపు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు.

గంజాయి సరఫరా ముఠా అరెస్టు

ఐదు కిలోలు స్వాధీనం

నిందితులు అంతర్ రాష్ట్ర సరఫరాదారులుగా గుర్తింపు

మార్కాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం ప్రాంతానికి గంజాయి సరఫరా చేసే ముఠాను మార్కాపురం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వీరిలో ఇద్దరు అంతర్‌రాష్ట్ర సరఫరాదారులు కూడా ఉండడం గమనార్హం. వివరాలను స్థానిక సీఐ పి.సుబ్బారావు తన కార్యాలయంలో వెల్లడించారు. ఈ నెల 8న స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రెండు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారికి ఎలా సరఫరా అవుతుందన్నది ఆరా తీసి పోలీసులు వివరాలు సేకరించారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న మరో ఇద్దరిని ఈ నెల 12న మార్కెట్ యార్డ్ సమీపంలో అరెస్టు చేశారు. అనంతరం వారిని, గంజాయి సేవించే వారిని పోలీసులు విచారించారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా, ఒడిస్సా రాష్ట్రం, విశాఖపట్నం జిల్లాలో పలు ప్రాంతాల్లో ప్రధాన సరఫరాదారుల కోసం గాలించారు. అయితే గంజాయిని సరఫరా చేసేందుకు ఆ ముఠా మార్కాపురం వచ్చిందని నిర్ధారించుకొని ప్రత్యేక నిఘా పెట్టారు. శుక్రవారం రాయవరం రైల్వేస్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టారు. అక్కడ నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. వీరు గంజాయిని తీసుకొచ్చి సరఫరా చేస్తున్నట్లు నిర్ధారించారు. వీరి వద్ద నుంచి ఐదు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వారిలో మార్కాపురం పట్టణంలోని ఆర్ఎంఎస్ స్కూల్ ప్రాంతానికి చెందిన బొమ్మిరెడ్డి ఉమామహేశ్వరరెడ్డి, అల్లూరి మన్యం జిల్లా దుబ్రిగూడ మండలం బీట్ర గండ గ్రామానికి చెందిన జెన్ని రామ్‌చందర్, ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందపూర్ తహసిల్‌కోనా గ్రామానికి చెందిన దంబూదర్ హంటల్, పడువా తహసిల్ కిరమ్‌బా గ్రామానికి చెందిన గుంత సురేష్‌లు ఉన్నారు. వీరంతా 25 సంవత్సరాలలోపు వయసు కలిగిన వాళ్లే. అందరూ గ్రూపుగా ఏర్పడి అరకు ప్రాంతం నుంచి నిషేధిత మాదకద్రవ్యం అయిన గంజాయిని మార్కాపురం తరలించి స్థానికంగా కొందరు ఏజెంట్ల విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మార్కాపురం డీటీ బి.శ్రీనివాసరావు మధ్యవర్తినామ ద్వారా వారిని కోర్టులో హాజరుపర్చారు. ప్రాథమిక సమాచారం ఆధారంగా లోతుగా విచారించి ఎస్పీ దామోదర్, మార్కాపురం డీఎస్పీ నాగరాజుల ఆదేశాల మేరకు కేసు ఛేదించినట్లు తెలిపారు.

కేసు ఛేదనలో చొరవ చూపిన పట్టణ, రూరల్ ఎస్సైలు సైదుబాబు, రాజమోహన్‌రావు, అంకమ్మరావులు పోలీసు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ రివార్డులు ప్రకటించారన్నారు. మార్కాపురంలో గంజాయి క్రయవిక్రయదారులపై పోలీసులు ఉక్కుపాదం మోపడాన్ని పలువురు స్థానికులు హర్షిస్తున్నారు. పది రోజుల వ్యవధిలో పోలీసులు మూడుసార్లు దాడులు చేసి గంజాయిని స్వాధీనం చేసుకొని ముఠాను అరెస్టు చేయడం గమనార్హం.





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సుబ్బారావు (ఇన్‌సెట్లో) స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

ఒంటరి మహిళలే లక్ష్యం

రెండు జిల్లాల్లో పలు దొంగతనాలు

ఇద్దరు అరెస్టు

డీఎస్పీ మొయిన్ వెల్లడి

మేదరమెట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఒంటరి మహిళలు కనిపిస్తే చాలు, వారి మెడలో బంగారు గొలుసులను తెంపుకుపోవడం ఒక ఎత్తయితే.. పారిపోవడానికి బైక్‌పై రెడీగా ఉండడం మరో ఎత్తు .. ఇద్దరూ జతకలిసి బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో మహిళల మెడలో చైన్‌లను దొంగిలించడంతో పాటు మోటార్ సైకిళ్లను కూడా చోరీ చేశారు. ఈ నెల 1వ తేదీన తిమ్మనపాలెంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకెళ్లారు. శనివారం చీరాల డీఎస్పీ మొయిన్ మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చైన్, బైక్‌ల చోరీలు, దొంగల వివరాలను వెల్లడించారు. 2024 జూన్‌లో మేదరమెట్లలో మరో మహిళ మెడలో చైన్‌లు తెంపుకెళ్లారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నంకు చెందిన దర్శనాల ఏడుకొండలు మహిళల మెడలలో చైన్‌లు దొంగిలించడంలో దిట్ట కాగా, ఈతమొక్కలకు చెందిన బైక్ మెకానిక్ షేక్ హషీద్. వీరిద్దరూ గతంలో పలు దొంగతనాల్లో ముద్దాయిలు. వీరిద్దరూ మోటర్ సైకిల్‌పై తిరుగుతూ ఒంటరిగా మహిళలు కనిపిస్తే వారి మెడలోని చైన్‌లను దొంగిలించేవారు. ఎఫ్ జడ్ వంటి వేగంగా వెళ్లే బైకులను కూడా వీరు దొంగతనం చేశారు. మేదరమెట్లలో జరిగిన దొంగతనంపై ఎస్పీ తుషార్ డూడీ, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ వైసురేష్, జె.పంగులూరు ఎస్ఐ డీ వినోద్‌బాబు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ 20 రోజుల పాటు దొంగలను పట్టుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. ఇటువంటి దొంగతనాలు ప్రకాశం జిల్లాలో ఎక్కడ జరిగాయో తెలుసుకొని విచారించారు. సీసీ పుటేజీలను పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎట్టకేలకు ఇద్దరు దొంగలను మేదరమెట్ల పైలాన్ సెంటర్‌లో పట్టుకున్నారు. వీరి నుంచి ఐదు చైన్‌లతో పాటు 126 గ్రాముల బంగారు వస్తువులు, యమహా ఎఫ్ జడ్ బైక్, మరో మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో వీళ్ల చీమకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 3, టంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, కొత్తపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 దొంగతనాలు చేశారు. వీరు చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. దర్శనాల ఏడుకొండలు ఇ క్కడ దొంగతనాలు చేసి కడప జిల్లా పోరు మామిళ్లలో విలాసవంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నాడు.

కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ వైసురేష్, జె. పంగులూరు ఎస్ఐ డి. వినోద్‌బాబు, ఐటీ - కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, కానిస్టేబుల్స్ తిరుపాలు, సురేష్, ఎన్. రమేష్‌ను ఎస్పీ తుషార్‌డూడీ, చారీల డీఎస్పీ మొయిన్ అభినందించడంతో పాటు వారికి నగదు రివార్డులను అందజేశారు.



మహిళల మెడలో గొలుసులను దొంగిలించిన నిందితులను, చైన్‌లను చూపుతున్న డీఎస్పీ మొయిన్, ట్రైనీ డీఎస్పీ అభిషేక్ తదితరులు

విద్యార్థులకు పరీక్ష

రేపు చీరాల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతికి ప్రవేశ పరీక్ష

ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల నుంచి సుమారు 167 మంది హాజరయ్యే అవకాశం

కనీస వసతుల కరువు

రోడ్ల వెంట చెట్ల నీడే దిక్కు

ఏటా ఎండాకాలంలో అవే ఇక్కట్లు

ఈసారైనా సౌకర్యాలు కల్పిస్తారా?

చీరాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని జాతీయ రహదారిలో వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం 6వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు చిన్నారులను తీసుకువచ్చే తల్లిదండ్రులకు అగ్ని పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనుండగా అధికారులు సంబంధిత హాల్ టికెట్‌తో స్కూల్ వద్దకు 8 గంటలకే చేరుకుని ఆయా ప్రాసెస్ చేసుకోవాలని ఇప్పటికే సూచించారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచే పరీక్ష కేంద్రానికి గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు, ఏలూరు జిల్లాల నుంచి సుమారు 167 మంది చిన్నారులతో త్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి చేరుకునే అవకాశం ఉంది. అయితే దూర ప్రాంతాల నుంచి పరీక్షకు చిన్నారులను తీసుకువచ్చిన తల్లిదండ్రులకు పాఠశాల సమీపంలో అధికారులు నిలువ నీడ కూడా ఏర్పాటు చేయడం లేదు. తాగు నీటి సౌకర్యం కూడా కల్పించడం లేదు. ఈక్రమంలో స్కూల్ సమీపంలో ఎర్రటి ఎండలో బతుకు జీవుడా అంటూ తల్లిదండ్రులు ఏటా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. సమీపంలో చిన్నపాటి దుకాణాలు కూడా లేక తాగునీరు లేక అల్లాడుతున్నారు. చేసేది లేక పిల్లలు పరీక్ష రాసి తిరిగి వచ్చే వరకూ ఎండను తట్టుకుంటూ రోడ్ల వెంట ఉన్న చెట్ల నీడలో నిరీక్షిస్తున్నారు. ఈక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కనీసం పరీక్ష కేంద్రానికి కాస్త దూరంగా ఒక చిన్న షామియానాను, తాగునీటి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది. సంబంధిత అధికారులు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయకుం డా విద్యార్థుల తల్లిదండ్రులపై ఇంత చిన్నచూపు చూడడంపై సర్వత్ర విమర్శలు విన్పిస్తున్నాయి. ఏటా మాదిరిగానే ఏ సారి కూడా రేపు పరీక్షలు జరుగనున్నాయి. అయితే ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా కనీసం జిల్లా యంత్రాంగమైనా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రుల సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.



ఎండకు చెట్ల కింద సేద తీరుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు (ఫైల్)

వైసీపీ నేత గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీలు

2300 ఎలక్ట్రానిక్ డిటోనేటర్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

బల్లికురవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత దాసం హనుమంతరావుకు చెందిన, మూసి వేసి ఉన్న ప్రసన్నాంజనేయ గ్రానైట్ ఫ్యాక్టరీలో నిల్వ ఉంచిన నిషేధిత బ్లాస్టింగ్ ఎలక్ట్రానిక్ డిటోనేటర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కొణిదెన రెవెన్యూ పరిధిలో ఉన్న మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతరావుకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీలో నిషేధిత బ్లాస్టింగ్ ఎలక్ట్రానిక్ డిటోనేటర్‌లు నిల్వ ఉంచారు. సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్సై నాగరాజు, ఆర్ఐ పోతురాజు, వీఆర్‌వో సాయి శనివారం తనిఖీలు చేశారు. ఈ దాడులలో 2300 బ్లాస్టింగ్ ఎలక్ట్రానిక్ డిటొనేటర్‌లు ఒక వాహనంలో నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని బల్లికురవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కనీస నిబంధనలు కూడా పాటించకుండా పేలుడు పదార్థాలను క్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తనిఖీలు చేసినట్లు తెలుస్తుంది. ఈ కేసులో దాసం హనుమంతరావు, దాసం వీరాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



మాలకాటికాపరి వేషధారణతో శవాన్ని దహనం చేస్తున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు వసంతరావు

ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ వినూత్న నిరసన

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాలమహానాడు రాష్ట్రఅధ్యక్షుడు బీళ్లా వసంతరావు వినూత్న రీతిలో శనివారం నిరసన తెలిపారు ఒంగోలులోని శ్మశాన వాటికలో మా వృత్తి- మా సంస్కృతిలో ఒక వృత్తి అయిన మాలకాటికాపరి వేషధారణతో శవాన్ని దహనం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఎస్సీ వర్గీకరణ వల్ల మాలజాతికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఒంగోలుకు రెండో బైపాస్

(7వ పేజీ తరువాయి)

అవుతుందని అంచనా వేస్తున్నారు. కేంద్రప్రభుత్వ ఆర్థిక పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని రెండో ప్రతిపాదనను కూడా సిద్ధం చేస్తున్నారు. త్రోవగుంట సమీపంలోని చీరాల రోడ్డు నుంచి లింగంగుంట, పేర్నమిట్ల మీదుగా మంగమూరు, భగీరథ ప్యాక్టరీ, చెరువుకొమ్ముపాలెం పక్కగా బీఈడీ కాలేజీ వద్ద జాతీయ రహదారిలో కలిపేందుకు మరో డీపీఆర్ నివేదికను రూపొందించినట్లు సమాచారం. ఈ ప్రాజెక్టుకు రూ.800 కోట్లు వ్యయం అవుతుందని సమాచారం. ఇటీవల సంబంధిత అధికారులు ఎంపీ మాగుంటతో కూడా చర్చించినట్లు సమాచారం. అయితే కేంద్రం రూ.వెయ్యి కోట్ల ప్రాజెక్టుకు త్వరగా అనుమతులు ఇస్తున్నందున తదనుగుణంగా డీపీఆర్‌లను సిద్ధం చేయాలని సూచించారు. అవి సిద్ధమయ్యాక సంబంధిత శాసనసభ్యులతో సమావేశం నిర్వహించనున్నారు. వాటిని ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించి అక్కడి నుంచి కేంద్రప్రభుత్వానికి పంపే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం.



గేటు పడటంతో భారీగా నిలిచిపోయిన వాహనాలు

గేటు పడితే అంతే సంగతులు

- కారంచేడు రైల్వే గేటు వద్ద నిత్యం భారీగా స్తంభిస్తున్న ట్రాఫిక్

పేరాల(చీరాల), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పేరాల పరిధిలోని కారంచేడు రైల్వే గేటు వద్ద ట్రాఫిక్‌తో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో భారీ, చిన్న, పెద్ద వాహనాలు తిరుగుతుంటాయి. అయితే ఇక్కడి రైలు మార్గంలో నిత్యం రైళ్ల రాకపోకలు అధికంగానే ఉంటుంటాయి. అలాగే కారంచేడు, పర్చూరుతో పాటు గేటు అవతలి వైపు నుంచి చీరాల, బాపట్లకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఈక్రమంలో రైల్వే గేటు పడితే వాహనాలు కోకొల్లలుగా నిలిచి పోతున్నాయి. దీంతో ఎండలో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే మరి కొందరు ఆకతాయిలు రెండు వరుసల్లో వాహనాలు నడుపుతూ ట్రాఫిక్‌కు మరింత అసౌకర్యం కలిగిస్తున్నారు. దీంతో ప్రజలు, ఉద్యోగులు ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో ప్రథమ స్థానం సాధించాలి

పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్ పిలుపు

ఒంగోలులో అవగాహన ర్యాలీ

పాల్గొన్న కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల



అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న స్పెషల్ ఆఫీసర్ సురేష్

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రమైన, స్వచ్ఛమైన నగరంగా ఒంగోలును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మునిసిపల్ పరిపాలన, అర్బన్ డెవలప్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా ప్రత్యేకాధికారి ఎస్. సురేష్‌కుమార్ పేర్కొన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఉదయం ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాల నుంచి ఊరచెరువులోని ఈ వ్యర్థాల నిల్వ కేంద్రం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. మెప్మా, ఒంగోలు నగరపాలక సంస్థ సంయుక్త నిర్వహణలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కమిషనర్ కే. వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. వ్యర్థాల సేకరణ, వాటిని సురక్షిత పద్ధతుల్లో రీసైక్లింగ్ చేయడం అనే నినాదంతో నిర్వహించిన ర్యాలీని పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఎస్. సురేష్ కుమార్, కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, మేయర్ గంగాడ సుజాత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సురేష్ కుమార్ మాట్లాడుతూ పరిశుభ్రత అనేది ఒకరోజుతో వచ్చేది కాదని అది జీవితంలో భాగం కావాలని అన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం రోజు రోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఈ-వేస్ట్ అనేది పెద్ద సమస్యగా మారిందన్నారు. నిరుపయోగంగా ఉన్న ఈ వ్యర్థాలను సురక్షితంగా రీసైక్లింగ్ చేసేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందన్నారు. ఒంగోలు నగరం కూడా మరో ఇండోర్ నగరంగా మారి 15వ స్థానం నుంచి స్వచ్ఛతలో రాష్ట్రంలో ప్రథమ స్థానం సాధించాలని పిలుపునిచ్చారు.

10వేల జనాభా కలిగిన ప్రాంతాల్లో ఈ-వ్యర్థాల సెంటర్లు

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి నెలా మూడవ శనివారం నిర్వహిస్తామని తెలిపారు. ఈ-వ్యర్థాలను సురక్షితంగా నిర్వహణ చేయాలన్న లక్ష్యంతో ఒంగోలు నగరంలో ట్రిపుల్ ఆర్ సెంటర్లు (ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలు) ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 10 వేల జనాభా పైబడి ఉన్న గ్రామ పంచాయతీల్లో కూడా ఈ వ్యర్థాల సేకరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుకోసం మెప్మా సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

ఒంగోలును రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలపాలి : దామచర్ల

ఒంగోలును రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తెలిపారు. మన పరిసరాలు, మన ఊరు పరిశుభ్రంగా ఉండాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం రాష్ట్రంలోని అన్నీ మునిసిపాలిటీలు, కార్పొరేషన్‌లకు ఆదర్శం కావాలని పిలుపునిచ్చారు. ఒంగోలును ప్రథమ స్థానంలో నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని అన్నారు. మేయర్ గంగాడసుజాత మాట్లాడుతూ ప్రపంచీకరణలో రోజు రోజుకు ఎలక్ట్రానిక్ వస్తువుల వినియోగం పెరిగిందని, పాడైపోయిన వస్తువులను ఈ-వేస్ట్ గా గుర్తించి, నిర్మూలించాలన్నారు. ఏపీ టూరిజం బోర్డు ఛైర్మన్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యం ఉన్నపుడే ఏ కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీమేయర్ వేమూరి బుజ్జి, స్థానిక కార్పొరేటర్ శైలజ, జడ్పీ సీఈవో చిరంజీవి, మెప్మా పీడీ శ్రీహరి, డ్వామా పీడీ గంగవరపు జోసఫ్ కుమార్, పలు ప్రభుత్వ శాఖల అధికారులు, మెప్మా ఉద్యోగులు, ఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం ఈ-వేస్ట్ నిర్వహణ కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు.



ఈ వేస్ట్ నిర్వహణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన కలెక్టర్ అన్సారియా, స్పెషల్ అధికారి సురేష్, టూరిజం బోర్డుచైర్మన్ బాలాజీ, తదితరులు



కాలువ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డివిజన్ అధ్యక్షుడు మేడికొండ మోహన్

37వ డివిజన్‌లో ముమ్మరంగా అభివృద్ధి పనులు

- ఏబీఎన్-ఆంధ్రజ్యోతి చొరవతో రోడ్లు, సైడు కాలువల నిర్మాణానికి శ్రీకారం

ఒంగోలు, కార్పొరేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అక్షరమే అండగా, పరిష్కారమే అజెండాగా ఆంధ్రజ్యోతి చొరవతో ఒంగోలులోని 37వ డివిజన్‌లో అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. జనవరి 28వ తేదీన స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కార్పొరేషన్ కమిషనరు వెంకటేశ్వరరావు, ఇతర అధికారుల సమక్షంలో ఎన్టీఆర్ పార్కులో డివిజన్ సమస్యలపై ప్రజల మధ్య ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన చర్చావేదికతో అభివృద్ధి పనులకు శ్రీకారం పలికారు. ఈ మేరకు డివిజన్‌లోని పలు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మొదటగా రూ. కోటితో పనులు జరుగుతుండగా ఎన్టీఆర్ పార్కు అభివృద్ధి కమిటీ ప్రతినిధులు పార్కులో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా ఆ పనులు జరుగుతున్నాయి. అందులో పార్కు ఎత్తును పెంచడంతో పాటు, వాకింగ్ ట్రాక్ నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఇదిలా ఉండగా నాలుగైదు రోజుల నుంచి డివిజన్‌లో రెండు రోడ్లు, నాలుగు సైడు కాలువల పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా కొన్నేళ్లుగా ఆ డివిజన్‌లో పలు సమస్యలు పరిష్కారానికి నోచుకోక, తిష్ఠ వేయగా, ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండా'తో ఆ డివిజన్‌లో అభివృద్ధి పనులు ముందడుగు వేస్తున్నాయి.

శ్రీరామునిగా చెన్నకేశవుడు



మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలలో భాగంగా మార్కాపురంలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి శ్రీరాముని అలంకారంలో శనివారం భక్తులకు దర్శనం ఇచ్చారు. హనుమంత వాహనంపై చెన్నకేశవుడిని శ్రీరాముని అలంకారంలో ఆలయ ప్రధానార్చకులు శ్రీపతి అప్పనాచార్యులు సర్వాలంకార శోభితుడను చేసి వేంచేపు చేశారు. నాలుగు మాడవీధులలో విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకుని భక్తులు తన్మయత్వంలో మునిగిపోయారు. వాహనం ముందు సీతారామ సమేత హనుమంతుడు, హనుమంత రాక్షస సంగ్రామం, కళాకారుల అగ్నివిన్యాసాలు, తీన్మార్ తప్పెట్లు, వివిధ భజనబృందాల కోలాటాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే అన్నారాంబాబు, మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ, టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షులు వక్కలగడ్డ మల్లికార్జునరావు తదితరులు వాహన సేవలో పాల్గొన్నారు.

నేడు గరుడ వాహన సేవ

బ్రహ్మోత్సవాలలో అతి ముఖ్యమైనది గరుడవాహన సేవ. ఆదివారం గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు అలంకారంలో చెన్నకేశవుడు నాలుగు మాడవీధులలో విహరించనున్నారు.



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు (ఇన్‌సెట్లో) హనుమంతవాహనంపై శ్రీరామునిగా విహరిస్తున్న చెన్నకేశవుడు




సీతాహనుమంత్ సమేత శ్రీరామ అలంకారంలో కళాకారులు



బ్రహ్మోత్సవాల సందర్భంగా చిన్నారుల కోలాటం



కళాకారుని విన్యాసం



వాహన సేవలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

స్థానిక వనరులతో అభివృద్ధి

జిల్లా స్పెషలాఫీసర్ సురేష్‌కుమార్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ సురేష్‌కుమార్

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా స్థానిక వనరులను సద్వినియోగం చేసుకొని జిల్లా అన్ని విధాలా అభివృద్ధి చెందేలా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ ఎస్. సురేష్‌కుమార్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ఈ దిశగా సమర్థవంతంగా అమలు చేసేలా దృష్టిసారించాలని ఆదేశించారు. శనివారం జిల్లాకు వచ్చిన సురేష్‌కుమార్ స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాకు తనను ప్రత్యేక అధికారిగా నియమించినందున ప్రతినెలా 1వతేదీ, మూడో శనివారం జిల్లాకు వస్తానని తెలిపారు. జిల్లా అభివృద్ధికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన ప్రత్యేక నిర్ణయాలు ఏమైనా ఉంటే కలెక్టర్ ద్వారా తన దృష్టికి తేవాలన్నారు. పథకాల ప్రయోజనాలు అందుతున్న తీరుపై ఐవీఆర్ఎస్ ద్వారా ప్రజల నుంచి ప్రభుత్వం సమాచారం సేకరిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. గ్రీవెన్స్, ధాన్యం సేకరణ, దీపం, అన్నా క్యాంటిన్, రెవెన్యూసదస్సులు, విద్య, వైద్యం, సంక్షేమం, పౌరసరఫరాలు, వ్యవసాయం ఉద్యానవనం, పశుసంవర్ధకశాక, పారిశుధ్యం, తాగునీరు. పీఎం సూర్యఘర్, డ్వామా, హౌసింగ్, టిడ్కో తదితర అంశాలపై సమీక్షించి సంబంధిత అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రెవెన్యూ, మీకోసంలో వచ్చిన అర్జీల పరిష్కారంలో ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలకు సంబంధించి అర్జీల పరిష్కారంలో సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నట్లు తెలిపారు. అసైన్డ్‌భూములు, నిషేధిత జాబితాల్లోని భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వం నిర్ణయంతీసుకోవాల్సిన కేసులు కూడా ఉన్నాయని తెలిపారు. మండల స్థాయి నుంచి ఈకేసులను రాష్ట్ర ప్రభుత్వానికి అధికారులు నివేదిస్తున్న క్రమంలో తమ సమస్యలు పరిష్కారం కాలేదంటూ అర్జీలను ప్రజలు రీఓపెన్ చేస్తున్నారని తెలిపారు. రీ ఓపెన్ అవుతున్న అర్జీలను ఆడిట్ చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈసమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, ఒంగోలు, కనిగిరి ఆర్డీవోలు లక్ష్మీ ప్రసన్న, కేశవర్ధన్‌రెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లుతో పాటు ఆయా శాఖల అధికారులు ఉన్నారు. ముందుగా బంగారు బాల్యంకార్యక్రమానికి సంబంధించి ప్రకాశం భవన్‌లోఏర్పాటు చేసిన జిల్లా రిసోర్స్ సెంటర్‌ను సురేష్‌కుమార్ సందర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అన్సారియా

పీఎం సూర్యఘర్ అమలును వేగవంతం చేయాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పీఎం సూర్యఘర్ అమలును వేగవంతం చేసి రోజువారీ పురోగతి సాధించాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో శనివారం సాయంత్రం సంబంధిత శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాలో పీఎం సూర్యఘర్ పథకం కింద ఇప్పటి వరకు 78,766 దరఖాస్తులు రాగా అందులో 1,115 దరఖాస్తులు గ్రౌండింగ్ చేయగా 736 మందికి సబ్సిడీ జమ చేశామన్నారు. నియోజకవర్గానికి పదివేల లక్ష్యాన్ని నిర్దేశించామని తెలిపారు. గ్రామాల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో తూర్పునాయుడుపాలెం, శంఖవరం, నాగంబొట్లపాలెం, సింగరాయకొండ, బేస్తవారిపేట గ్రామాలను ప్రత్యేక గ్రామాలుగా ఎంపిక చేసి ఆ గ్రామాల్లో సౌర విద్యుత్‌వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చేపట్టిన చర్యలు, పురోగతిపై కలెక్టర్‌స మీక్షించి దిశా నిర్దేశం చేశారు. సౌర విద్యుత్ వినియోగంపై ప్రజలకు అ వగాహన కల్పించాలని, ప్రభుత్వం ఇస్తున్న రాయితీలను ప్రజలక వివరించాలని సూచించారు. సమావేశంలో ఆయాశాఖల అధికారులు వెంకటేశ్వర్లు,చిరంజీవి, నారాయణ, రమేష్, సోలార్ విద్యుత్ ఏజెన్సీల ప్రతినిధులు ఉన్నారు.

24 నుంచి టీచర్లకు మెడికల్ క్యాంపులు

- మూడు రోజుల పాటు జీజీహెచ్‌లో నిర్వహణ
- బదిలీల కోసం సర్టిఫికెట్లు జారీ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల బదిలీల్లో వైద్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేందుకు ఈనెల 24 నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన వైద్యశాల (జీజీహెచ్) స్పెషలిస్టు డాక్టర్లతో ఈ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో బదిలీల కోసం దరఖాస్తు చేసే వారు ప్రత్యేక పాయింట్లు, ప్రాధాన్యత కేటగిరీలో బదిలీ కోరుకునే ఉపాధ్యాయులందరూ ఈ క్యాంపులో వైద్య ధ్రువీకరణ పత్రాలు పొంది బదిలీ దరఖాస్తుతోపాటు సమర్పించాల్సి ఉంటుందన్నారు. 40 నుంచి 69 శాతం వరకు అంగవైకల్యం, శారీరక వైకల్యం ఉన్న వారికి ప్రత్యేక పాయింట్లు, 70 నుంచి 80 శాతంపైగా వైకల్యం ఉన్న వారికి ప్రాధాన్యత కేటగిరీలో బదిలీ కల్పిస్తామన్నారు. టీచర్ పోస్టుకు పీహెచ్ కేటగిరీ రిజర్వేషన్‌లో ఎంపికైన వారు కూడా ఈ శిబిరానికి హాజరై మెడికల్ బోర్డు ద్వారా సర్టిఫికెట్లు పొందాలన్నారు. అంగవైకల్యానికి సంబంధించి సదరమ్ జారీ చేసిన ధ్రువీకరణ సర్టిఫికెట్ ఉన్నవారు సైతం తాజాగా మెడికల్ బోర్డు సర్టిఫికెట్ తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. కేన్సర్, న్యూరో సర్జరీ, స్పెషల్ సర్జరీ, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్, టీబీ, కిడ్నీ, ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్, డయాలసిస్, హార్ట్‌హోల్, తలసేమియా, హీమోఫీలియా, జువెనల్ డయాబెటిస్ ఉన్న పిల్లలు తదితర వ్యాధులకు సంబంధించి చికిత్సపొందుతున్న వైద్య పత్రాలు, మెడికల్ బోర్డులో డాక్టర్లకు చూపించి ధ్రువీకరణ పత్రం పొందాల్సి ఉంటుందన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో 'నారాయణ' హవా



విజయసంకేతం చూపుతున్న విద్యార్థులు, నిర్వాహకులు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో ఒంగోలులోని నారాయణ జూనియర్ కళాశాలల విద్యార్థులు సత్తా చాటా రు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కళాశాలలో జరిగిన సమావేశంలో జిల్లా కోర్ డీన్ ఆర్.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షకు హాజరైన వారిలో 23 మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. గణితశాస్త్రంలో 99.62 పర్సంటైల్, భౌతిక శాస్త్రంలో 99.81, రసాయనశాస్త్రంలో 96.01 పర్సంటైల్ సాధించారని చెప్పారు. ఉత్తమ సాధించిన విద్యార్థులను, ఇందుకు కృషి చేసిన అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ఏజీఎం మురళి, ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, ఎన్.సుజాత, బి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలో శనివారం రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా స్థానిక జువెట్ మెమోరియల్ చర్చి వద్ద నుంచి నగర వీధుల్లో కొనసాగిన ర్యాలీలో పలు చర్చిల పాస్టర్లు, సంఘ పెద్దలు, ఎవాంజిలిస్టులు, క్రైస్తవులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ తేళ్ళ ఇమ్మానుయేలు మాట్లాడుతూ ప్రపంచ శాంతి కోసం ప్రతి సంవత్సరం రన్‌ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాస్టర్ భగవాన్ దాస్, రావూరిజోసఫ్, విలియం కేరీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. ఈమేరకు శనివారం ఒంగోలులో పురపాలక శాఖ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్‌కు, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌లను వారు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్‌గా అప్‌గ్రేడ్ చేయాలని, ఉద్యోగోన్నతులు కల్పించాలని, నిర్దిష్టమైన జాబ్‌ఛార్టర్ ప్రకటించడంతోపాటు, డిపార్ట్‌మెంట్‌ల వారీగా సీనియర్ జాబితా ప్రకటించాలని విన్నవించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇప్పించాలని, సెక్రటరీలకు బీఎల్‌వో విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. వార్డు విద్యా సెక్రటరీలను విద్యాశాఖ అనుబంధశాఖలలో విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కె.ప్రభాకర్‌రావు, ప్రధానకార్యదర్శి షేక్ గౌస్‌బాషా, కోశాధికారి వి.ఆంజనేయులతోపాటు, మహిళ అధ్యక్షురాలు షేక్ షహీదా, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మాగుంటకు మంత్రి పరామర్శ

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బైపాస్ సర్జరీ చేయించుకున్న ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణ పరామర్శించారు. నెల్లూరులోని మాగుంట కార్యాలయంలో శనివారం మంత్రి నారాయణ ఎంపీ మాగుంటను కలిసి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణను శాలువతో సత్కరించారు. అనంతరం ఇరువురు చర్చించుకున్నారు.

రైజ్ విద్యార్థులకు ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 16మంది ఇన్ఫోసిస్‌లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. శనివారం స్థానిక కళాశాలలో నిర్వహించిన క్యాంపస్‌డ్రైవ్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని డైరెక్టర్ ఏవీ.భాస్కరరావు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపిక విద్యార్థులకు రూ3.60 లక్షల వార్షిక ప్యాకేజీ లభిస్తుందన్నారు. అనంతరం వారిని కళాశాల గౌరవచైర్మన్ ఇస్కాల చినరంగమన్నారక్, రఘుబాబు, శిద్దా భరత్, శిద్దా ప్రవల్లిక అభినందించారు.

ఉద్యమంలా ఈ-వేస్ట్ సేకరణ

ఉత్సాహంగా పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు ● కార్యాలయాలు, దుకాణాల నుంచి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించిన సిబ్బంది





చీమకుర్తి, ఒంగోలులో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించిన అధికారులు, సిబ్బంది

చీమకుర్తి, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి) : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనలో భాగంగా శనివారం ఈ-వేస్ట్(ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) సేకరణ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టారు. చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాల నుంచి మున్సిపల్ సిబ్బంది ఈ-వేస్ట్ సేకరణ చేశారు. దాదాపు 50కేజీలకు పైగా ఒక్కరోజులోనే సేకరించడం విశేషం. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే బృహత్తరమైన ఈ కార్యక్రమానికి పట్టణవాసులందరూ సహకరిస్తుందన్నందుకు కమిషనర్ వై.రామకృష్ణయ్య ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గొల్లపూడి రమాదేవి, గోరంట్ల అంజలి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు

ఒంగోలు(రూరల్): ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఎంపీడీవో కె.రాజశేఖర్‌రావు అన్నారు. శనివారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏవో శేషుబాబు, ఏఈ రామ్‌కుమార్, ఏపీవో వెంకటరావు సిబ్బంది పాల్గొన్నారు

కార్యాలయాల ప్రాంగణాలు శుభ్రం

కొండపి: మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఉన్న చెత్త, పిచ్చిచెట్లను తహసీల్దార్ పి.మురళి ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు తొలగించారు. సచివాలయ ప్రాంగణంలో ఈ-వేస్ట్ సేకరణ, పరిసరాల పరిశుభ్రతపై గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నం రామ్మోహన్ అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. సచివాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. గ్రామ పంచాయతీల్లోని కాలువల్లో మురుగును తీసి, రోడ్లను చిమ్మి బ్లీచింగ్ చల్లారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పొన్నలూరు: పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీవో సుజాత సూచించారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని చెరుకూరు పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ-వేస్ట్ పోగుపడకుండా గ్రామ పంచాయతీ తగిన జాగ్రత్తలు తీసుకుని ఒకచోటుకు చేర్చి రీసైక్లింగ్ చేసే సంస్థలకు అప్పగించాలని సూచించారు. సమావేశంలో సర్పంచ్ కాలే అయ్యన్న, డిప్యూటీ ఎంపీడీవో కె.నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మహేంద్రరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి జె.రవిబాబు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.

స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర సాధనే లక్ష్యం

మద్దిపాడు: రాష్ట్రాన్ని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రగా తీర్చిదిద్దడమే సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు పేర్కొన్నారు. శనివారం గుండ్లాపల్లిలోని చెత్త సంపద కేంద్రం వద్ద ఎంపీడీవో శ్రీనివాసప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత వైసీపీ పాలనలో పారిశుధ్య విషయంలో తీవ్ర నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సత్కరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బాబు, ఏపీవో ధనుంజయవర్మ, ఆర్ఐ రమణయ్య, వీఆర్వో రమేష్, పంచాయతీ కార్యదర్శి లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

డీజేఆర్ ట్రస్ట్ ప్రజాసేవకే అంకితం

● ఎమ్మెల్యే దామచర్ల

● నగరంలో 25 చలివేంద్రాల ఏర్పాటు



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): డీజేఆర్ ట్రస్ట్ సమాజ శ్రేయస్సు కోసం మరింత కృషి చేస్తోందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. వేసవి దృష్ట్యా నగర ప్రజల కోసం డీజేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం 25 ప్రాంతాల్లో చలివేంద్రాలను ఎమ్మెల్యే జనార్దన్, సతీమణి నాగసత్యలతతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీజేఆర్ ట్రస్ట్ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు అనేకమంది వీధి వ్యాపారులకు ఉచితంగా తోపుడు బండ్లు, వేసవిలో వీధి వ్యాపారులకు పెద్ద గొడుగులు అందించినట్లు చెప్పారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్కూల్స్‌లో విద్య అందించడం కోసం టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించి చదువు చెప్పించి, అవసరమైన పుస్తకాలు, ఫీజులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత కోసం ప్రతి ఏడాది మెగా జాబ్ మేళాలు నిర్వహించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ వివరాలను నమోదు చేయాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో వాణిశ్రీ

సింగరాయకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చిన్నారులకు వేసే వ్యాక్సిన్‌ల సమాచారాన్ని ఎప్పటికప్పుడు విధిగా నమోదు చేయాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో వాణిశ్రీ సూచించారు. సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని బైరాగిమాన్యం అంగన్‌వాడీ సెంటర్‌లో జరుగుతున్న జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. యూవిన్ యాప్‌లో టీకాల సమాచారాన్ని నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో మోహన్‌రావు, సీహెచ్‌వో పీరయ్య, ఆరోగ్య పర్యవేక్షకుడు సయ్యద్ మసూద్‌అలీ పాల్గొన్నారు.

జేఈఈలో 'శ్రీసరస్వతి' విజయభేరి



చైర్మన్ రమణారెడ్డిని సత్కరిస్తున్న అధ్యాపకులు

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్(సెషన్-2) 2025 ఫలితాల్లో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయభేరి మోగించారు. జాతీయస్థాయిలో 99.21 పర్సంటైల్ సాధించి టాపర్‌గా నిలిచారు. కళాశాల విద్యార్థి ఎస్.ఇంద్రసేనారెడ్డి 99.2, కె.లోక్‌క్రితి 98.82, కె.గుణశేఖర్‌రెడ్డి 98.71 పర్సంటైల్‌తో టాపర్లుగా నిలిచారు. కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో ర్యాంకులు కూడా సాధించారు. ఎం.రఘునాథ్ 29, కె.లోక్‌క్రితి 453, వి.మణికంఠబాబు 1329, ఎస్.ఇంద్రసేనారెడ్డి 1563, బి.రిత్విక్ 1632, జి.ఎనూష్‌రాయ్ 1870, గుణశేఖర్‌రెడ్డి 2698 ర్యాంకులు సాధించారు. 20 మంది విద్యార్థులు 90పైన, 54మంది 80కిపైగా, 130 మంది 70కిపైగా పర్సంటైల్ సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 181 మంది అర్హత సాధించగా ఏడుగురు జాతీయ స్థాయిలో 3వేలలోపు ర్యాంకులు పొందారు. జేఈఈ మెయిన్స్ సెషన్‌లో కె.లోక్‌క్రితి 99.94 పర్సంటైల్‌తో జాతీయస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. జేఈఈలో అత్యధిక పర్సంటైల్, జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను శనివారం స్థానిక శ్రీసరస్వతి విద్యాసంస్థలో చైర్మన్ ఏవీ.రమణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, గంగా శివశంకర్‌రెడ్డి, సీఈవో ఎస్‌వీ.సురేష్, డీన్‌లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

జేఈఈలో 1,561 ర్యాంకు



హాసిని

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ విద్యాసంస్థల్లో బీటెక్‌లో ప్రవేశానికి నిర్వహించిన జేఈఈ మెయిన్స్‌లో ఒంగోలు విద్యార్థిని ఆర్‌పీ.హాసిని జాతీయస్థాయిలో 1,561 ర్యాంకు సాధించారు. పరీక్షల్లో 99.90 పర్సంటైల్ సాధించి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. హాసిని తండ్రి కృష్ణారెడ్డి ఏఈపీఏస్‌జీవో సంఘం కార్యదర్శిగా ఉండగా, తల్లి జ్యోతి ఉపాధ్యాయురాలు. జేఈఈలో మంచి ర్యాంకు సాధించిన హాసినిని పలువురు అభినందించారు.

'ఉమామహేశ్వర'కు ఉత్తమ ర్యాంకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా జేఈఈ మెయిన్స్‌లో ఒంగోలులోని ఉమామహేశ్వర జూనియర్ కళాశాల విద్యార్థులు పలు ర్యాంకులు సాధించారు. వి.దీపక్ 15,586, డి.ఈశ్వరమణికంఠ 20,492, డి.మెర్సీబబు 32,312, ఆర్.పూజశ్రీ 36,417, ఎన్.ప్రేమ్‌సాయి 39,481, డి.యామిని 40,469 ర్యాంకులను సాధించారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక కళాశాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు సి.మలేశ్వరరావు, సి.జయలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

జేఈఈలో 'రేస్' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్‌లో ఒంగోలులో రేస్ జూనియర్ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఆర్.సాయిగౌతమ్‌భరద్వాజ్ 99.66 పర్సంటైల్, ఎం.ధనశ్రీ 95.52, కోన హాసిని 94.45, పి.విష్ణుప్రియ 93.15, బి.చందన 92.64 పర్సంటైల్ సాధించారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు 20 మంది విద్యార్థులు క్వాలిఫై అయ్యారు. సాధారణ విద్యార్థులతో అసాధారణ ఫలితాలు సాధించినట్లు నిర్వాహకులు తెలిపారు. అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థులను స్థానిక కళాశాలలో డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

గుండ్లాపల్లి పాఠశాలకు సామగ్రి వితరణ



సైకిళ్లు, ఇతర సామగ్రిని అందజేస్తున్న దాతలు

మద్దిపాడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గుండ్లాపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు మిడ్‌వెస్ట్ కంపెనీ ప్రతినిధి అంబటి శ్రీనివాసరావు రూ.3.5లక్షల విలువైన సామగ్రిని అందించారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా పాఠశాలకు 9 సీసీ కెమేరాలు, కంప్యూటర్, 25 సైకిళ్లు, లైబ్రరీకి నాలుగు పెద్దబల్లలు, 40 కుర్చీలు, డబుల్ బ్యాటరీ ఇన్వర్టర్ అందించినట్లు ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా మిడ్‌వెస్ట్ కంపెనీకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎండీసీ పీడీ శివప్రసాద్‌రెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒంగోలు మండల ఏపీవోగా నాగేశ్వరరావు

ఒంగోలు(రూరల్), ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండల ఉపాధి హామీ పథకం ఏపీవో బి.నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీవో పి.వెంకటరావు కొండపి మండలానికి బదిలీ అయ్యారు. కాగా నాగేశ్వరరావు వెలిగండ్ల మండలం నుంచి బదిలీపై వచ్చారు.

'నేషనల్ హెరాల్డ్'పై సమగ్ర విచారణ చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నేషనల్ హెరాల్డ్ కుంభకోణంపై సమగ్ర విచారణ చేసి అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్ చక్రవర్తి డిమాండ్ చేశారు. భారతీయ జనతా యువ మోర్చా ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట మోర్చా అధ్యక్షుడు పువ్వాడి దామోదర్ చౌదరి అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ నేషనల్ హెరాల్డ్‌లో భారీ కుంభకోణం జరగడంతో 2014లోనే కేసు నమోదైందన్నారు. అయితే ఈ అక్రమాల్లో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ పాత్ర ఉండటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు బీజేపీపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శెగ్గెం శ్రీనివాసులు మాట్లాడుతూ ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ నాయకులు వాస్తవాలు తెలుసుకుంటే మంచిదన్నారు. కార్యక్రమంలో ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి యోగయ్యయాదవ్, పీవీ కృష్ణారెడ్డి, బొద్దులూరి ఆంజనేయులు, తలుపుల నాయక్, కాకర్ల శేషులు, రాజేష్ వర్మ, మాదాల నరేష్, లిఖిత్, చందు, శివాజీయాదవ్, కూకట్ల నాగేవ్వరరావు, కె.రాధాకృష్ణ, అమరసింహం, మోజీ, దండు శ్రీనివాసరావు, లక్ష్మణ్, విజయారావు, సత్యవతి పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యుల సంఘం నగర కమిటీ

ఒంగోలు కార్పొరేషన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర నూతన కమిటీ ఎన్నిక శనివారం ఒంగోలులో జరిగింది. స్థానిక రెడ్‌క్రాస్ భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షులుగా పోలవరపు సుధాకర్‌రావు, కార్యదర్శిగా టి.రమేష్‌బాబు, కోశాధికారిగా సీహెచ్.యోగిరామయ్య, గౌరవ అధ్యక్షులుగా ఎ.రాజా, మీడియా ఇన్‌చార్జిగా దాసరి సుధాకర్, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, హరినారాయణ, సహాయ్య కార్యదర్శులుగా టీవీ.సుబ్బారావు, కె.వంశీకృష్ణ, ఇతర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు మాలకొండయ్య, కార్యదర్శి కె.బాలచంద్రం, ఆర్ఎంపీలు రమేష్‌బాబు, బిజ్జం శ్రీనివాసరావు, ఉలిచి రమేష్ పాల్గొన్నారు.

డ్రోన్ ప్రాజెక్టు డెవలప్‌మెంట్‌పై క్విస్, నెక్టార్ ఒప్పందం

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల, మేఘాలయ రాష్ట్రం షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ సెంటర్ ఫర్ టెక్నాలజీ అండ్ రీచ్(నెక్టార్) మధ్య డ్రోన్ ప్రాజెక్టు డైవలప్‌మెంట్‌పై ఒప్పందం జరిగినట్లు క్విస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి శనివారం తెలిపారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీపై ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, కళాశాలలో డ్రోన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, డ్రోన్ ప్రాజెక్టు డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు నెక్టార్ సహకారం అందిస్తుందని వారు తెలిపారు. ఈ మేరకు స్థానిక కళాశాలలో రెండు సంస్థలు పరస్పరం ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా నెక్టార్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ అరుణకుమార్‌శర్మ మాట్లాడుతూ ప్రీమియమ్ కళాశాలల్లో క్విస్ కళాశాల ఒకటైనందున ఒప్పందం కుదుర్చుకున్నామని చెప్పారు. కళాశాలలో రీసెర్చ్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడంపై అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డీపీఎస్ఆర్ డైరెక్టర్ సుబ్బారావు, భార్గవ, డీన్ చల్లా రామ్, సత్యమహర్ తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ శుభాకాంక్షలు

ఒంగోలు కలెక్టరేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి క్రైస్తవులకు ఈస్టర్ శుభా కాంక్షలను తెలిపారు. భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకోవాలని ఆకాంక్షించారు.

అగ్నిప్రమాదాలపై ఆసుపత్రి సిబ్బందికి అవగాహన

ఒంగోలు క్రైం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదం జరిగితే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి కె.శ్రీకాంత్‌రెడ్డి కోరారు. ఒంగోలు కిమ్స్ హాస్పిటల్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏదైనా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు పేషేంట్లను కాపాడే విధానం చూపించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ సహాయ అధికారి వి.శ్రీనివాసులురెడ్డి, కిమ్స్ సీఈవో కె.అంకిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



సాయిరామ్‌ను అభినందిస్తున్న అధ్యాపక బృందం

సింగరాయకొండ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించిన స్థానిక ఏఆర్‌సీ అండ్ జీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులను శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.సౌజన్య మాట్లాడుతూ సీనియర్ బైపీసీలో ప్రళయకావేరి, సాయిరామ్ 1000కి 972 మార్కులు సాధించి టాపర్‌గా నిలిచారని తెలిపారు. సీనియర్ సీఈసీలో తన్నీరు సింధు 851 మార్కులు సాధించినట్లు ఆమె వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ నేత సింగయ్యకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

సంతనూతలపాడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులో టీడీపీ నేత, డాక్టర్ మన్నం సింగయ్య వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండ్ వద్ద నున్న మన్నం సింగయ్య విగ్రహానికి, ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. నీటిసంఘం అధ్యక్షులు మన్నం రంగనాయకమ్మ రూ.1.20లక్షలతో విగ్రహాల వద్ద ఇనుప మెస్, మెట్లను ఏర్పాటు చేయించారు. అనంతరం అన్నదానం చేశారు. రాష్ట్ర టీడీపీ సెక్రటరీ అడకా స్వాములు, మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, ప్రముఖ వైద్యులు ఏవీ.సుందరరావు, రమ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సత్కారం

సంతనూతలపాడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎనికపాడు జడ్పీ హైస్కూల్లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న మల్లవరపు రామకోటిరెడ్డి శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా స్థానిక స్కూలులో ఉపాధ్యాయులు రామకోటిరెడ్డి దంపతులను ఘనంగా దుశ్శాలువతో సత్కరించి ఆయన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.కోటేశ్వరరావు, సర్పంచ్ తలారి వెంకట్రావు, ఉపాధ్యాయులు సువర్ణరాజు, బాలకోటయ్య, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలి

సంతనూతలపాడు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్కౌట్ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఉప విద్యాశాఖాధికారి చంద్రమౌళేశ్వర్ కోరారు. పేర్నమిట్ట సుబ్బయ్య రెసిడెన్షియల్ స్కూలులో శనివారం భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి మహతి తన్నీరు బాలాజీ నేతృత్వంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంఈవో డి.వెంకారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్‌కు విద్యా, ఉద్యోగాల్లో ప్రభుత్వం రిజర్వేషన్ కల్పించిందని చెప్పారు. కావున విద్యార్థులు రాష్ట్రపతి పురస్కార్ వరకు ఎదగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కోర్సు లీడర్ నాగిరెడ్డి, అసిస్టెంట్ కోర్సు లీడర్ వెంకటరెడ్డి, శేషరావు, హెచ్‌ఎం వెంకట్రావు పాల్గొన్నారు.

23నుంచి పుస్తక వారోత్సవాలు

చీమకుర్తి, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి) : జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఈనెల 23నుంచి 30వ తేదీ పుస్తక వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ కోరారు. శనివారం చీమకుర్తిలో ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆయన ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదరీనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఆసక్తి గలవారు పుస్తకాల కోసం 9440522775, 8500232432 సెల్ నంబర్లను సంప్రదిస్తే కావాల్సిన పుస్తకాలను అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, నల్లూరి వెంకటేశ్వర్లు, కె.సుబ్రహ్మణ్యం, జయప్రకాష్, వెంకటేష్, అక్బర్, చల్లా శ్రీను, వీరారెడ్డి, నరసింహారావు, మన్నం సుబ్బారావు, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

మాస పత్రిక ఆవిష్కరణ

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ పెద్దిగారి లక్ష్మన్న పాజిటివ్ లైఫ్ మాసపత్రికను ఒంగోలులో శనివారం ఆంధ్రకేసరి యూనివర్శిటీ రిజిస్ట్రార్ బి.హరిబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మాసపత్రిక విద్యార్థులకు, సాధారణ పౌరులకు, ఉపాధ్యాయులకు బాగా ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ సోమశేఖర్, ప్రముఖ సైకాలజిస్టు పసుపులేటి పాపారావు పాల్గొన్నారు.

నేడు కరవదిలో సీపీఐ సభ

ఒంగోలు(రూరల్), ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): కరవది గ్రామంలో ఆదివారం మండల సీపీఐ మహాసభ జరుగుతుందని ఆ పార్టీ కార్యదర్శి గద్దల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

అవీ.. ఇవీ

గిద్దలూరులో కార్డెన్ సెర్చ్

● 11 ద్విచక్ర వాహనాల స్వాధీనం



కార్డెన్ సెర్చ్‌లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలు

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం తెల్లవారుజామున పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. గిద్దలూరు అర్బన్, రూరల్ సీఐలు సురేష్, రామకోటయ్యతోపాటు ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు. అర్బన్‌కాలనీలో కార్డెన్ సెర్చ్‌లో సరియైన పత్రాలులేని 11 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో పోలీసులు కవాతు నిర్వహించారు.

విద్యార్థులకు ప్రతిభ పరీక్ష



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఉపాధ్యాయులు

కంభం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కంభంలోని ఎంఈవో కార్యాలయంలో మండలంలోని జంగంగుంట్ల క్లస్టర్ పరిధిలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు శనివారం క్విజ్, ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఈపోటీల్లో 13 పాఠశాలల నుంచి 100 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, నగదు బహుమతులను అందజేశారు. ఎంఈవోలు మాల్యాద్రి, శ్రీనివాసులు, కాంప్లెక్స్ చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ క్లస్టర్ పరిధిలోని పాఠశాలల విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకు క్విజ్, ప్రతిభ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రసాద్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి విజయలక్ష్మీ

పొదిలి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గత నెలలో ఒంగోలు పొదిలి ప్రధాన రహదారిలో రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన గంధం ప్రసాద్ కుటుంబానికి బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బెల్లంకొండ విజయలక్ష్మి రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఆ ఆర్థిక సహాయాన్ని తనే స్వయంగా పోస్టాఫీస్‌లో ఇద్దరు పిల్లలపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. మృతిచెందిన కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

అవోపా ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



అన్నదానం చేస్తున్న అవోపా నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని అమ్మవారిశాల వద్ద శనివారం అన్న ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో అవోపా నాయకులు లక్ష్మణరావు, సుబ్రహ్మణ్యం, కోటి మోహన్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుపై వైసీపీ నాటకం

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీ ప్రజలను వైసీపీ మభ్యపెడుతూ రాజకీయంగా లబ్ధి పొందాలనే దురుద్దేశంతో ఉందని మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ సయ్యద్ జావీద్ అన్వర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ వక్ఫ్ చట్టాన్ని లోక్‌సభలో వ్యతిరేకించి, రాజ్యసభలో మద్దతు తెలిపి రెండు నాలుకల ధోరణి అవలంబిస్తుందన్నారు. గతంలో అధికారంలో ఉన్న వైసీపీ బీజేపీతో జతకట్టి ఆర్టికల్ 370, సీఏఏ, ట్రిపుల్ తలాక్ చట్టానికి మద్దతు తెలిపిందని గుర్తుచేశారు. బీజేపీ చేతిలో వైసీపీ కీలుబొమ్మలా తయారైందన్నారు.

ఏకలవ్యలో ప్రవేశాలు ప్రారంభం

● ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్

పెద్దదోర్నాల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలలో 2025-26విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశ ప్రక్రియ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ ఈశ్వర్‌సింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16న 6వ తరగతి ప్రవేశపరీక్షా ఫలితాలు వెల్లడయ్యాయని తల్లిదండ్రులు వెబ్‌సైట్‌లో గానీ, పాఠశాలలో నోటీస్‌బోర్డుపై గాని చూడవచ్చన్నారు. అర్హత సాధించిన విద్యార్థులు ఫలితాల ప్రింటు కాపీ, విద్యార్థి జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు నకలు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, కుల ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాఠశాలలో సంప్రదించాలని సూచించారు. ఈ నెల 20వ తేదీ నుంచి ప్రవేశాలు ప్రారంభిస్తున్నట్లు వివరించారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసుల రాజీకి చర్యలు తీసుకోవాలి

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మే 10న జరుగు జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయడానికి చర్యలు తీసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి ఏ.ఓంకార్ శనివారం గిద్దలూరు కోర్టు నందు బ్యాంకులు, రెవెన్యూ, మున్సిపల్, టెలిఫోన్ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. న్యాయాధికారి ఓంకార్ మాట్లాడుతూ దీర్ఘకాలికంగా నెలకొన్న కేసులను కక్షిదారులకు నచ్చచెప్పి రాజీమార్గం ద్వారా అవి పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

చిన్నారులంటే ఇంత అలుసా...?

● అంగన్‌వాడీ కేంద్రాల్లో మురిగిన గుడ్డు సరఫరాపై నిలదీత

గిద్దలూరు టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మురిగిన గుడ్డు సరఫరాపై టీడీపీ నాయకుడు బిల్లా రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని కొంగళవీడు రోడ్డులోని బాలసరస్వతి అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారంపై 7వ వార్డు కౌన్సిలర్ బిల్లా జయలక్ష్మి భర్త, టీడీపీ నాయకుడు బిల్లా రమేష్ పరిశీలించారు. పలువురు చిన్నారుల తల్లిదండ్రుల ఫిర్యాదుతో బిల్లా రమేష్ శనివారం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడ చిన్నారులకు అందించే గుడ్లను పరిశీలించారు. గుడ్లు మురిగిపోయి దుర్వాసన రావడంపై ఆయన సంబంధిత అంగన్‌వాడి కార్యకర్తను, ఆయాను ప్రశ్నించగా ఎండాకాలం కావడంతో గుడ్లు మురిగిపోతున్నాయన్నారు. కాంట్రాక్టర్ ఈవిధంగా సప్లై చేస్తున్నాడని సమాధానం ఇచ్చినట్లు రమేష్ తెలిపారు. చిన్నపిల్లలకు ఇలాంటి గుడ్లు పెడితే వారికి ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

● ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ● స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ర్యాలీలు ● గిద్దలూరులో పాల్గొన్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. 'స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా స్థానిక దోర్నాల బస్టాండ్ సమీపంలోని లక్ష్మీచెన్నకేశవ బుక్‌షాప్ వద్ద ఈ-వేస్ట్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ముందుగా స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలక్ర్టానిక్ వ్యర్థాలు ఉంటే సమాచారాన్ని సచివాలయానికి తెలియజేయాలన్నారు. ముఖ్యంగా ఎలక్ర్టానిక్ వ్యర్థాలైన పాత టీవీలు, కంప్యూటర్ మానిటర్లు, సీపీయూలు, పనికిరాని ఫ్రిడ్జ్‌లు, వైద్యపరికరాలు, పాడైన ఎల్‌ఈడీ బల్బులను ఇష్టారీతిన ఎక్కడపడితే అక్కడ వేయకూడదన్నారు. దీనివలన పర్యావరణానికి హాని కలుగుతుందన్నారు. సచివాలయ సిబ్బందికి సమాచారం ఇస్తే వాళ్ల మున్సిపల్ పారిశుధ్య విభాగం వారితో సేకరిస్తారన్నారు. వారి పర్యవేక్షణలో ఎలక్ర్టానిక్ వ్యర్థాలను ధ్వంసం చేస్తారన్నారు. పర్యావరణహితం కోరే ప్రతిఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కలలను సాకారం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, కౌన్సెలర్లు నాలి కొండయ్యయాదవ్, షేక్ చిన్నషెక్షావలి, బీజేపీ నాయకులు పీవీ కృష్ణారావు, మున్సిపాలిటీ, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు టౌన్ : పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం, ఆరోగ్యాన్ని కాపాడుకుందామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. శనివారం గిద్దలూరు పట్టణంలో 'సచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివాస్' కార్యక్రమ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలంతా సంతోషంగా ఆరోగ్యవంతంగా ఉండాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రమాదకరమన్నారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో 'ఈ-వేస్ట్' నివారణకు తగిన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో 'ఈ-వేస్టు' ను సేకరించి ప్రభుత్వం కేటాయించిన ప్రదేశాలలో తరలించారు. గ్రామీణ ప్రాంతాలలో 10వేల జనాభా కంటే ఎక్కువగా ఉండే ప్రదేశాలలో ఈ కార్యకలాపాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. పూర్తి స్థాయిలో ప్లాస్టిక్ నివారించేందుకు అందరూ సహకరిస్తేనే ఈ స్వచ్ఛాంధ్ర కార్యక్రమం విజయవంతం అవుతుందన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకటసుబ్బయ్య, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు సయ్యద్ షానేషావలి, కౌన్సిలర్లు చంద్రశేఖర్‌యాదవ్, లొక్కు రమేష్, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, ఓబయ్య పాల్గొన్నారు.

బేస్తవారపేట : పట్టణంలో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఏవీ.రంగనాయకులు, తహసీల్దార్ జితేంద్ర మాట్లాడుతూ ఈ-వ్యర్థాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రంలో జమ చేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమంలో బి.ప్రేమానంద్, అంగన్‌వాడీ, రెవెన్యూ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కంభం సర్పంచ్ పల్నాటి బోడయ్య అధ్యక్షతన ఈ-వేస్ట్‌పై ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. పంచాయతీ పరిధిలో ఈ-వేస్ట్ సెంటర్లను ఏర్పాటు చేసి వీటి వలన ఆరోగ్యం, పర్యావరణానికి కలిగే పరిణామాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరభద్రాచారి మాట్లాడుతూ ఈ-వేస్ట్ డిస్పోజల్‌ను ప్రజలందరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. కార్యక్రమం అనంతరం ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చేగిరెడ్డి తులసమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు కొత్తపల్లి జ్యోతి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవీంద్రరెడ్డి, కార్యదర్శులు రమేష్‌రెడ్డి, పురుషోత్తంజోషులు, సచివాలయ సిబ్బంది, స్వచ్ఛ కార్మికులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పొదిలికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

పొదిలి : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నగర పంచాయతీ కమిషనర్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ప్రతిఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరి సహకారం అవసరమన్నారు. పట్టణాన్ని స్వచ్ఛంగా ఉంచుదామని ప్రతి ఒక్కరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో నగరపంచాయతీ సిబ్బంది, టడీపి నాయకులు పాల్గొన్నారు.





గిద్దలూరులో ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, బేస్తవారపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అగ్నిప్రమాదాల నివారణపై వైద్యసిబ్బందికి అవగాహన



మార్కాపురంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాల నుంచి కాపాడుకోవడానికి ఆసుపత్రులలో ప్రత్యేక చర్యలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ అధికారి రేగలగడ్డ రామకృష్ణ తెలిపారు. స్థానిక ప్రజా వైద్యశాలలో అగ్నిప్రమాదాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. అనుకోకుండా ఏదైనా అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఆసుపత్రులలో ఉన్న వృద్ధులు, పిల్లలు, రోగులను సురక్షిత ప్రదేశాలకు ఏవిధంగా తీసుకురావాలో అనేక విధాల రెస్క్యూ మెథడ్స్‌ను మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. కార్యక్రమంలో అగ్నిమాపక, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కంభం : అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శనివారం కంభం ప్రభుత్వ వైద్య శాల, రామచంద్ర మల్టీస్పెషాలిటి వైద్యశాల ఆవరణలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కంభం అగ్నిమాపక అధికారి పిచ్చయ్యచౌదరి అగ్నిమాపక వారోత్సవాల ప్రాముఖ్యతను తెలిపి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: స్థానిక శ్రీరంగా మల్టీ స్పెషాలిటీ వైద్యశాల వద్ద అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాలసిన జాగ్రత్తలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా కేంద్రం అధికారి హరిబాబు ఆధ్వర్యంలో ప్రమాదం జరిగినప్పుడు పొగ పీల్చుకుని స్పృహ కోల్పోయిన వారికి ఫస్ట్‌ఎయిడ్ ఏ విధంగా అందించాలి తదితర అంశాలపై ప్రయోగాత్మకంగా వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.



దోర్నాలలో అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

వైభవంగా మూలపెద్దమ్మ తిరునాళ్ల

గిద్దలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మునూరు గ్రామంలో శనివారం మూలపెద్దమ్మతల్లి దేవస్థానంలో తిరునాళ్ల మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పెద్దమ్మ తల్లికి ప్రత్యేకంగా పూజలు, అభిషేకాలు, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాటకచేరి అందరినీ అలరించింది. ఆలయ పూజారి తిరుమలమ్మ, గ్రామపెద్దలు ఆయా పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.

తేజారెడ్డికి సర్జరీలో మాస్టర్ డిగ్రీ

గిద్దలూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గిద్దలూరుకు చెందిన కందుల వెంకట తేజారెడ్డికి వాస్కులర్ సర్జరీలో మాస్టర్ డిగ్రీ లభించింది. పట్టణంలోని అరుణోదయ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన తేజారెడ్డి న్యూఢిల్లీ సమీపంలోని శ్రీవేదాంత మెడిసిటి యూనివర్సిటీలో వాస్కులర్ సర్జరీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ జింకా చంద్రశేఖర్ తెలిపి పూర్వ విద్యార్థిని సత్కరించి అభినందించారు.

చందన అలంకారంలో చెన్నకేశవుడు



చందన అలంకరణలో చెన్నకేశవుడు

మార్కాపురం వన్‌టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చందన అలంకారంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా చెన్నకేశవస్వామి మూల విరాట్‌ను శనివారం చందనంతో అలంకరించారు. రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, విశేష పూజలు చేశారు. చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు ఆలయ ప్రధాన అర్చకులు 37 కిలోల చందనంతో చందనాలంకరణ నిర్వహించారు. స్వామి మూల విరాట్‌ను భక్తులు భక్తి తన్మయత్వంతో వీక్షించి పులకరించిపోయారు. గరుడసేవ కావడంతో ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు బారులుతీరారు. చందన అలంకార దాతలుగా బొంతల వెంకటసుధీర్‌కుమార్ వ్యవహరించారు.

వైభవంగా బ్రాహ్మణ గరుడ సమారాధన

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆలయంలో శనివారం బ్రాహ్మణ గరుడ సమారాధన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు. సమారాధన దాతలుగా శ్రేష్టి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. జటప్రోలు దక్షిణామూర్తి శర్మ ఆధ్వర్యంలో బ్రాహ్మణ గరుడ సమారాధన పర్యవేక్షించారు.

రాష్ట్రాభివృద్ధే టీడీపీ ధ్యేయం : ఎమ్మెల్యే కందుల

కొనకనమిట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధే టీడీపీ ధ్యేయమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని గొట్లగట్టు గ్రామంలో కుట్టుమిషన్ శిక్షణను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా గొట్లగట్టు సర్పంచ్ పెరికే సుఖ్‌దేవ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. పెన్షన్లు నెలకు క్రమం తప్పకుండా రూ.400 ఇంటి వద్దకే వచ్చి అందిస్తున్నట్లు ఆయన చెప్పారు. మహిళలకు ఉచిత గ్యాస్ పథకం కింద సంవత్సరానికి మూడు సిలిండర్లు అందిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఈ ఏడాది తల్లికివందనం ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా మార్కాపురం నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతం కనుక కొనకనమిట్ల మండలానికి రిలయన్స్ సంస్థ ద్వారా రూ ఒక్కో బయోగ్యాస్‌ప్లాంట్ రూ.500 కోట్లతో మూడు బయోగ్యాస్ యూనిట్లు మంజూరు చేయించినట్లు తెలిపారు. గొట్లగట్టుకు జూనియర్ కళాశాల మంజూరు చేయించామన్నారు. ఈ ప్రాంత రైతుల సహకరించి 1250 ఎకరాల పొలం ఇవ్వగలిగితే మరో బయోగ్యాస్‌ప్లాంట్ ఏర్పాటు చేయిస్తానని రైతులకు చెప్పారు. ఈ బయోగ్యాస్ ప్లాంట్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి లభించనున్నట్లు చెప్పారు. అనంతరం బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. తొలుత రైతుసేవా కేంద్రంలో మహిళల కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, పలువురు అధికారులు, మహిళలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అరటి రైతులకు పరిహారం ఇప్పించేందుకు చర్యలు

● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

● గాలివానతో నష్టపోయిన తోటల పరిశీలన

గిద్దలూరుటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అరటి రైతుకు తక్షణ పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని బురుజుపల్లె గ్రామంలో నాలుగు రోజులక్రితం గాలి, వానతో అరటి చెట్లు కిందకు పడిపోయాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అధికారులు, పార్టీ నాయకులతో కలిసి తోటలను పరిశీలించారు. బాధిత రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు షేక్ మదార్‌వలి మాట్లాడుతూ తాను అప్పులు చేసి పెట్టుబడి పెట్టిన అరటితోట గాలి, వానల కారణంగా దెబ్బతిన్నట్లు తెలిపారు. రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని ఎమ్మెల్యే ముందు వాపోయాడు. స్పందించిన ఎమ్మెల్యే రైతుకు పంటనష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిహారం త్వరగా అందేలా చర్యలు తీసుకుంటామని రైతుకు హామీఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ సహాయ సంచాలకులు బాలాజీనాయక్, ఎంపీడీవో రమణరెడ్డి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు ఓబులరెడ్డి, తదితరులు ఉన్నారు.

ఐదేళ్లు నిండిన చిన్నారులను బడిలో చేర్పించాలి

● ఎంఈవో మస్తాన్ నాయక్

పెద్దదోర్నాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు నిండిన చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో మస్తాన్ నాయక్ అన్నారు. మండలంలోని తిమ్మాపురం మెయిన్ పాఠశాలలో అంగన్‌వాడీ కేంద్రాల నుంచి చేరే విద్యార్థుల వివరాలను ఎంఈవో మస్తాన్ నాయక్ శనివారం సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నుంచే కాకుండా మండలంలో ఎక్కడైన ఐదేళ్లు నిండిన చిన్నారులుంటే వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడికి వెళ్లేలా చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ అనసూయదేవి, ఉపాధ్యాయులు కేనధానియేలు, సీఆర్‌ఎంటీలు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవునికి విశేష పూజలు

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామంలో వేంచేసిన శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహోత్సవాలలో భాగంగా 9వ రోజు శనివారం ఆలయ అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం రాత్రికి స్వామి వారి రథోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే గ్రామోత్సవ వేడుకలు నిర్వహించారు. అశ్వ వాహనంపై స్వామి వారు ఉరేగింపు నిర్వహించారు. ఉభయదారులు గ్రామానికి చెందిన నలగాటి మల్లికార్జున నాయుడు, నలగాటి చిన్న మల్లికార్జున నాయుడు, నలగాటి ఆత్మానంద సత్యనారాయణ, నలగాటి వెంకట్రావు, నలగాటి వెంకట సుబ్బారావు, నలగాటి శివ కోటేశ్వరరావు, నలగాటి చిన్న బాల సుబ్బారావులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఎర్రగొండపాలెం మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు నాయకులతో కలసి శనివారం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట కంచర్ల సత్యనారాయణ గౌడ్, ఎంసీహెచ్ మంత్రు నాయక్, నలగాటి శివ, యల్లయ్య, మల్లికార్జున చారి, ఎన్ లక్ష్మయ్య, వెంకట సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.







అర్థవీడులో నిరుపయోగంగా హౌసింగ్ కార్యాలయం, కంభంలో శిథిలావస్థకు చేరిన పాల కేంద్రం, పాడుపడిన విద్యుత్ సిబ్బంది క్వార్టర్స్

శిథిలావస్థలో ప్రభుత్వ భవనాలు

- గత ప్రభుత్వ పాలనలో పట్టించుకోని అధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డా

కంభం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): కంభం, అర్థవీడు మండలాల్లో పలు ప్రభుత్వ భవనాలు శిథిలావస్థకు చేరాయి. ఇదే సమయంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న పలు భవనాల్లోనే కార్యకలాపాలు సాగించే దుస్థితి లేకపోలేదు. మరికొన్ని భవనాలను అలాగే ఎందుకు పనికిరానివిగా వదిలివేశారు.

గత వైసీపీ ఐదేళ్ల పాలనలో భవనాల నిర్వహణ గాలికొదిలేయడంతో ఇప్పుడు అవి నిరుపయోగంగా మారుతున్నాయి. అటవీశాఖ, పాల కేంద్రం, వసతి గృహ భవనాలు, గృహనిర్మాణశాఖ, వ్యవసాయశాఖ, విద్యుత్ వసతి గృహ భవనాలు, టెలిఫోన్ కార్యాలయం శిథిలావస్థకు చేరాయి. అర్థవీడు మండలంలో గృహనిర్మాణశాఖ, వ్యవసాయశాఖ కార్యాలయాలు ఐదేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. యాచవరంలోని సచివాలయం, మాగుటూరులోని రైతుసేవాకేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాలలో నిర్వహిస్తున్నారు. కంభం అటవీశాఖ కార్యాలయం చుట్టూ చిల్లచెట్లు పెరిగాయి. 1992 గిద్దలూరు డివిజన్ అటవీశాఖాధికారి ఎస్.ఎం.సెల్వరాజ్ ఈ భవనాన్ని ప్రారంభించారు. నామమాత్రంగా మూడేళ్లపాటు అధికారులు ఇక్కడ ఉన్నారు. అనంతరం తురిమెళ్ల గ్రామాన్ని విధుల నిర్వహణకు ఎంపిక చేసుకున్నారు. దీంతో ఆ పాత కార్యాలయ భవనాన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. ఇక కంభం పాలకేంద్రాన్ని ఐదేళ్ల క్రితం మూసివేశారు. అప్పటి నుండి దానిని ఎవరూ పట్టించుకోకపోవడంతో చిల్లకంప దట్టంగా పెరిగింది. కంభం 132/11 కేవీ విద్యుత్ సిబ్బంది గృహాలు 25 ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాలు అసాంఘీక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. ఇప్పటికైనా వీటిని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖాముఖి

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ప్రభాకరశర్మ, ఎంపీడీవో, పీసీపల్లి



ప్రశ్న: ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలపై చర్యలు ఏమైనా తీసుకున్నారా?

జవాబు: సామాజిక తనిఖీలో వెల్లడైన అక్రమాలపై ఏపీవోతో పాటు సిబ్బందిపై చర్యలు తీసుకున్నాం. తాత్కాలికంగా వారిని విధుల నుంచి తొలగించాం. శాఖాపరంగా వారిపై విచారణ జరుగుతుంది.

ప్ర: ఉపాధి కూలీలకు రోజువారి వేతనం ఎంత ఇస్తున్నారు?

జ: నిబంధనల ప్రకారం పనిచేస్తే ప్రభుత్వం రోజుకు రూ.307 వేతనంగా ఇస్తుంది. ప్రస్తుతం సరాసరి రూ.287 అందుతుంది.

ప్ర: నీటికుంటల తవ్వకాలు ఎంత శాతం పూర్తిచేశారు?

జ: మండలంలోని 18పంచాయతీల్లో పనులు జరుగుతున్నాయి. ఇప్పటివరకు 85శాతం పూర్తిచేశాం.

ప్ర: పశువుల షెడ్‌లు ఎన్ని మంజూరయ్యాయి? ఎన్ని పూర్తిచేశారు?

జ: మండలానికి 21 పశువుల షెడ్‌లు మంజూరయ్యాయి. 17 పూర్తికాగా, నాలుగు షెడ్లు వివిధ దశల్లో ఉన్నాయి.

ప్ర: పశువుల దాహార్తిని తీర్చేందుకు నీటి తొట్లు ఎన్ని పూర్తయ్యాయి?

జ: మండలానికి 60 నీటితొట్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణ పనులు చివరిదశకు వచ్చాయి.

'ఉపాధి' బిల్లుల కోసం ఎదురుచూపులు

ముండ్లమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 21 గ్రామ పంచాయతీల్లో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో సీసీ రోడ్లు, మురుగు కాలువలు, మెటల్ రోడ్లు నిర్మించారు. 37 పనులకు 3.80 కోట్లు మేరకు పనులు చేశారు. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పనులు చేశారు. ఐదు నెలలు కావస్తున్నా ఇంతవరకు బిల్లులు రాకపోవటంతో కాంట్రాక్టర్లు నానా అవస్థలు పడుతున్నారు. పెదఉల్లగల్లు, కెల్లంపల్లి, పసుపుగల్లు, వేముల, శంకరాపురం, మారెళ్ళ ఈదర, భీమవరం, పూరిమెట్ల తదితర గ్రామాల్లో పనులు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ఏపీవో బదిలీ

ముండ్లమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో మండల ఏపీవోగా పనిచేస్తున్న కె.నాగరాజును మార్కాపురంకు బదిలీ చేస్తూ డ్వామా పీడీ జోసెఫ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. పొదిలిలో పనిచేస్తున్న టి.వెంకటరావు బదిలీపై ఇక్కడికి వస్తున్నారు.

పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

ముండ్లమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో రెవెన్యూ సమస్యలను త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ ఆదేశించారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో రీసర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. మండలంలో రెవెన్యూ పరమైన సమస్యలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ప్రధానంగా మీకోసం వచ్చిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవాలి

దొనకొండ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పోషక విలువలు కల్గిన ఆహారం తీసుకోవటం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి సూచించారు. పోషకాహార పక్షోత్సవాల్లో భాగంగా శనివారం దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు రక్తహీనత గురించి వివరించారు. అనంతరం దొనకొండ ఆర్ఎస్ అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలను స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుభ్రం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో విన్యాసమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ పి.రూతు, ఝాన్సీరాణి, నాగేంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో డ్వాక్రా ఉత్పత్తులు

వెలిగండ్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు పొదుపు ఉద్యమంలో భాగస్వాములై స్వయంశక్తితో ఎదుగుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన డ్వాక్రా సంఘాలను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతుంది. వెలిగండ్ల మండలంలో డ్వాక్రా మహిళలు ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా ఉత్పత్తులను ప్రారంభించారు మొగళ్ళూరు గ్రామానికి చెందిన నాగలక్ష్మి తాను తయారుచేసిన ఊరగాయ పచ్చళ్ళను ఆన్‌లైన్ మార్కెట్ ద్వారా అమ్మకాలు ప్రారంభించారు. మోటుపల్లి గ్రామానికి చెందిన అలేఖ్య ఫ్యాన్సీ ఐటమ్స్‌కు సంబంధించి ఆన్‌లైన్ ద్వారా దాదాపు నాలుగువేల ఆర్డర్లు పొందినట్లు ఏపీఎం జీవీ రత్నం తెలిపారు.

యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా

- రుద్రసముద్రం చెరువులో భారీగా గోతులు
- లక్షలు గడిస్తున్న అక్రమార్కులు
- చోద్యంచూస్తున్న అధికారులు



రుద్రసముద్రం చెరువులో మట్టి అక్రమంగా తరలించగా ఏర్పడిన గుంత

దొనకొండ, ఏప్రిల్ 19: మండలంలోని రుద్రసముద్రం గ్రామంలోని ఆయకట్టు చెరువుమట్టిని కొంతమంది అక్రమార్కులు యథేచ్ఛగా తరలిస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా భారీ టిప్పర్లతో రాత్రివేళల్లో నిబంధనలకు విరుద్ధంగా మండలాలు దాటిస్తూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. చెరువులోని సారవంతమైన మట్టిని దర్శి ప్రాంతానికి చెందిన కొందరు ఇటుకల బట్టీల వ్యాపారులు స్థానిక నాయకుల అండ దండలతో ఇటీవల రాత్రివేళల్లో అధికసంఖ్యలో భారీ టిప్పర్లు ఏర్పాటు చేసుకొని దర్జాగా తరలిస్తున్నారు. జలవనరులశాఖ, రెవెన్యూ శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. రుద్రసముద్రం గ్రామాన్ని ఆనుకొని ఉన్న చెరువు మట్టిని అక్రమార్కులు తోడేస్తున్నా అధికార యంత్రాంగం తమకేమి పట్టనట్లుగా వ్యవహరిస్తుందని ప్రజలు విమర్శిస్తున్నారు. మట్టి దందా అధికారుల కనుసన్నల్లో జరుగుతుందనే అభిప్రాయాలను ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. చెరువులో ఎక్స్‌కవేటర్ పెట్టి ఇష్టానుసారంగా పెద్దపెద్ద గోతులు తీసి మట్టిని తరలిస్తున్నారు. ఈ గోతులు ప్రమాదకరంగా మారే పరిస్థితి ఏర్పడిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం రాత్రి చెరువుమట్టిని తరలిస్తుండగా మార్కాపురంకు చెందిన మైనింగ్ అధికారి ఒక టిప్పర్‌ను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ అధికారి వచ్చాడనే సమాచారంతో అప్రమత్తమై మిగిలిన టిప్పర్లను మైనింగ్ అధికారి వెళ్లేంతవరకు పక్కకు పెట్టి తిరిగి యథావిధిగా రాత్రంతా అక్రమ మట్టి రవాణా దర్జాగా కొనసాగించినట్లు సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువుల్లోని మట్టి అక్రమ రవాణా జరగకుండా అడ్డుకట్టవేసేలా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఈవిషయమై తహసీల్దార్ బి.రమాదేవిని వివరణ కోరగా.. రుద్రసముద్రం చెరువు నుంచి మట్టి అక్రమ రవాణా జరగకుండా రెవెన్యూ సిబ్బందిని పంపి నిలిపివేస్తామన్నారు. ఇరిగేషన్‌శాఖ అధికారులతో చర్చించి ఇకపై అనుమతులు లేకుండా మట్టి రవాణా చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రూ.32 లక్షలు ఏం చేశారు..!

- డ్రైనేజీల్లో పూడికతీత తొలగింపు మరిచారా!
- మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆగ్రహం



మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం విడుదల చేసిన రూ.32 లక్షల నిధులు ఏంచేశారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మున్సిపల్ కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో బాగంగా శనివారం పట్టణంలో పారిశుధ్య చర్యలు చేపట్టారు. పామూరు బస్టాండు సెంటరు నుంచి ఆర్టీసీ డిపో, విద్యుత్ డీఈఈ కార్యాలయం వరకు ఉన్న డ్రైనేజీని ఎమ్మెల్యే పరిశీలించారు. డ్రైనేజీ కాలువలో వ్యర్థాలు నిండిపోయి నిలిచిపోయిన మురుగును చూసి ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేశారు.

నా ప్రమేయం లేకపోయినా నెపాన్ని మోసాను..

'ఆక్రమణల తొలగింపు పేరుతో డ్రైనేజీలపై ఉన్న ఫుట్‌పాత్‌లను పగులగొట్టారు. రోడ్డు విస్తరణ జరగటంతో పాటు మెరుగైన సౌకర్యాలు అందితే ప్రజలకు మేలు జరుగుతుందనుకున్నా. అందుకోసం నా ప్రమేయం లేకున్నా ప్రజలు వేసిన నెపాన్ని మోస్తున్నాను' అని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, రోడ్డు, డ్రైనేజీ పనుల కోసం కూలగొట్టిన ఫుట్‌పాత్‌ల నిర్మాణాలను చేపట్టకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం డ్రైనేజీల్లో పేరుకుపోతున్న మురుగును కూడా తొలగించకపోవడంపై మున్సిపల్ కమిషనర్ జోసఫ్ దానియేలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్‌పై అసహనం వ్యక్తం చేశారు. నగర సుందరీకరణ అంటే ఇదేనా అంటూ నిలదీశారు.

నిధులను దేనికి ఖర్చుచేశారు..

నగర పారిశుధ్య మెరుగుకు, ఆక్రమణలు తొలగింపు, నిర్మాణాలకు ప్రభుత్వం విడుదల చేసిన రూ.32 లక్షలు ఏమయ్యాయని కమిషనర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రశ్నించారు. డ్రైనేజీల్లో పూడిక పేరుకుని కంపు కొడుతుంటే, ఆ నిధులను వేటికి ఖర్చు చేశారంటూ నిలదీశారు. పూర్తి లెక్కలతో నివేదిక అందించాలని కమిషనర్‌ను ఆదేశించారు. వెంటనే ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటుచేసి పామూరు రోడ్డు నుంచి విద్యుత్ డీఈఈ కార్యాలయం వరకు ఉన్న డ్రైనేజీలను శుభ్రం చేయించారు. మురుగునీరు ఎక్కడా నిలవకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యుత్ కార్యాలయం వద్ద ఉన్న పురాతన బావిలో మొలచిన చెట్లను చూసి అసహనం వ్యక్తం చేశారు. వెంటనే చెట్లను తొలగించి శుభ్రం చేయించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవిశంకర్, ఎస్ఐ శ్రీరాం, మున్సిపల్ చైర్మన్ గఫార్, విద్యుత్ ఏఈ పవన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పొదుపు సొమ్ముతో వీవోఏ పరారీ

పామూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పొదుపు గ్రూపునకు చెందిన సొమ్ముతో వీవోఏ పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పామూరు క్లస్టర్ పరిధిలోని గోపాలపురం గ్రామానికి చెందిన వీవోఏ పల్లాపు బేబి సీసీఎల్ రుణాలను గ్రూపు మహిళలకు తెలియకుండా సుమారు రూ.25 లక్షల తో ఉడాయించింది. గత వారం రోజుల నుంచి ఆమె కనిపించకపోవడంతో ఈవిషయం వెలుగులోకి వచ్చింది. దాంతో సంబంధిత పొదుపు గ్రూపు సభ్యులు లబోదిబోమంటున్నారు. బ్యాంకు మేనేజర్ల అలసత్వం, సీసీల పర్యవేక్షణ కొరవడటంతో ఇలాంటి మోసాలు జరుగుతున్నాయి. సదరు వీవోఏ పరిధిలో 37 పొదుపు గ్రూపులు ఉన్నాయి.

2023లో ఆంధ్రబ్యాంకు అదనపు రుణాలు(సీసీఎస్ రుణాలు) ఇప్పిస్తానని గ్రూపు సభ్యులతో సంతకాలు పెట్టించుకున్నారు. ఇటు ఏపీఎం, అటు క్లస్టర్ కోఆర్డినేటర్ల(సీసీ) సంతకాలు లేకుండానే కొందరు బ్యాంకు మేనేజర్లు వీవోఏల సంతకాలతోనే అదనపు రుణాలు మంజూరు చేస్తుంటారు. ఈ రుణాలను లబ్ధిదారులకు ఇవ్వకుండా కొందరు వీవోఏలు అక్రమంగా వాడుకొంటున్నారు. ఈవిషయం బయటకు పొక్కడంతో వీవోఏ పరారీ అయినట్లు తెలిసింది. ఈవిషయమై ఏపీఎం జి.విద్యాసాగర్‌ను వివరణ కోరగా.. ఈవిషయమై సమాచారం తెలిసిందన్నారు. ఎంత నగదుతో ఉడాయించిందో అనే విషయంపై విచారణ చేస్తున్నట్లు చెప్పారు. సంబంధిత బ్యాంకు వద్దకు వెళ్లి స్టేట్‌మెంట్ వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

చెత్త నుంచి సంపద సృష్టించటమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తదితరులు

కనిగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపద సృష్టించటమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో బాగంగా శనివారం పట్టణంలోని చర్చి సెంటరులో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా వ్యర్థాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థాలను సేకరించి రీసైక్లింగ్ చేయటంవల్ల ఆర్థిక వనరులను సృష్టించుకోవచ్చునని చెప్పారు. వ్యర్థాల వల్ల జరిగే అనర్థాలు, ఉపయోగాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాలని అధికారులకు సూచించారు. తొలుత అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధికారులు, పారిశుధ్య సిబ్బందితో కలసి పామూరు బస్టాండు సెంటరు నుంచి విద్యుత్ డీఈఈ కార్యాలయం వరకు ప్రధాన డ్రైనేజీలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జోసఫ్‌దానియేలు, మున్సిపల్ చైర్మన్ గఫార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయబ్‌రసూల్, తహసీల్దార్ రవిశంకర్, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పామూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తహసీల్దార్ బీవీ రమణారావు, ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య అన్నారు. శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పామూరు గ్రామ పంచాయతి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మమ్మిడాడీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బొల్లా నరసింహారావు, షేక్ ఖాజారహంతుల్లా ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, కేవీ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ బీవీ రమణారావు సిబ్బందితో కలిసి కార్యాలయ ఆవరణలో చెత్తను తొలగించారు. ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య, సిబ్బంది కార్యాలయాన్ని శుభ్రం చేశారు. మండలంలోని పలు గ్రామ పంచాయతిల్లో క్లీన్ అండ్ గ్రీన్ పనులు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించారు.

ముండ్లమూరులో.. ముండ్లమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మీనారాయణ కార్యాలయంలో ఉన్న వ్యర్థ పదార్థాలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆర్.శ్రీకాంత్, ఆర్ఐ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ కృష్ణప్రసాద్, వీఆర్‌వోలు గురవయ్య, కోటయ్య, రాఘవరెడ్డి, సుజాత, వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

అటకెక్కిన ఆహ్లాదం

- మురికికూపంగా మారిన రాయల దొరువు
- అపరిశుభ్రంగా ఆలయాల పరిసరాలు



అపరిశుభ్రంగా దొరువు నీరు

కనిగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఎంతో చారిత్రక వైభవం కల్గిన పురాతన రాయల దొరువు పాలకుల నిర్లక్ష్యంతో మురికికూపంగా మారింది. కనిగిరిలో ప్రధానాలయాలు దొరువు ప్రాంతంలో ఉన్నాయి. కొండపైన విజయమార్తేండశ్వస్వామి, దొరువు వద్ద శివాలయం, ఆసమీపంలోనే బ్రహ్మంగారి ఆలయం, అంకాలమ్మ ఆలయాలు ఉన్నాయి. దొరువు ఒడ్డున దుర్గాదేవి ఆలయం ఉంది. ఆయా ఆలయాలకు నిత్యం భక్తులు వచ్చి స్వామి వార్లకు దేవతలకు పూజలు చేస్తుంటారు. ఎంతో పరిశుభ్రంగా ఉండాల్సిన ఆలయాల పరిసరాలు అక్రమార్కులతో అపరిశుభ్రంగా మారాయి.

అభివృద్ధిపై చిన్నచూపు

దొరువు అభివృద్ధిలో పాలకులు చిన్నచూపు చూస్తున్నారు. మున్సిపాల్టీ ఎన్నికలకు ముందు దొరువు ప్రాంతాన్ని అభివృద్ధిచేసి వాకింగ్ ట్రాక్, మొక్కల పెంపకం చేపట్టి భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని ఏర్పాటుచేస్తామని హామీలు ఇచ్చారు. ఆతర్వాత భక్తులు ఆశలు నీరుగార్చారు. అక్రమార్కులు దొరువు కరకట్టను ఆక్రమించి నివాసాలు ఏర్పాటుచేసుకోగా, మరికొంతమంది ఆయా ప్రాంతంలో



తామరాకులతో నిండిన దొరువు

మేకలు, గొర్రెలు, కోళ్ళు పెంచుతూ విషసర్పాలకు ఆలవాలంగా మార్చారు. దీంతో ఆలయాలకు వచ్చేపోయే భక్తులకు అసౌకర్యంగా మారింది. కొండపైన విజయమార్తేండేశ్వరస్వామి దేవాలయానికి వెళ్ళాలంటే దొరవు కట్ట వెంబడే వెళ్లాలి. మరోపక్క దొరువు ఒడ్డున ఉన్న దుర్గాదేవి ఆలయం, శివాలయానికి వెళ్ళాలంటే దొరువు కట్టపై నుంచి వెళ్ళాలి. ఆప్రదేశంలో కోళ్ళు, కుక్కలు, పందు లు పెంచుతుండటంతో అపరిశుభ్రంగా మారింది. దొరువు రక్షణ ఫెన్సింగ్ అంతా పెకలించి వేశారు. వ్యర్థాలతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వస్తుంది. అధికారులు గాని, మున్సిపాల్టీ పాలకులుగాని తమకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

దొరువంతా పచ్చగా మారి దుర్వాసన

వ్యర్థాలతో దొరువంతా పచ్చగా మారింది. దొరువు అభివృద్ధి అంటూ గత వైసీపీ ప్రభుత్వంలో ప్రచార ఆర్భాటాలే తప్ప ఆదిశగా అడుగు ముందుకుపడలేదు. చీకటి పడితే ఆప్రాంతం అసాంఘిక కార్యక్రమాలకు ఆలవాలంగా మారింది. సాయంత్రం ఆలయాలకు వెళ్లాలంటే మహిళా భక్తులు భయపడుతున్నారు. దొరువు నీటిని శుభ్రం చేయించటంతో పాటు దొరువు సంరక్షణ, ఆక్రమణలు తొలగింపు చర్యలు చేపట్టాల్సి ఉంది. ఆప్రాంతాన్ని ఆధ్యాత్మికంగా రూపొందించాలని భక్తులు కోరుతున్నారు.

నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

దొనకొండ, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు పూర్తి సౌకర్యాలతో నాణ్యమైన విద్యాబోధన అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యమని ఎంఈవో-2 షేక్ అమీర్ పేర్కొన్నారు. మండలంలోని పెద్దన్నపాలెం గ్రామంలో రూ.39 లక్షల నిధులతో నిర్మించిన పాఠశాల భవనాన్ని శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు తరగతి గదులతో పాఠశాల భవనాన్ని నిర్మించినట్లు చెప్పారు. సర్పంచ్ మిండాల మంగమ్మ మాట్లాడుతూ గ్రామస్థుల సహకారంతో రూ.7.60 లక్షలతో 56 సెంట్ల స్థలం పాఠశాలకు కొనుగోలు చేసి ఇవ్వటంతో ప్రభుత్వం భవన నిర్మాణం చేపట్టిందన్నారు. అందుకు ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసిన గ్రామానికి చెందిన కటారు వెంకటేశ్వర్లు ప్రోత్సాహమే ప్రధాన కారణమన్నారు. పాఠశాల ఏర్పాటుకు స్థలం కొనుగోలుకు, అన్నివిధాల సహకరించిన దాతలను సర్పంచ్ మంగమ్మ శాలువాలు కప్పి మెమొంటోలు అందించి సన్మానించారు.

కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మెన్ నీతమ్మ, ప్రధానో పాధ్యాయుడు వీఎం నర్సింహం, విద్యా కమిటీ చైర్మన్ గురవయ్య, మాజీ ఎంపీటీసీ బత్తుల గాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేసవి సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్ఐ పావని

వెలిగండ్ల, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ జి.కృష్ణపావని అన్నారు. ఎండల్లో తిరిగితే వడదెబ్బ బారినపడే ప్రమాదం ఉందన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కస్తూర్బా పాఠశాలల్లో విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు బావులు, చెరువులకు ఈత సరదా కోసం వెళుతుంటారు. ఈక్రమంలో ప్రమాదాల బారిన పడతారని చెప్పారు. ఆన్‌లైన్ వీడియో గేములకు దూరంగా ఉండాలన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జిలాని బాషా, ఉపాధ్యాయులు రాఘవచారి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

కనిగిరిలో ఉచిత కంటి పరీక్షలు

కనిగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు సందర్భంగా రెండు రోజులపాటు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. అందులోభాగం శనివారం ఉచిత మెగా కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శంకర కంటి ఆసుపత్రి వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అవసరమైనవారికి శంకర కంటి ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. కంటి పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన వృద్ధుల యోగక్షేమాలను ఎమ్మెల్యే ఉగ్ర విచారించి ధైర్యం చెప్పారు. ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర తెలిపారు.

స్వచ్ఛాంధ్ర సాధనకు అందరూ కృషిచేయాలి

దర్శి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర సాధనకు సమిష్టిగా కృషి చేయాలని దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పేర్కొన్నారు. దర్శి నగర పంచాయతీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యర్థ పదార్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా ఒకచోట నిల్వ చేసి చెత్త బండ్లు వచ్చినప్పుడు బయటకు పంపాలన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురికి నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పెంచాలన్నారు.పర్యావరణ పరిరక్షణకు అందరూ నడుం బిగించాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు.

కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ వై మహేశ్వర రావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పరిటాల శ్రీనివాసరావు, సంఘసేవకుడు జీవీ రత్నం, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత చంద్రబాబుదే!

దర్శి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ స్వప్నాన్ని సాకారం చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిది తాతపూడి తెల్లయ్య పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఆర్డినెన్స్ జారీ చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి ఎమ్మార్పీఎస్, టీడీపీ ఎస్సీసెల్ నాయకులు శనివారం దర్శిలో పాలభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ ద్వారా విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు లభించేందుకు మార్గం సలభమైందన్నారు. కార్యక్రమంలో వరగాని పౌలు, రావినూతల పరిశుద్ధరావు, సుబ్బారావు, ప్రేమ్‌రాజు, సువయ్య, చెన్నయ్య, ఫణీందర్, అనీల్, జి.మార్కు, నెహమియా, దినకర్, భూషణరావు, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధ్యం చేసిన ఘనత సీఎం చంద్రబాబుదేనని ఎమ్మార్పీఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఉప్పలపాటి కిరణ్‌ప్రసాద్ మాదిగ పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఆర్డినెన్స్ జారీ చేసిన సందర్భంగా సీఎం చంద్రబాబు, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి చిత్రపటాలకు శనివారం సాయంత్రం పాలభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు పూర్తి సహకారం అందించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సుధాకర్, ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు పోతిపోగు చెన్నయ్య, యోహాన్, పల్లె మణీందర్, డేవిడ్‌సన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యర్థాలను తొలగించాలి

కనిగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను తొలగించి పరి సరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా అటవీశాఖ అధికారి వినోద్ కుమార్ అన్నారు. స్థానిక ఫారెస్ట్‌రేంజ్ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం కార్యాలయంలోని పాడైపోయిన కంప్యూటర్‌లు, ప్లాస్టిక్ వస్తువులను పారవేయించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహయజమానులు, వ్యాపారులు, ఉద్యోగులు తమ పరిసరాల్లో నిరుపయోగ వస్తువులను ఉంచుకోవద్దని సూచించారు. కార్యాలయం ప్రాంగణంలోని చెత్తా చెదారాలను అధికారులు, సిబ్బందితో కలిసి తొలగించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజర్ ఉమామహేశ్వరరెడ్డి, రేంజ్ పరిధిలోని అధికారులు, బీట్ ఆఫీసర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై జాగ్రత్తలు తీసుకోవాలి

కనిగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో మంటలను నియంత్రించే క్రమంలో ఆలోచనతో వ్యవహరించాలని ఫైర్ ఆఫీసర్ బంగారుబాబు అన్నారు. స్థానిక గోపినాథ్ ఆసుపత్రిలో శనివారం అగ్నిప్రమాదాలు జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. రోగులను ఏవిధంగా కాపాడాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపినాథ్, ఆసుపత్రి సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

ముండ్లమూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు నుంచి ఈదర వెళ్ళే ప్రధాన రహదారి వద్ద శనివారం రాత్రి కట్టెల ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. అద్దంకి నుంచి స్వగ్రామం రమణారెడ్డిపాలెంకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గోపనబోయిన ఎర్రయ్యను పెదరావిపాడు సమీపంలో ఈదరవైపు నుంచి అద్దంకి వెళ్తున్న కట్టెల ట్రాక్టర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎర్రయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అద్దంకి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ కమలాకర్ ఘటనాస్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.



సూర్యలంక సముద్రతీరంలో ఏపీటీడీసీ ఆధ్వర్యంలో నడిచే రిసార్టు



రిసార్టులకే.. ఓటు

- వేడుక ఏదైనా వేదికలివే
- తీరంలో వారంత వినోదాలు
- ప్రత్యేక ప్యాకేజీలతో ఆహ్వానాలు
- పర్యాటకుల సందడితో బీచ్ కళకళ



పాండురంగాపురంలోని ఓ ప్రైవేటు రిసార్టులో స్విమ్మింగ్ పూల్ సదుపాయం



పిల్లల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

SUNDAY SPECIAL

స్థానికంగానే.. స్థానికులు

గతంలో రిసార్టులు బుక్ చేసుకునే వారిలో దూర ప్రాంతాలకు చెందినవారే అధికంగా ఉండే వారు. గుంటూరు, పల్నాడు జిల్లాలకు చెందిన వారితో పాటు బాపట్లకు చెందిన వారు ఆటవిడుపుగా సెలవు రోజు ఉదయం తీర ప్రాంతానికి వచ్చి సాయంత్రానికి తిరుగుబాట పట్టేవారు. కానీ ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లావాసులతో పాటు బాపట్లలో నివాసం ఉండే వారు కూడా వారాంతాల్లో రిసార్టులు బుక్ చేసుకుని తీరంలో సేదతీరుతు న్నారు. బిజీ లైఫ్‌లో రోజుల తరబడి టూర్స్ అంటే కష్టం. అందుకే అభిరుచులు మారుతున్నాయి. ఉన్న చోటే ఆటవిడుపు వెదుక్కుంటున్నారు.

గణనీయంగా పెరిగారు

వీకెండ్స్‌ను ఎంజాయ్ చేసే వారి సంఖ్య గతంతో పోలిస్తే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లా వ్యాప్తంగా భారీగా పెరిగింది. తీర ప్రాంతమే కాకుండా ఆధ్యాత్మిక క్షేత్రమో లేక సినిమానో ఇదీ కాదంటే ఓ మంచి రెస్టారెంట్లో కుటుంబంతో కలిసి భోజనం చేయడానికో వారాంతాలను వేదికగా చేసుకుంటున్న వారి సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఓ సర్వే వివరించిన వివరాల ప్రకారం రెండేళ్ల క్రితం వరకు వారాంతాల్లో ఆటవిడుపు అంటే ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలకు సినిమానే ఉండేదని, కానీ ప్రస్తుతం నాలుగు నుంచి ఐదు ఆప్షన్లు పెట్టుకుని ఎంచుకుంటున్నారని తేల్చింది. అంతే కాకుండా వారాంతాల్లో ఎంజాయ్ చేసే కుంటుంబాల సంఖ్య గతంలో జిల్లా వ్యాప్తంగా మహా అయితే రెండు వేల వరకు ఉండేదని అది ప్రస్తుతం పదివేల వరకు చేరిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

పుట్టిన రోజు వేడుకలు.. పెళ్లి రోజు సంతోషాలు.. ఇతర కుటుంబ సంతోషాలు.. ఉద్యోగులు, స్నేహితుల సామూహిక సంబరాలు.. ఇలా కార్యక్రమాలు ఏవైనా చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా అన్ని వర్గాలు రిసార్టుల బాట పడుతున్నారు. మధ్య తరగతి వర్గాలు గతంలో ఇంట్లోనో లేదంటే ఫంక్షన్ హాల్‌లోనో వేడుకలు జరుపుకునే వారు. ఉన్నత వర్గాలు సుదూర ప్రాంతాలకు వెళ్లి సంబరాలు చేసుకునేవారు. అయితే ప్రయాణ సమయం.. దూరాభారం.. తదితరాల కారణంగా సమీప ప్రాంతంలోని పర్యాటక ప్రాంతాలకే పలువురు జై కొడుతున్నారు. దీంతో బాపట్ల జిల్లా పరిధిలోని తీర ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడుతున్నాయి. కుటుంబ సభ్యులు, స్నేహితుల సమక్షంలో తీరప్రాంత అందాలను ఆస్వాదిస్తూ.. రణగొణ ధ్వనులకు.. దూరంగా వేడుకలను జరుపుకునేందుకు పలువురు ఆసక్తి చూపుతున్నారు. తీరప్రాంతంలోని సూర్యలంక, రామాపురం, పాండురంగాపురం, ఓడరేవు, చీరాల వరకు పెద్ద సంఖ్యలో వెలిసిన రిసార్టులు వినూత్నంగా ఆటవిడుపు కోరుకునే వారికి ఆహ్వానాలు పలుకుతున్నాయి.



సూర్యలంక తీరంలో పర్యాటకుల సందడి

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

అభిరుచులు మారుతున్నాయి.. వందల కిలో మీటర్లు ప్రయాణం చేసి ఆస్వాదించే పర్యాటక అందాల కన్నా సమీపంలో ఉన్న తీర ప్రాంతమే ముద్దుగా కనబడుతోంది. పుట్టినరోజు, పెళ్లి రోజు సంబరం ఏదైనా వెలవు మాత్రం తీర ప్రాంత రిసార్టులే. లక్షలు ఖర్చుపెట్టి సుదూర ప్రాంతాలకు వెళ్లే కన్నా దగ్గరలో ఉన్న బీచ్ అందాలను చూడడానికే అధికశాతం మంది మొగ్గుచూ పుతున్నారు. వివిధ పనుల కోసం రాజధాని అమరావతి బాట పట్టేవారు కూడా ఒక ట్రెండు రోజులు బస చేయాలంటే తీర ప్రాం తంలోని రిసార్టులనే వేదిక చేసుకుం టున్నారు. గతంలో హైదరాబాద్, బెంగళూరు లాంటి ప్రాంతాల నుంచే పర్యాటకుల తాకిడి అధికంగా ఉండేది. కానీ స్థానికంగా ఉండే ప్రజల అభిరుచులు, ఆలోచనా ధోరణి కూడా మారి దగ్గరలో ఉండే పర్యాటక అందాలు చూడడానికే వీరు కూడా ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో గతంలో ఎప్పుడూ లేని విధంగా వారాంతాల్లో రిసార్టుల్లో గదులు దొరకడమే గగనంగా మారింది. మామూలు రోజుల్లో కంటే శని, ఆదివారాల్లో గదుల టారిఫ్‌లను అమాంతం పెంచి నిర్వాహకులు సొమ్ము చేసుకుంటున్నారు. మామూలు రోజుల్లో బాపట్ల, చీరాల తీర ప్రాంతాల్లో రూ.2,000కు కూడా గది దొరుకుతుంది. కానీ వారాంతాల్లో 3,000 నుంచి సౌకర్యాలను బట్టి 15,000 వరకు రిసార్టుల్లో గదుల ధర ఉంటుంది. శని, ఆదివారాల్లో రిసార్టుల్లో బస చేసే వారి సంఖ్య 5,000 మంది నుంచి 6,000 వరకు ఉంటుంది. పర్యాటక శాఖ ప్రాథమికంగా చేపట్టిన సర్వేలోనే వారాంతాల్లో రిసార్టుల్లో ఉండే వారి సంఖ్య ఉమ్మడి గుంటూరు జిల్లా వాసుల 30 శాతంగా ఉంటే బయటి వారిది 70 శాతంగా ఉంది. ఈ గణాంకాలే మారుతున్న ఆలోచనా ధోరణులకు అద్దం పడుతున్నాయి. తీర ప్రాంతాల్లో రిసార్టుల సంఖ్యే దాదాపు 55 వరకు ఉన్నాయి. గతంలో అయితే రిసార్టుల్లో ఉండే వారిలో 90 శాతం బయటి ప్రాంతాల నుంచి అంటే హైద రాబాద్, బెంగళూరు వా సులే ఉండేవారు. కానీ ఇప్పుడు రిసార్టు ల్లోని పర్యాటకుల రికా ర్డులను పరిశీలిస్తే 30 శా తం మంది బీచ్‌లకు పది నుంచి 70 కిలోమీటర్ల దూరంలో నివాసం ఉండేవారే ఉండడం గమనార్హం. ఇక తీర ప్రాంతంలో ఫొటోషూట్‌లు, షార్ట్ ఫిల్మ్‌ల చిత్రీకరణ లకు వచ్చే వారి సంఖ్య కూడా ఇటీవల పెరుగుతోంది. దీంతో రిసార్టులు పర్యాటకుల తో కళకళలాడుతున్నాయి.

బడ్జెట్ ధరల్లో ధూంధాంగా..

పుట్టినరోజు, పెళ్లి రోజు లేదా మరింకేదైన సంబ రం కావచ్చు బడ్జెట్ ధరలోనే రిసార్టులు ఆహ్వానం పలుకుతున్నాయి. ఇంటి దగ్గరో లేక మండపాలు, పంక్షన్ హాల్లో అయితే పెద్ద సంఖ్యలో అతిథులను పిలవడంతో పాటు ఖర్చు కూడా ఎక్కువ అవుతుంది. ఈ విధానానికి స్వస్తి పలికి కుటుంబ సభ్యుల తో పాటు ఆప్తులనుకున్న కొందరితో వేడుకను ధూంధాం గా జరుపుకుం టున్నారు. ఇలాంటి వేడుకుల కోసం రిసార్టులు ప్రత్యేక

(మిగతా 8వ పేజీలో)

వారాంతాల్లో.. అన్ని వర్గాలు

గతంలో రిసార్టుల్లో వీకెండ్ ఎంజాయ్ అనేది ఓ సెక్షన్ ప్రజలకే పరిమితమయ్యేది. అదికూడా సాఫ్ట్‌వేర్ కొలువుల్లో స్థిరపడినవారే ఈ తరహా ఆటవిడుపునకు ప్రాధాన్యమిస్తారనే ప్రచారం ఉంది. కానీ ప్రజల ఆర్థిక పరిస్థితులు గతంతో పోల్చుకుంటే మెరుగయ్యాయి. కొలువు లంటే సాఫ్ట్‌వేర్ కాదు ఇంకా ఎన్నో వినూత్న స్టార్టప్స్ స్థానికం గానే ఆహ్వానం పలుకుతున్నాయి. దీంతో వారాంతాల్లో వారి గమ్యస్థానం కూడా తీర ప్రాంత రిసార్టులే అవుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధిక శాతం కుటుంబాలు సేద్యం మీద ఆధారపడినవే. వారి పిల్లల్లో చాలా వరకు మంచి కొలువుల్లో రాణిస్తున్నారు. విదేశాలతో పాటు మనదేశంలోని మెట్రోపాలిటన్ సిటీల్లో స్థిరపడ్డారు. వారు ఆన్‌లైన్‌లో తీరంలోని రిసార్టు బుక్ చేసి తల్లిదండ్రులను, కుటుంబసభ్యులను రిసార్టుల బాట పట్టిస్తున్న వారి సంఖ్య ఇటీవల పెరిగింది.

పర్యాటక శోభతో బీచ్‌ల అభివృద్ధి

- రామాపురం స్వచ్ఛాంధ్రలో కృతికాశుక్ల

చీరాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): రామాపురం, వాడరేవు బీచ్‌లు పర్యాటక శోభతో అభివృద్ధి కానున్నాయని ఇంటర్ బోర్డు కమిషనర్, జిల్లా ప్రత్యేకాధికారి కృతికాశుక్ల తెలిపారు. శనివారం రామాపురం సముద్రతీరంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామాపురం ఆంజనేయ స్వామి విగ్ర హం నుంచి ర్యాలీ నిర్వహించి తీరంలో చీపుర్లతో పారిశుధ్య కార్య క్రమాలు చేపట్టారు. మానవహారంలో నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బీచ్‌ల అభివృద్ధితో నిరుద్యోగ యువతకు స్థానికంగా ఉపాధి అవ కాశాలు లభిస్తాయన్నారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ పర్యాటకులతో స్నేహపూర్వకంగా మెలగాలని, పర్యాటకుల విశ్వాసానికి భంగం కలగకుండా చూడాలన్నారు. తీరంలో రూ.40 లక్షలతో అభివృద్ధి పనులు, కమ్యూనిటీ హాల్స్, మోడరన్ టాయిలెట్స్ ప్రారంభిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మాట్లాడుతూ తీరంలో రక్షణ దిశగా అడుగులు వేసినట్లు చెప్పారు. పేయింగ్ విధానంతో బీచ్ పార్క్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో గంగాధర్‌గౌడ్, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, వైద్యాధికారి విజయమ్మ, డ్వామా పీడీ విజయలక్ష్మి,ఉద్యాన ప్రతినిధి జెన్నెమ్మ, తహసీల్దార్ గోపీకృష్ణ పాల్గొన్నారు.



తీరంలో పారిశధ్యం నిర్వహిస్తున్న ప్రత్యేక అధికారి కృతికా శుక్ల, కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్, ఎమ్మెల్యే కొండయ్య



రామాపురం తీరంలో మానవహారం

సహజ వనరులకు ఆటంకం కలిగిస్తే చర్యలు

సహజ సిద్ధమైన వనరులకు ఆటంకం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తానని కలెక్టర్ వెంకటమురళి హెచ్చరించారు. రామాపురం తీరంలో రిసార్ట్ నిర్వాహకులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రకృతి వనరులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రిసార్ట్ నిర్వాహకులు వ్యాపారాలు సాగించాలన్నారు. వృక్షాలను తొలగించి వ్యాపారాలు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్ని వేల మొక్కలైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, వాటిని రిస్టార్ట్ ఎదురుగా నాటాలని సూచించారు.

అంతరాయం లేకుండా కరెంటు

- అద్దంకి డివిజన్ సమీక్షలో ట్రాన్స్‌కో ఎస్ఈ ఆంజనేయులు

అద్దంకి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వేసవిలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు ప్రణాళిక రూ పొందించినట్లు ట్రాన్స్‌కో ఎస్ఈ ఆంజనేయులు తెలిపారు. అద్దంకి డివిజన్ పరిధిలోని విద్యుత్ శాఖ అధికారులతో శనివారం స్థానిక విద్యుత్ భవన్‌లో ఎస్ఈ సమీక్ష నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో విద్యుత్ వినియోగాన్ని అంచనా వేసి అందుకు తగ్గట్లుగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 700కు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామని, జూన్ చివరి లోపు పెండింగ్‌లో ఉన్న 2వేల వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తామన్నారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్విని యోగం చేసుకోవాలన్నారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన మొత్తాన్ని బ్యాంక్‌ల నుంచి 7 శాతం వడ్డీతో రుణం కూడా పొందే అవకాశం ఉందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 660 ఏర్పాటు చేసుకోగా, మరో 13 వేల మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సుమారు లక్ష మంది ఉన్నారన్నారు. సమావేశంలో ఈఈ మస్తాన్‌రావు, ఏవో(ఫైనాన్స్) శ్రీనివాస్, అద్దంకి,మార్టూరు డీఈఈలు దామోదర్, సురేంద్రబాబు, డివిజన్ పరిధిలోని ఏఈలు పాల్గొన్నారు.

వైసీపీ నేత ఫ్యాక్టరీలో పేలుడు పదార్థాలు

- ఎస్పీ ఆదేశాలతో తనిఖీలు.. మందుగుండు స్వాధీనం
- ఇద్దరిపై కేసు నమోదు



గ్రానైట్ ఫ్యాక్టరీలో పట్టుబడిన ఈడీలను పరిశీలిస్తున్న పోలీసు అధికారి

మార్టూరు, బాపట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీ, గోడౌన్‌లో శనివారం పోలీసుల తనిఖీల్లో భారీగా పేలుడు పదార్థాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్కడ పెద్దఎత్తున అనుమతి లేని పేలుడు పదార్థాల నిల్వ ఉన్నాయనే సమాచారం ఎస్పీ తుషార్‌డూడీ కి దీంతో ఆయన ఆదేశాలు మేరకు మా ర్టూరు సీఐ ఎం.శేషగిరిరావు, ఇంకొల్లు సీఐ రమణయ్య ఆధ్వర్యంలో మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతరావుకు చెందిన గ్రానైట్ పరిశ్రమలో, ఆయన గోడౌన్‌లో తనిఖీలు చేపట్టారు. శనివారం ఉదయం నుంచి సంబంధిత వైసీపీ నేత సమక్షంలోనే పోలీసులు తనిఖీలు చేపట్టారు. గ్రానైట్ ఫ్యాక్టరీలో 2,300 ఎలక్ట్రానిక్ డిటోనేటర్స్(ఈడీ)లు, గోడౌన్‌లో మూడు రకాలైన జిలెటిన్ స్టిక్స్, డీఎఫ్, ఓడీలు మందుగుండు సామగ్రి దాదాపుగా 10 టన్నులను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ పరిస్థితుల్లో ముందుజాగ్రత్తగా గోడౌన్, పరిశ్రమ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

ఏళ్లుగా అక్రమ వ్యాపారం..

వైసీపీ అధికారంలో ఉన్నసమయంలో దాసం హనుమంతరావు గ్రామంలో చక్రం తిప్పారు. బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లోని గ్రానైట్ క్వారీలకు, కంకర మిల్లులకు పేలుడు పదార్థాలను ఏళ్లుగా సరఫరా చేస్తున్నాడు. వేరే వ్యక్తికి చెందిన లైసెన్సును అడ్డుగా పెట్టుకుని ఈయన ఈ వ్యాపారం చేస్తున్నట్లు సమాచారం. జనావాసాల మధ్య ఉన్న గోడౌన్‌లో పేలుడు పదార్థాల నిల్వపై రెండు నెలలు కిందట గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించడంతో వైసీపీ నేత బండారం బయటపడింది. పేలుడు పదార్థాల విషయం తెలిసి బాపట్ల డీఎస్పీ ఆంజనేయులు మార్టూరు స్టేషన్‌కు వచ్చి వాటిని పరిశీలించారు. దాసం హనుమంతరావు, దాసం వీరాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అనుమతి లేకుండా ఇంత పెద్దఎత్తున ఈడీలు, మందుగుండు సామగ్రి దొరకడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



తల్లిదండ్రులకు పరీక్ష!

- రేపు చీరాల పరిధిలోని ఏపీ మోడల్ స్కూల్లో 6వ తరగతికి ప్రవేశ పరీక్ష
- ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు, ఏలూరు జిల్లాల నుంచి సుమారు 167 మంది హాజరయ్యే అవకాశం
- కనీస వసతులు కరువు
- రోడ్ల వెంట చెట్ల నీడే దిక్కు
- ఏటా ఎండా కాలంలో అవే ఇక్కట్లు
- ఈసారైనా సౌకర్యాలు కల్పిస్తారా?



చీరాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చీరాల పరిధిలోని జాతీయ రహదారిలో వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో సోమవారం 6వ తరగతి విద్యార్థినీ విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరీక్షలకు చిన్నారులను తీసుకువచ్చే తల్లిదండ్రులకు అగ్ని పరీక్షలు ప్రారంభంకానున్నాయి. పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనుండగా అధికారులు సంబంధిత హాల్ టికెట్‌తో స్కూల్ వద్దకు 8 గంటలకే చేరుకుని ఆయా ప్రాసెస్ చేసుకోవాలని ఇప్పటికే సూచించారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచే పరీక్ష కేంద్రానికి గుంటూరు, బాపట్ల, ప్రకాశం, పల్నాడు, ఏలూరు జిల్లాల నుంచి సుమారు 167 మంది చిన్నారులతో తల్లిదండ్రులు పరీక్ష కేంద్రానికి చేరుకునే అవకాశం ఉంది. అయితే దూర ప్రాంతాల నుంచి పరీక్షకు చిన్నారులను తీసుకువచ్చిన తల్లిదండ్రులకు పాఠశాల సమీపంలో అధికారులు నిలువ నీడ కూడా ఏర్పాటు చేయడం లేదు. తాగు నీటి సౌకర్యం కూడా కల్పించడం లేదు. ఈక్రమంలో స్కూల్ సమీపంలో ఎర్రటి ఎండలో బతుకు జీవుడా అంటూ తల్లిదండ్రులు ఏటా ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన చెందుతున్నారు. సమీపంలో చిన్నపాటి దుకాణాలు కూడా లేక తాగునీరు లేక అల్లాడుతున్నారు. చేసేది లేక పిల్లలు పరీక్ష రాసి తిరిగి వచ్చేవరకూ ఎండను తట్టుకుంటూ రోడ్ల వెంట ఉన్న చెట్ల నీడలో నిరీక్షిస్తున్నారు. ఈక్రమంలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి కనీసం పరీక్ష కేంద్రానికి కాస్త దూరంగా ఒక చిన్న షామియానాను, తాగునీటి ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది. సంబంధిత అధికారులు కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయకుండా విద్యార్థుల తల్లిదండ్రులపై ఇంత చిన్నచూపు చూడడంపై సర్వత్ర విమర్శలు విన్పిస్తున్నాయి. ఏటా మాదిరిగానే ఏ సారి కూడా రేపు పరీక్షలు జరుగనున్నాయి. అయితే ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా కనీసం జిల్లా యంత్రాంగమైనా సుదూర ప్రాంతాల నుంచి వచ్చే తల్లిదండ్రుల సమస్యలను పట్టించుకోవాల్సిన అవసరం ఉంది.



జాతీయ రహదారిలోని చెట్ల నీడలో కూర్చున్న తల్లిదండ్రులు (ఫైల్)

144 సెక్షన్ అమలులో ఉంటుంది

పరీక్ష సమయంలో పరిసరాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుంది. వాస్తవానికి అక్కడ ఎవరూ ఉండకూడదు. పైగా తల్లిదండ్రుల పరిస్థితులపై మాకు ఎటువంటి ఆదేశాలు లేవు. అయితే పరీక్షకు హాజరయ్యే విద్యార్థుల కోసం తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. వారికి వసతులు కల్పిస్తాం.

- జె సరళ, ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, చీరాల



ప్రభుత్వ వైద్యశాలలో వైద్యులు, సిబ్బందికి కరపత్రాలను అందజేస్తున్న అగ్నిమాపక అధికారి వెంకట్రావు, సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తం

అద్దంకి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారి వెంకట్రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా శనివారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు. వైద్యులు డాక్టర్ శరత్‌కుమార్, డాక్టర్ వాహిల చౌదరి, డాక్టర్ వెంకట్‌కిరణ్, డాక్టర్ తేజస్వి, ప్రతాప్ కుమార్, అగ్నిమాపక సిబ్బంది రామస్వామి, శ్రీహరి, రమణయ్య, ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

సరిహద్దు డొంకలో కట్టల పరిశీలన

నోటీసులకు తహసీల్దార్ ఆదేశం



చందలూరు, కొణికి గ్రామాల మధ్య సరిహద్దు డొంకలో ఆటంకంగా ఉన్న కట్టలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సింగారావు

పంగులూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చందలూరు గ్రామానికి తూర్పు వైపున పంట పొలాల నుంచి వర్షపు నీరు వెళ్లేందుకు అడ్డుగా కొణికి రైతులు సరిహద్దు డొంకలో వేసిన కట్టలను తహసీల్దార్ సింగారావు శనివారం పరిశీలించారు. చందలూరు గ్రామ రైతులు కసుకుర్తి సత్యనారాయణ మరికొందరు రైతులు సర్వే నెంబరు 819లో చందలూరు రెవిన్యూ పరిధిలో ఉన్న సరిహద్దు డొంకలో కొణికి రైతులు వేసిన కట్టలతో తమ పొలాలలోని వర్షపు నీరు ముందుకు పోయే పరిస్థితి లేదని, ముంపుతో తమ పొలాలకు నష్టం వాటిల్లుతుందని, కట్టలు తొలగించాలని తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో తహసీల్దార్, సర్వేయర్ సురేష్ డొంకలో వేసిన కట్టలను పరిశీలించారు. సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేయాలని సర్వేయర్, వీఆర్వో పరవురామిరెడ్డిని ఆదేశించారు. వీరి వెంట గ్రామ సర్వేయర్ నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

సత్యనారాయణ రచనలు అభినందనీయం



గ్రంథావిష్కరణ సభలో పాల్గొన్న ప్రముఖులు

ఇంకొల్లు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రాడికల్ హ్యూమనిస్టు సెంటర్ అధ్యక్షుడు, విశ్రాంత ఉపాధ్యాయుడు మేడూరి సత్యనారాయణ రచనల ద్వారా అందిస్తున్న సేవలు అభినందనీయమని వక్తలు అన్నారు. మండలంలోని పావులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సత్యనారాయణ రచించిన జీవపరిణామ వింతలు - విడ్డూరాలు గ్రంథాన్ని చిలుకూరి హనుమంతరావు శనివారం ఆవిష్కరించారు. ఇప్పటివరకు 70 పుస్తకాలను రాశారని కొనియాడారు. కార్యక్రమంలో బాపట్ల హేతువాద సంఘ ప్రధాన కార్యదర్శి కాకి రాజశేఖర్, మండలంలోని ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొని సత్యనారాయణను సన్మానించారు.

పౌష్టికాహారంపై అవగాహన

బల్లికురవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గర్భిణి అయినప్పటి నుంచి పుట్టిన బిడ్డకు రెండేళ్ల వచ్చే వరకు ఉన్న వెయ్యి రోజుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని తహసీల్దార్ రవినాయక్ సూచించారు. శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పక్షోత్సవం పోషణ్ పక్వాడాపై ప్రత్యేక సమావేశం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహింరు. ఈ సందర్భంగా పౌష్టికాహారంతో తీసుకోవడం వల్ల కలిగే లాభాల గురించి తల్లుకు వివరించారు. కార్యక్రమం లో సూపర్ వైజర్లు విజయనిర్మల, సలోమి పాల్గొన్నారు.

ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెరగాలి

బల్లికురవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులకు కూలీల సంఖ్య పెరగాలని లేకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవు అని ఆశాఖ ఏపీడీ కోటయ్యనాయక్ పేర్కొన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలంలో ఉపాధి సిబ్బంది, అన్ని గ్రామాల క్షేత్ర సహాయకులతో సమావేశం జరిగింది. సోమవారం నుంచి రోజూ అయిదు వేల మంది కూలీలు పనులకు రావాలని ప్రత్యేక ప్రణాళిక ద్వారా కూలీలను పనులకు రప్పించాలన్నారు. కూలీలకు రోజు వారీ కూలీ రూ.3 వందల వరకు చెల్లిస్తున్నామని తెలిపారు. అలానే వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకొని ఉదయం 6 గంటల 10 గంటల వరకే కూలీలతో పనులు చేయించాలన్నారు. పశువులకు మంజూరైన నీటి తొట్టెలను వెంటనే పూర్తి చేయించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఏపీవో రమాదేవి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత







అద్దంకి పోలీస్ స్టేషన్ ఆవరణలో పాదులు చేస్తున్న సీఐ సుబ్బరాజు, శింగరకొండపాలెం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సింగయ్య, పర్చూరు ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో, సిబ్బంది, విద్యార్థులు

ఘనంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర

అద్దంకి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని సీఐ సుబ్బరాజు అన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ క్రమంలో అద్దంకి పోలీస్ స్టేషన్ అవరణను సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో సిబ్బంది పిచ్చి మొక్కలను తొలగించటంతో పాటు మొక్కలకు పాదులు చేశారు.

అద్దంకిటౌన్ : స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య అన్నారు. శనివారం శింగరకొండపాలెం సచివాలయంలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు, సర్పంచ్ వై.తిరుపతయ్య, ఏపీవో కోటేశ్వరరావు, సెక్రటరీ చెన్నయ్య, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే మైలవరం జడ్పీ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి గ్రామంలో అ వగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాలతో పర్యావరణానికి హాని

పంగులూరు : ఈ వ్యర్థాలతో పర్యావరణానికి కలిగే హానిని సమాజంలోని ప్రతి వ్యక్తి గుర్తించాలని తహసీల్దార్ సింగారావు, ఎంపీడీవో స్వరూపారాణి అన్నారు. పంగులూరులో శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. వీధుల్లో తిరిగి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ సుమంత్, సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివయ్య, గుడిపూడి రామారావు, కార్యదర్శి రాంబాబు, సంధ్యారాణి, కార్యాలయ, సచివాలయ సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

పర్చూరు : ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని మండలం ఉప్పుటూరు హోమియో వైద్యుడు దాసరి చంద్రశేఖర్ అన్నారు. శనివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, డిప్యూటీ తహసీల్దార్, సిబ్బంది పాల్గొన్నారు. కారంచేడులో ఎంపీడీవో నేతాజీ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఇంకొల్లు : ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్ స్టేషన్‌ల వద్ద స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, ఎస్‌ఐ సురేష్ పాల్గొన్నారు.

చినగంజాం : చెత్త, నిషేధిత ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా ఉండాలన్నదే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ లక్ష్యమని తహసీల్దార్ జె.ప్రభాకరరావు, ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి అన్నారు. స్వచ్ఛ దివస్ కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు.

యద్దనపూడి,(మార్టూరు) : యద్దనపూడి మండలం పూనూరులో స్వచ్ఛాంధ్రపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. సచివాలయం నుండి ప్రారంభించిన ర్యాలీ మెయిన్ సెంటరు వరకు నిర్వహించారు. అనంతరం ప్రధాన సెంటరులో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో టీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శి భాగ్యరాజా పాల్గొన్నారు.

బల్లికురవ : పరసరాలు పరిశుభ్రత పాటించేలా ప్రజలకు అవగాహన కల్పిస్తామని ఎంపీడీవో కుసుమకుమారి తెలిపారు. శనివారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు, పాఠశాలల్లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలను నిర్వహించారు. నాలుగురోడ్ల జంక్షన్‌లో ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీలక్ష్మీ, ఈవోపీఆర్డీ సుమతి, డిప్యూటీ తహసీల్దార్లు రవి కుమార్, ప్రహర్ష, సర్పంచ్ అంజిబాబు, కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



టీటీడీ నుంచి వచ్చిన పూజా సామగ్రిని అందజేస్తున్న టీటీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రామకృష్ణ, నాగేశ్వరరావు

ఆధ్యాత్మిక కార్యక్రమాలతోనే స్నేహభావం పెంపొందుతుంది

అద్దంకి,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక కార్య క్రమాల నిర్వహణ తో స్నేహభావం పెంపొందుతుందని టీటీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రావినూతల రామకృష్ణ అన్నారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని కొంగపాడు కోదండ రామాలయంలో శనివారం సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 100 మంది మహిళాభక్తులు పాల్గొన్నారు. టీటీడీ నుంచి వచ్చిన పసుపు, కుంకుమ, అమ్మవారి రూపులు, కంకణాలు, అక్షింతలు టీటీడీ ప్రోగ్రాం ఆఫీసర్ రావినూతల రామకృష్ణ, టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ చెన్నుపల్లి నాగేశ్వరరావు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు నీలకంఠం వెంకటేశ్వర్లు, మాదాల దానయ్య, పుట్లా వీరాంజనేయులు,పెద్దిశెట్టి వెంకటా ద్రి,అల్లంనేని కాశయ్య, నర్రా బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పేరాల(చీరాల), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పేరాల శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి బాలాలయ ప్రవేశ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం నుంచి ఆదివారం వరకు జరుగే కార్యక్రమాల్లో భాగంగా శనివారం అర్చన, విశేషార్చన, మహాగణపతి పూజ, అకల్మష హోమం, కుంకుమార్చన, తీర్థప్రసాదాలను నిర్వహించారు. దీంతో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో పాటు, చిత్ర ప్రదర్శన నిర్వహించారు.



పోలీసు అధికారులతో సమీక్షిస్తున్న న్యాయాధికారి శాంతి

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష

పర్చూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు కోర్టు భవనాల సముదాయంలో మే 10వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం జూనియర్ సివిల్ న్యాయాధికారి పీ శాంతి పోలీసు సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకునేలా చూడాలన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు చొరవ చూపాలన్నారు. అర్జీదారులు, కక్షిదారులతో చర్చలు జరిపి రాజీ మార్గంలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలని న్యాయాధికారి శాంతి సూచించారు. కార్యక్రమంలో ఎస్సై మాల్యాద్రి, యద్దనపూడి ఏఎస్సై, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాన్ని వినియోగించుకోవాలి

బల్లికురవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండల బారిన పడకుండా బల్లికురవ గ్రామ పంచాయతీ వారు ఏర్పాటు చేసిన తాగు నీటి చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియెగం చేసుకోవాలని ఎంపీపీ బీ.శ్రీలక్ష్మి కోరారు. శనివారం బల్లికురవ నాలుగు రోడ్ల జంక్షన్‌లో గ్రామ పంచాయతీ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ, ఎంపీడీవో కుసుమకుమారి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు ప్రభుత్వ ఆదేశాల మేరకు చలి వేంద్రాన్ని ఏర్పాటు చేయించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పందిరి అంజిబాబు, ఈవోపీఆర్డీ సుమతి, గ్రామ టీడీపీ నేతలు గొట్టిపాటి లక్ష్మయ్య, పావులూరి ఏడుకొండలు, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



మండల కేంద్రంలో తాగు నీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బత్తిన సింగయ్య

విద్యార్థుల నమోదుకు కృషి చేయాలి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ, ఉపాధ్యాయులు, ఇతర శాఖల అధికారులు అందరూ సమిష్టిగా కృషి చేసి 100 శాతం విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సింగయ్య అధ్యక్షతన 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి క్లస్టర్ హెచ్‌యంలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సీఆర్‌పిలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి, 6వ తరగతికి ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో నమోదయ్యేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు 5 సంవత్సరాలు నిండిన పిల్లల వివరాలను సేకరించి సంబంధింత పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో బొమ్మనంపాడు జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం సీహెచ్‌వీ శ్రీనివాసమూర్తి, సిడిపివో ఏ.కృష్ణకుమారి పాల్గొన్నారు.

4న నాయీబ్రాహ్మణ వివాహ వేదిక

చీరాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో మే 4వ తేదీన జరుగే నాయీబ్రాహ్మణ వివాహ వేదికను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు, డాక్టర్ తాడివలస దేవరాజ్ పేర్కొన్నారు. శనివారం హైమా హాస్పిటల్‌లో సంబంధిత కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వేదికలో సుమారు నాలుగు రాష్ట్రాల నుంచి నాయీ బ్రాహ్మణులు హాజరవుతారని చెప్పారు. కార్యక్రమంలో కన్వీనర్ నాదెండ్ల రాఘవ, మధుబాబు, రామారావు పాల్గొన్నారు.

పాల్ హారీస్‌కు నివాళి

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం వారి కార్యాలయంలో రోటరీ ఇంటర్ నేషనల్ వ్యవస్థాపకులు పాల్ హారీస్ 157వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లులర్పించారు. 1905లో అ మెరికాలో 4 సభ్యులతో స్థాపించిన రోటరీ వి శ్వ వ్యాప్తంగా 200 దేశాలలో విస్తరించి ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. ప్రత్యేకించి పోలియో నిర్మూలనలో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు చప్పిడి వీ రయ్య, ట్రెజర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళికృష్ణ, దేవపాలన, చంద్రమౌళి, త్రిమూర్తులు, బాబురావు, గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అదనపు పోస్టును తొలగించవద్దు

మార్టూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : తమ గ్రామంలో ఉన్న ఉర్దూ అదనపు పోస్టును తొలగించవద్దని మండలంలోని ద్రోణాదుల గ్రామానికి చెందిన ముస్లిం మైనారిటీలు శనివారం మార్టూరులో ఎంఈవో వస్రాంనాయక్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ గ్రామంలో యంపిపి ఎస్(పిఎస్) లో ఉర్దూ పోస్టు అదనపు పోస్టుగా ఉంది. చాలా కాలం నుంచి ఈ పోస్టు ఉన్నది. అందుకు సంబంధించి ఉర్దూ ఉపాధ్యాయుడు ఉన్నారు. అయితే ఉన్నత అధికారులు ఉర్దూ పోస్టును తొలగించారని చెప్పడంతో గ్రామంలోని ముస్లిం మైనారిటీలు తమపిల్లలకు ఉర్దూ ఉపాధ్యాయుడు లేకపోతే ఇబ్బందని, కొనసాగించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో బాషా, ఎస్‌కే ముస్తఫా, పెద మౌలాలి పాల్గొన్నారు.

మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం ఏకగ్రీవం

ఇంకొల్లు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండల శాఖ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షునిగా గంగవరం గ్రామానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కరి కమలేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఇంకొల్లు శాఖ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ప్రధాన కార్యదర్శిగా తగిరస వీరాంజనేయులు, కోశాధికారిగా భవనం హరేరామిరెడ్డితోపాటు 13 మంది సభ్యులుగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. ఎన్నికల అధికారిగా టి.కృష్ణయ్య, పరిశీలకులుగా షేక్ కమాలుద్దీన్, జిల్లా అధ్యక్షుడు రావుల బాపయ్య, మార్టూరు శాఖ అధ్యక్షుడు రామారావు, శాఖ సభ్యులు పాల్గొన్నారు.

పరస్పరం దాడులపై కేసులు

ఈపూరుపాలెం(చీరాల), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పరస్పరం దాడుల్లో ఇరువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అందిన వివరాల ప్రకారం ఈపూరుపాలెంకు చెందిన అంగడి కీర్తన, కర్రెద్దుల ఏడుకొండలకు పాత కక్షలు ఉన్నాయి. ఈక్రమంలో దాడులకు పాల్పడగా, పోలీసులు రెండు వర్గాలపై కేసులు నమోదు చేశారు.

కోతుల నుంచి కాపాడండి

మార్టూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజుగారిపాలెంలో గత ఆరునెలలు నుంచి కోతులు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఎక్కడ నుంచి వచ్చాయో తెలియదుగాని గుంపులు గుంపులుగా సంచరిస్తున్నాయి. దానికి వాటికి పిల్లలు కూడా కలగడంతో కోతుల మంద అధికమయింది. వీధులలో ఒంటరిగా మహిళలు, పిల్లలు, వృద్ధులు వెళుతుంటే వారిపై దాడి చేస్తున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం ఇంటి బయట ఉన్న తిరుపతిరాజు లక్ష్మీకాంతమ్మ అనే వృద్ధురాలిపై కోతులు దాడి చేయడంతో కిందపడి గాయాలయ్యాయి. రాత్రి సమయాలలో ఇంటి వరండాలపైకి ఎక్కడం, పందిళ్లు, రేకులపై ఎగురుతూ పెద్దగా శబ్దాలు చేయడంతో నిద్ర కూడా పట్టడంలేదని ప్రజలు వాపోతున్నారు. కర్ర లేకుండా బయటకు రాలేకపోతున్నామని చెప్తున్నారు. అధికారులు స్పందించాలని, కోతుల బెడద నుంచి మమ్మలను కాపాడాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

రోడ్డు దాటేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

అద్దంకి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జంక్షన్ పాయింట్‌లలో రోడ్డు దాటేటప్పుడు వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని సీఐ సుబ్బరాజు అన్నారు. నామ్ రోడ్డులో భవనాసి చెరువు కట్ట వద్ద జంక్షన్ పాయింట్‌ను శనివారం సీఐ పరిశీలించారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాహనచోదకులకు సూచనలు చేశారు. శింగరకొండ వైపు నుంచి నామ్ రోడ్డులోకి వెళ్లే సమయంలో ద్విచక్ర వాహనచోదకులు కచ్చితంగా రెండు వైపులా వాహనాల రాకపోకలను గమనించిన తరువాత మాత్రమే క్రాస్ చేయాలన్నారు.

సేంద్రియ పద్ధతిలో సాగు చేయాలి

చినగంజాం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : సాగును సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా చేయాలని వ్యవసాయాధికారి కే.భాస్కరరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో సేంద్రిమ వ్యవసాయ పద్ధతిలో సాగు చేసే పద్ధతులపై శనివారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఏపీఎం గద్దె పెదసుబ్బారావు మాట్లాడుతూ గ్రామ సంఘం పరిధిలో ఉన్న రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా సాగు చేయాలని, ఇది రైతు సాధికారిక సంస్థ, సెర్ప్ ఆధ్వర్యంలో జరగాలని అన్నారు. గ్రామ సంఘం స్థాయిలో ఉన్న రైతులందరూ సేంద్రిమ వ్యవసాయ పద్ధతిలో సాగు చేసే విధంగా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ సంఘం స్థాయిలో లబ్ధిదారులను గుర్తించి వారికి సబ్సిడీలను అందజేయడం జరుగుతుందని తెలిపారు. తదనంతరం మండల పరిధిలో ప్రకృతి వ్యవసాయ ద్వారా కూరగాయాలు, వరి పంటలను పండించే పెదగంజాం గ్రామానికి చెందిన ఎం.యలమందారెడ్డి, చినగంజాం గ్రామానికి చెందిన మేడికొండ ఐజాక్‌లను అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యసాయం ఏంటీ. బారతి, సీసీలు కే.వెంకటస్వామి, శ్రీలక్ష్మి, మాధవి, రైతులు పాల్గొన్నారు.



రెండు వరుసల్లో ప్రయాణించడంతో స్తంభించిన ట్రాఫిక్

గేటు పడితే అంతే సంగతులు

కారంచేడు రైల్వే గేటు వద్ద నిత్యం భారీగా స్తంభిస్తున్న ట్రాఫిక్

పేరాల(చీరాల), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పేరాల పరిధిలోని కారంచేడు రైలు గేటు వద్ద ట్రాఫిక్‌తో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో భారీ, చిన్న, పెద్ద వాహనాలు తిరుగుతుంటాయి. అయితే ఇక్కడి రైలు మార్గంలో నిత్యం రైళ్ల రాకపోకలు అధికంగానే ఉంటుంటాయి. అలాగే కారంచేడు, పర్చూరుతో పాటు గేటు అవతలి వైపు నుంచి చీరాల, బాపట్లకు వచ్చే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. ఈక్రమంలో రైల్వే గేటు పడితే వాహనాలు కోకొల్లలుగా నిలిచి పోతున్నాయి. దీంతో ఎండలో వాహన దారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇదిలా ఉంటే మరి కొందరు ఆకతాయిలు రెండు వరుసల్లో వాహనాలు నడుపుతూ ట్రాఫిక్‌కు మరింత అసౌకర్యం కలిగిస్తున్నారు. దీంతో ప్రజలు, ఉద్యోగులు ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారు.

విలువలకు మూలస్తంభం నాగినేని



ప్రతిభామూర్తుల చిత్రపటాలకు
పూల మాలల వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

అద్దంకిటౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : విలువల కోసం పదవులను, ఆస్తిపాస్తులను త్యజించిన రాజకీయ, సామాజిక విలువల మూలస్తంభం స్వాతంత్ర్య సరమయోధులు, అద్దంకి తొలి శాసనసభ్యుడు నాగినేని వెంకయ్య అని ఉపాన్యాసకులు, రిటైర్డ్ హెచ్‌ఎం కోట అంజమ్మ అన్నారు. శనివారం రాత్రి ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అద్దంకి ఆధ్వర్యంలో ప్రతిభామూర్తులు- మధురస్మృతులు 42వ సభ చిన్ని శాంతయ్య, పిచ్చమ్మ సేవా సదన్‌లో విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మరాజు నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ముందుగా ప్రతిభా మూర్తులు నాగినేని వెంకయ్య, సినీ నటులు గొల్లపూడి మారుతీరావు, చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజమ్మ మాట్లాడుతు ఆనాడు వెంకయ్య బలపరచడం వలనే నాకు తొలి శాసనసభ్యురాలిగా చోటు దక్కిందని కరణం బలరామకృష్ణ మూర్తి అనేక సందర్భాలల్లో చెప్పారన్నారు. కార్యక్రమంలో ఉపన్యాసకులు చందలూరి నారాయణరావు, సంఘ అధ్యక్షుడు కోటయ్య, రిటైర్డ్ పీఈటీ నర్రా నాగేశ్వరరావు, నాగినేని రామకృష్ణ, మన్నం త్రిమూర్తులు, చప్పిడి వీ రయ్య, జ్యోతి చంద్రమౌళి, దేవపాలన, రామాంజనేయులు, డివియం సత్యనారాయణ, శ్రీనివాసరావు, బాబురావు, బ్రహ్మం, మస్తానరావు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

పాపాయిపాలెం(చీరాల), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి శనివారం మృతి చెందాడు. రెండవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వేటపాలెం మండలం పాపాయి పాలెంకు చెందిన డక్కుమళ్ల రమేష్(39)వడ్రంగి మేస్త్రి. ఈక్రమంలో గత బుధవారం రాత్రి పనులు ముగించుకుని ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళుతుండగా గ్రామం సమీపంకు చేరే సరికి ఎదురుగా చీరాల వైపు చాపల లోడుతో వస్తున్న లారీ ఇతడిని ఢీ కొంది. అప్పటి నుండి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి భార్య ఇరువురు సంతానం.

ఉపాధ్యాయులకు ఊరట

- తగ్గిన యాప్‌ల భారం
- ప్రత్యామ్నాయంగా ఒకటే ఏర్పాటు
- అందుబాటులోకి లీప్ యాప్

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ఉపాధ్యాయులకు ఊరట లభించింది. ఎన్నికల సందర్భంగా యాప్‌ల భారాన్ని తగ్గిస్తామంటూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ఇప్పటికి అమలులోకి వచ్చింది. అన్నింటికీ ప్రత్యామ్నాయంగా ఒకే యాప్‌ను ప్రభుత్వం రూపొందించింది. లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్(లీప్) పేరుతో ప్రభుత్వం రూపొందించిన కొత్త యాప్ గత బుధవారం నుంచి ఉపాధ్యాయులకు అందుబాటులోకి వచ్చింది. పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు లీప్ యాప్‌లోనే నమోదు చేయాల్సి ఉంది. పాఠశాలలకు సంబంధించిన అన్ని వివరాలను ఇక నుంచి అందులోనే నమోదు చేస్తారు. దీంతో టీచర్లపై పెనుభారం తప్పినట్లు అయింది.

సగం సమయం యాప్‌లకే..

గత ప్రభుత్వంలో విద్యాశాఖలో యాప్‌ల గోల టీచర్లను కలవరపెట్టింది. ప్రతి పనికి సంబంధించిన సమాచారం ప్రత్యేక యాప్‌లలో అప్‌లోడ్ చేయాల్సి రావడంతో టీచర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. పాఠశాలలో ఉన్నంతసేపు ఎక్కువ టైం యాప్‌లతో సతమతమవుతూ బోధనకు సమయం కేటాయించలేక తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఉదయం అడుగుపెట్టింది మొదలు పాఠశాల ముగిసి బయటకు అడుగు పెట్టే వరకు యాప్‌లతో ఇబ్బందులు పడుతుండేవారు. యాప్‌ల భారం తగ్గించాలని టీచర్లు గగ్గోలు పెట్టినా అప్పట్లో వారి మొర ఆలకించిన నాథుడు లేరు. యాప్‌ల భారం ప్రధాన డిమాండ్‌తో ధర్నాలు చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. పాఠశాలల్లో టీచర్లు, విద్యార్థుల హాజరు నమోదుకు యాప్, మధ్యాహ్న భోజనం వివరాల నమోదుకు ఒక యాప్, విద్యా కానుక వివరాల నమోదుకు ఒక యాప్, ఉపకార వేతనాల నమోదుకు మరొక యాప్, విద్యార్థుల మార్కుల నమోదు, మరుగుదొడ్ల పరిశుభ్రత ఇలా ప్రతి పనికి వేర్వేరుగా యాప్‌లు కావడంతో సమయమంతా వాటికే సరిపోయేది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో యాప్‌ల భారం తగ్గిస్తామని హామీ ఇచ్చి మాటనిలుపుకొంది. టీచర్లకు లీప్ యాప్ అందుబాటులోకి రావడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు. మొదటి రోజు బుధవారం టీచర్లు తమ మొబైల్ నుంచి అటెండెన్స్ యాప్‌ను తొలగించి ప్లేస్టోర్ నుంచి లీప్ యాప్‌ను తమ మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేశారు. ప్రస్తుతం పాత లాగిన్, పాస్‌వర్డ్‌లతోనే హాజరు నమోదు చేయాలి. పాఠశాలకు సంబంధించి మిగిలిన యాప్‌లను కూడా తమ మొబైల్ నుంచి డిలీట్ చేసి వాటి లాగిన్ పాస్ వర్డ్‌లను మాత్రం భద్రపర్చుకోవాలి. ప్రస్తుతానికి అన్ని వివరాలను పాత లాగిన్, పాస్‌వర్డ్‌లతోనే లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

టీచర్ల కేటాయింపు ఒకేలా ఉండాలి

ఒంగోలు విద్య, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్కరణల్లో భాగంగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలలకు టీచర్ల కేటాయింపు ఒకే విధంగా ఉండాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేవీజీ.కీర్తి, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు బి.వెంకట్రావు, ఎస్.లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

సీఐ, ఏఎస్ఐ.. మధ్యలో వ్యాపారి

- అసలు గవర్నర్ వచ్చిన రోజు ఏం జరిగింది?
- తీరంలో సీఐ, ఏఎస్సై మరో వ్యాపారితో ఉమ్మడిగా 2.50 ఎకరాల భూమి కొనుగోలు
- దాని విక్రయంలో ఎత్తుకు పైఎత్తు
- తారస్థాయికి కోల్డ్‌వార్
- ఆధిపత్య పోరులో దొంగలను ఆశ్రయించిన రెండు వర్గాల పోలీసులు
- అందులో ఓ బ్యాచ్‌ను పట్టుకునేందుకు చీరాలలో పాగా వేసిన తెలంగాణ పోలీసులు
- తీరంలో తెలంగాణ పోలీసులు, దొంగలకు మధ్య వివాదం
- వారిపై తిరగబడిన నేరస్థులు



వివాదాలకు తెరలేపిన తీరంలో స్థలం   దాడుల్లో ధ్వంసమైన కారు

చీరాల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : నేను సీఐని, నేను లోకల్ (ఏఎస్ఐ)ని నేను చెప్పింది చేయాలి (సీఐ). లోకల్లో ఉండాలంటే నా మాటే వినాలి (ఏఎస్సై). నువ్వా ? నేనా ? సై. ఇది తీరంలో సీఐ, ఏఎస్ఐ, వ్యాపారికి మధ్య జరుగుతున్న కోల్డ్‌వార్. గతంలో ఆ సీఐ చీరాల సర్కిల్‌లో పనిచేసి ప్రస్తుతం జిల్లాలోనే మరో ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్నారు. అలాగే ఆ ఏఎస్సై మాత్రం సుదీర్ఘ కాలంగా చీరాల పరిధిలోనే వివిధ స్టేషన్‌లలో పనిచేసి రూ.కోట్లకు పడగలెత్తారు. ఈక్రమంలో ఇద్దరు, మరో వ్యాపారితో కలిసికట్టుగా గతంలో ఇక్కడ సీఐ విధులు నిర్వహిస్తున్నప్పుడు పలు స్థలాల క్రయవిక్రయాలు జరిపారు. మూడు కాయలు.. ఆరు పువ్వులుగా వ్యాపారం సాగించారు. ఈ నేపథ్యంలో వాడరేవు తీరంలో ముగ్గురూ కలిసి 2.50 ఎకరాల భూమిని మూడు భాగాలుగా బినామీల పేరులతో కొనుగోలు చేసి అగ్రిమెంట్‌లు చేయించుకున్నారు. అయితే ఊహించని రీతిలో 167 ఏ జాతీయ రహదారి కూతవేటు దూరంలో ఉండడంతో భారీ ధరకు భూమి చేరింది. దీంతో కొనుగోలు చేసిన తొలి నాళ్లలో ఇద్దరూ ఉప్పు, పప్పు బాగానే పంచుకున్నారు కానీ ఆ భూమికి రెక్కలు రావడంతో అసూయలు ఏర్పడ్డాయి. పైగా సీఐ ప్రస్తుతం మరో ప్రాంతానికి తరలి వెళ్లడంతో ఆయన్ని మోసగించాలనే దురుద్దేశం పన్నిన ఏఎస్సై, వ్యాపారి భూమి అమ్మకానికి బేరం వచ్చినట్లు చెప్పి ధర తక్కువగా చూపించారు. అయితే గతంలో ఇక్కడ విధులు నిర్వహించి పట్టు సాధించిన సీఐ తన అనుయాయుల ద్వారా అసలు ధర తెలుసుకుని మిగిలిన ఇద్దరు తనను మోసగిస్తున్నట్లు పసిగట్టారు. దీంతో ఎత్తుకు పై ఎత్తు వేసి మిగిలిన ఇద్దరికీ తెలియకుండా తన భాగం భూమి వరకు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ దందా బయటపడడంతో ముగ్గురి మధ్యా కోల్డ్‌వార్ నడుస్తోంది.

బెడిసికొట్టిన ప్రహరీ గోడ

ఇదిలావుండగా సీఐ తన స్థలానికి ప్రహరీ గోడ నిర్మాణానికి పూనుకున్నారు. ఈక్రమంలో దాని హద్దులకు సంబంధించి వివాదం నెలకొంది. స్థాయిని మరిచి కయ్యానికి కాలు దువ్వుకున్నారు. పగలు పెంచుకున్నారు. దీంతో సీఐ ఓ దొంగల ముఠాను, ఏఎస్సై మరో దొంగల ముఠాను ఆశ్రయించారు. గవర్నర్ పర్యటన ఒక వైపు ఉన్నప్పటికీ లెక్క చెయ్యలేదు. దాడులకు తెర లేపారు. దీంతో రంగంలోకి దిగిన రెండు వర్గాల నేరస్తులు భూమిలో వేర్వేరుగా ప్రహరీల ఏర్పాటుకు దిగారు. దొంగలు రెండు ముఠాలు చాలా దగ్గరి వారు కావడంతో వారు చేతులు కలుపుకుని బాయీబాయీ అంటే వివాదాన్ని విరమించారు. దీంతో ఆ సమీపంలోని కొబ్బరి చెట్ల కిందికి చేరుకొని మద్యం సేవిస్తున్నారు. దీంతో దొంగలను ఆశ్రయించిన ఇద్దరు పోలీసుల వ్యవహారం బెడిసికొట్టినట్లయింది.

తెలంగాణ పోలీసుల రాకతో చేతులు దాటిన వ్యవహారం

అంతవరకు గుట్టుగా సాగిన వ్యవహారం తెలంగాణ పోలీసుల రాకతో చేతులు దాటింది. నల్గొండ జిల్లా ములుగు స్టేషన్ పరిధిలో ఇక్కడ వైరానికి దిగిన ఓ వర్గం వారి కోసం అప్పటికే తెలంగాణ పోలీసులు చీరాలలో పాగా వేశారు. సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా మద్యం సేవించే ప్రదేశానికి చేరుకుని వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడ మద్యం సేవిస్తున్న రెండు వర్గాల దొంగలు ఏకమై పోలీసులను ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. దీంతో వాగ్వివాదం జరిగింది. పోలీసులు, దొంగల కార్లు కూడా ధ్వంసమయ్యాయి. ఎట్టకేలకు ఒక నిందితుడిని పోలీసులు పట్టుకుని ఘటనా స్థలం నుంచి వెళ్లిపోయారు. అయితే ఆ రోజు రాత్రి కొంచెం దూరంగా ఉన్న పొలాల్లో పలు కేసుల్లో నిందితుడైన ఈపూరుపాలెంకు చెందిన ఆరికట్ల మహేష్ రక్తపు మరకలు అంటిన చొక్కాతో తనపై ఈపూరుపాలెం, వేటపాలెం ఎస్సైలతో పాటు ఓ ఐడీ పార్టీకు చెందిన కానిస్టేబుల్ దాడికి పాల్పడ్డారని వీడియో వైరల్ చేసిన అనంతరం అదేరోజు రాత్రి బాపట్ల హాస్పిటల్లో చికిత్స తీసుకున్న వెంటనే డాక్టర్ల కళ్లుగప్పి పరారయ్యాడు. అసలు గుట్టు బయటకు పొక్కకుండా వివాదానికి తెర లేపిన ముగ్గురు సీఐ విధులు నిర్వహిస్తున్న చోటుకు వెళ్లి పంచాయితీ చేసుకున్నారు.

పోలీస్ శాఖపై విమర్శలు

నేరాలను నియంత్రించాల్సిన పోలీసులే నేరగాళ్లను ఆశ్రయించి కయ్యాలకు సాక్షాత్తు గవర్నర్ కార్యక్రమం రోజే కాలు దువ్వడంతో పోలీసు అధికారులపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నాయకులను, అధికారులను ప్రసన్నం చేసుకోవడంలో ఆ ఏఎస్సై దిట్టగా మారి చెలామణీ చేస్తుండడంపై పెదవి విరుస్తున్నారు. గతంలో ఇతను ఓ నకిలీ డాక్యుమెంట్‌ను సృష్టించి లక్షల్లో దగాకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఆ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రియల్ వ్యాపారాలపై దృష్టి సారించడంతో పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం ఉండేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఒంటరి మహిళలే లక్ష్యం

- రెండు జిల్లాల్లో పలు దొంగతనాలు
- ఇద్దరు నిందితుల అరెస్టు
- డీఎస్పీ మొయిన్



కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్, ట్రైనీ డీస్పీ అభిషేక్ తదితరులు

మేదరమెట్ల, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఒంటరి మహిళలు కనిపిస్తే చాలు, వారి మెడలో బంగారు గోలుసులను తెంపడం ఒక ఎత్తయితే.. బైక్‌పై రెడీగా ఉండడం మరో ఎత్తు .. ఇద్దరు జతకలిసి బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో మహిళల మెడలో చైన్‌లను దొంగిలించడంతో పాటు మోటార్ సైకిళ్లను కూడా చోరీ చేశారు. ఈ నెల 1వ తేదీన తిమ్మనపాలెంలో ఒంటరిగా ఉన్న మహిళ మెడలో బంగారు గొలుసును తెంపుకెళ్లారు. శనివారం చీరాల డీఎస్పీ మొయిన్ మేదరమెట్ల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి చైన్, బైక్‌ల చోరీలు, దొంగల వివరాలను వెల్లడించారు. 2024 జూన్‌లో మేదరమెట్లలో మరో మహిళ మెడలో చైన్‌లు తెంపుకెళ్లారు. ప్రకాశం జిల్లా కొత్తపట్నంకు చెందిన దర్శనాల ఏడుకొండలు మహిళల మెడలలో చైన్‌లు దొంగిలించడంలో దిట్ట కాగా, ఈతముక్కలకు చెందిన బైక్ మెకానిక్ షేక్ హషీద్. వీరిద్దరూ గతంలో పలు దొంగతనాల్లో ముద్దాయిలు. వీరిద్దరూ మోటర్ సైకిల్‌పై తిరుగుతూ ఒంటరిగా మహిళలు కనిపిస్తే వారి మెడలోని చైన్‌లను దొంగిలించేవారు. ఎఫ్ జడ్ వంటి వేగంగా వెళ్లే బైకులను కూడా వీరు దొంగతనం చేశారు. మేదరమెట్లలో జరిగిన దొంగతనంపై ఎస్పీ తుషార్ డూడీ, అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ వై.సురేష్, జె.పంగులూరు ఎస్ఐ డీ వినోద్‌బాబు సిబ్బందితో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు.

మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ 20 రోజుల పాటు దొంగలను పట్టుకోవడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశారు. ఇటువంటి దొంగతనాలు ప్రకాశం జిల్లాలో ఎక్కడ జరిగాయో తెలుసుకొని విచారించారు. సీసీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఎట్టకేలకు ఇద్దరు దొంగలను మేదరమెట్ల ఫైలాన్ సెంటర్‌లో పట్టుకున్నారు. వీరి నుంచి ఐదు చైన్‌లతో పాటు 126 గ్రాముల బంగారు వస్తువులు, యమహా ఎఫ్ జడ్ బైక్, మరో మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. గతంలో వీళ్లు చీమకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 3, టంగుటూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, కొత్తపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 దొంగతనాలు చేశారు. వీరు చెడు వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. దర్శనాల ఏడుకొండలు ఇక్కడ దొంగతనాలు చేసి కడప జిల్లా పోరుమామిళ్లలో విలాస వంతంగా డబ్బులు ఖర్చు చేస్తున్నాడు. కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు, మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహమ్మద్ రఫీ, కొరిశపాడు ఎస్ఐ వై.సురేష్, జె. పంగులూరు ఎస్ఐ డి. వినోద్‌బాబు, ఐటీ - కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, కానిస్టేబుల్స్ తిరుపాలు, సురేష్, ఎన్. రమేష్‌ను ఎస్పీ తుషార్‌డూడీ, చీరాల డీఎస్పీ మొయిన్ అభినందించడంతో పాటు వారికి నగదు రివార్డులను అందజేశారు.

వైసీపీ నేత గ్రానైట్ ఫ్యాక్టరీలో తనిఖీలు

2300 ఎలక్ట్రానిక్ డిటోనేటర్‌లు స్వాధీనం చేసుకున్న పోలీసులు

బల్లికురవ, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేత దాసం హనుమంతరావుకు చెందిన, మూసి వేసి ఉన్న ప్రసన్నాంజనేయ గ్రానైట్ ఫ్యాక్టరీలో నిల్వ ఉంచిన నిషేధిత బ్లాస్టింగ్ ఎలక్ట్రానిక్ డిటొనేటర్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని కొణిదెన రెవెన్యూ పరిధిలో ఉన్న మార్టూరు మండలం నాగరాజుపల్లికి చెందిన వైసీపీ నేత దాసం హనుమంతరావుకు చెందిన గ్రానైట్ ఫ్యాక్టరీలో నిషేధిత బ్లాస్టింగ్ ఎలక్ట్రానిక్ డిటొనేటర్‌లు నిల్వ ఉంచారు.

సంతమాగులూరు సీఐ వెంకటరావు, బల్లికురవ ఎస్సై నాగరాజు, ఆర్ఐ పోతురాజు, వీఆర్వో సాయి శనివారం తనిఖీలు చేశారు. ఈ దాడులలో 2300 బ్లాస్టింగ్ ఎలక్ట్రానిక్ డిటొనేటర్‌లు ఒక వాహనం లో నిల్వ ఉంచినట్లు గుర్తించి స్వాధీనం చేసుకొని బల్లికురవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కనీస నిబంధనలు కూడా పాటించకుండా పేలుడు పదార్థాలను క్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో తనిఖీలు చేసినట్లు తెలుస్తుంది. ఈ కేసులో దాసం హనుమంతరావు, దాసం వీరాంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రిసార్టులకే ఓటు

(7వ పేజీ తరువాయి)

ప్యాకేజీతో ఆకర్షిస్తున్నాయి. రిసార్టు అద్దె కాకుండా ప్రత్యేకంగా వీటి కోసం చార్జ్ చేస్తున్నారు. ఈ ప్యాకేజీ రేటు అతిథుల సంఖ్యను బట్టి రూ.25,000 నుంచి రూ.5,00,000 వరకు ఉంది. చివరి మూడు నెలల్లో రిసార్టులు వేదికగా బాపట్ల, చీరాల ప్రాంతాలలో దాదాపు 400 మినీ ఫంక్షన్లు జరగ్గా అధిక శాతం రూ.50,000 నుంచి లక్షలోపు ఉన్న ప్యాకేజీలు కావడం గమనార్హం. వారిచ్చే ప్యాకేజీలోనివి కాకుండా అదనంగా అలంకరణలు, ఫుడ్‌మెనూ మార్చుకోవాలంటే మరింత ఖర్చు పెట్టాల్సిందే. ఇలా జరిగే మినీ వేడుకల్లో దాదాపు సగం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని వారివే కావడం గమనార్హం. తీరప్రాంతంలో రిసార్టులు అంటే గతంలో గదుల వరకే పరిమితమయ్యేవి. కానీ ఇప్పుడు పిల్లలకు ఆట వస్తువులు మొదలుకుని స్విమ్మింగ్ పూల్ సౌకర్యం ఎన్నో అధునాతన సదుపాయాలు అక్కడ అందుబాటులోకి వచ్చాయి. గదుల ఆక్యుపెన్సీ ఇద్దరి నుంచి ముగ్గురి వరకే ఉంటుంది. కానీ పదిహేను మంది వరకు ఒకే చోట సేదతీరేలా హాల్ లాంటి గదులను కూడా తీర ప్రాంతంలో అందుబాటులోకి తెస్తున్నారు. ముఖ్యంగా పిల్లల కోసం అయితే పిల్లల పార్కులు ఏర్పాటు చేస్తున్నారు. ఓ మినీ ఎగ్జిబిషన్‌ను తలపించేలా అవి ఉంటున్నాయి.

పంట దిగుబడి తగ్గడంవల్లే ఆదాయం పడిపోయింది

'ఆంధ్రజ్యోతి' కథనంపై ఏఎంసీ సెక్రటరీ వివరణ

పర్చూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : మిచాంగ్ తుఫాన్ కారణంగా గత ఏడాది పంట దిగుబడులు తగ్గడం, శనగల విక్రయాలు పూర్తి స్థాయిలో జరగక పోవడవంవల్లే మార్కెట్ ఫీజు వసూలు లక్ష్యం చేరుకోలేక పోయినట్లు పర్చూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ సెక్రటరీ తిరుపతి రాయుడు శనివారం ప్రకటనలో తెలిపారు. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వలు ఎక్కువ పరిమాణంలో ఉన్నాయన్నారు. లక్ష్యానికి ఆమడ దూరంలో పర్చూరు మార్కెట్ కమిటీ కథనంపై ఆయన వివరణిచ్చారు.

నేడు చంద్రబాబు పుట్టిన రోజు జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

అద్దంకి, ఏ ప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : సీఎం చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా అద్దంకి 5వ వార్డు రాజీవ్‌నగర్ తెలుగు యువత ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా సాయి క్రికెట్ టోర్నమెంట్ జరుగుతుందని తెలుగుయువత నాయకులు వడ్డవల్లి పూర్ణచం ద్రరావు తెలిపారు. క్రికెట్ టోర్నమెంట్ ను యువనేత గొట్టిపాటి హర్షవర్దన్ ప్రారంభిస్తారని తెలిపారు. అద్దంకి లోని టీడీపీ కార్యాలయంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు జరుగుతాయని టీడీపీ పట్టణ అధ్యక్షుడు చిన్ని శ్రీనివాసరావు తెలిపారు.

నేడు బీచ్ కబడ్డీ పురుషుల జిల్లా జట్టు ఎంపిక

చినగంజాం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : ఎంఎస్ఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో ఆదివారం సాయంత్రం 3గంటలకు ఉమ్మడి ప్రకాశం జిల్లా పురుషుల బీచ్ కబడ్డీ జట్టు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుర్రా భాస్కరరావు, వై.పూర్ణచంద్రరావులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు కోచ్ ఎం.గిరిబాబు(9700600996)ని సంప్రదించాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు శిక్షణ అనంతరం కాకినాడలో మే 2 నుంచి 4వ తేదీ వరకు జరిగే అంతర్ జల్లాల 12వ బీచ్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలలో పాల్గొన్నట్లు తెలిపారు.

రాజకీయ కుట్రేనా?

మాజీ మంత్రి కాకానితో సంబంధాలపై ఆరా

మార్టూరు వైసీపీ నేత గోడౌను, ఫ్యాక్టరీలో భారీగా పేలుడు పదార్థాలు స్వాధీనం

పరారీలో పలువురు వైసీపీ నేతలు

ఉలిక్కిపడ్డ మార్టూరు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

వైసీపీ నేత గోదాము, ఫ్యాక్టరీలలో భారీగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచటం వెనుక రాజకీయ కుట్ర ఉందన్న అనుమానాలపై పోలీసు దర్యాప్తు ప్రారంభమైంది. ముఖ్యంగా ఈ పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన వైసీపీ నేతకు మైనింగ్ కేసులో పోలీసులకు దొరకకుండా తిరుగుతున్న మాజీ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డికి ఉన్న సంబంధాలపై ఆరాతీయటం ప్రారంభించారు. గ్రానైట్ వ్యాపారం ముసుగులో భారీగా పేలుడు పదార్థాలను అక్రమంగా నిల్వ ఉంచిన ఆ నాయకుడు గతంలో పలు కేసులలో నిందితుడిగా ఉన్న నేపథ్యంలో తాజా ఘటన మార్టూరు, బల్లికురవ ప్రాంత గ్రానైట్ వ్యాపారులనే కాక యావత్తు పర్చూరు నియోజకవర్గ ప్రజానీకాన్ని ఉలికిపాటుకు గురిచేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని మార్టూరు, బల్లికురవ ప్రాంతాలలో వైసీపీ నాయకుల గోదాములు, ఫ్యాక్టరీలలో భారీగా పేలుడు పదార్థాలు నిల్వ ఉంచినట్లు బాపట్ల జిల్లా ఎస్పీకి నిఘా విభాగం నుంచి సమాచారం అందింది. ఆయన పకడ్బందీగా పోలీసులను రంగంలోకి దించి శనివారం సదరు వైసీపీ నేత గోదాములు, ఫ్యాక్టరీలపై దాడులు నిర్వహించారు. నాగరాజుపల్లి పరిధిలో గోదాములోను, బల్లికురవ వద్ద అతనికున్న గ్రానైట్ ఫ్యాక్టరీలోను భారీగా పేలుడు పదార్థాలు లభ్యమయ్యాయి. టన్నుల కొద్దీ బయటపడటంతో పోలీసులు కూడా ఆశ్చర్యపోయ్యారు. అనుమతులు లేని శక్తివంతమైన పేలుడు పదార్థాలు నిల్వ ఉన్నాయని తనిఖీ చేసిన అధికారులు ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. దీంతో రాష్ట్ర, జిల్లా స్థాయి పోలీసు అధికారులు రంగంలోకి వచ్చి మొత్తం వ్యవహారంపై దర్యాప్తు చేపట్టారు. ఆ గోదాము, ఫ్యాక్టరీలకు యజమానిగా ఉన్న హనుమంతరావు వైసీపీలో కీలక నేతగా ఉన్నారు. పార్టీ పెద్దల అండతో గతంలో పేలుడు పదార్థాల వ్యాపారం అక్రమంగా నిర్వహించారన్న ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా సదరు అక్రమ వ్యాపారం జోరుగానే సాగుతోంది. ఈ నేపథ్యంలో నిఘా విభాగం నుంచి సమాచారం మేరకు పోలీసులు రంగప్రవేశం చేసి టన్నులకొద్దీ పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు.

ముమ్మర దర్యాప్తు

కాగా గ్రానైట్ క్వారీలకు అవసరమైన జిలిటెన్ స్టిక్స్ నిల్వ ఉంచేందుకు ఉన్న అనుమతికి మించి పెద్దమొత్తంలో వారు నిల్వ ఉంచటం ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ పేలుడు పదార్థాలను నిల్వ ఉంచినట్లు తేటతెల్లమైంది. దీంతో పోలీసులు మొత్తం వ్యవహారంపై దర్యాప్తునకు రంగంలోకి దిగారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక పోలీసు అధికారులు కూడా రంగంలోకి వచ్చారు. ఈ పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన వైసీపీ నేతకు నెల్లూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రి కాకానితో సంబంధాలు ఉన్నాయన్న అనుమానాలు ఉన్నాయి. మరోవైపు పదిరోజుల క్రితం మాజీ మంత్రి, ఆ జిల్లా వైసీపీ అధ్యక్షుడైన మేరుగ నాగార్జున అకస్మాత్తుగా మార్టూరు వచ్చారు. ప్రస్తుత కేసులో నిందితునిగా ఉన్న హనుమంతరావు లాడ్జికి సమీపంలో ఒక ప్రైవేటు ఆఫీసులో గంటలకొద్దీ తిష్టవేశారు. ఆ కార్యక్రమానికి పర్చూరు వైసీపీ ఇన్‌చార్జి కూడా హాజరుకాలేదు. దీంతో మాజీమంత్రి నాగార్జున అకస్మాత్తుగా అంత రహస్యంగా ఎందుకు వచ్చినట్లు అన్న అనుమానాలపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. మైనింగ్ మాఫియా ఆరోపణలపై మాజీ మంత్రి కాకాని పరారీలో ఉండగా నాగార్జున మార్టూరుకు ఆకస్మికంగా వచ్చి హనుమంతరావుతో సమావేశమై వెళ్లారు. ప్రస్తుతం పేలుడు పదార్థాలు నిల్వ ఉంచిన వైసీపీ నేతకు, కాకానితో ఉన్న సంబంధాలు కూడా వెల్లడికావటంతో పోలీసులు ఆ వైపు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలు విడుదల

నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి) : దేశంలోని ఐఐటీ, ఎన్ఐటీలలో ఇంజనీరింగ్, బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ చూపారు. ఏప్రిల్ 2 నుంచి 8వ తేదీ వరకు రెండు బ్యాచ్ లుగా జరిగిన ఈ పరీక్షలకు జిల్లాలో 6వేల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. శనివారం విడు దలైన మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు పలు విభాగాల్లో సత్తాచాటుతూ ర్యాంకులను సొంతం చేసుకున్నారు. ఈ ఫలితాల్లో ఉత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులు మే 18వతేదీన జరగనున్న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అర్హత సాధిస్తారు.

కోడికి మేత భారం

- భారీగా పెరిగిన మొక్కజొన్న, సోయాబీన్ ధరలు
- లబోదిబోమంటున్న పౌల్ట్రీ యజమానులు



సంగం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : పౌల్ట్రీ రైతులకు కోళ్ల మేత భారంగా మారింది. మొక్కజొన్న, సోయాబీన్ ధరలు భారీగా పెరగ డంతో సాగుదారులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. పౌల్ట్రీ కోళ్లకు ప్రధానంగా వాడే మొక్కజొన్నతో పాటు సోయాబీన్, నూకల ధరలు కొద్దిరోజులుగా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఆరు నెలల నుంచి మొక్కజొన్న, నూకలు ధరలు భారీగా పెరిగాయి. క్వింటం మొక్కజొన్న రూ.1800 నుంచి 2600లకు పెరిగింది. సీజన్‌లో ఏకంగా రూ.3200 లకు ఎగబాకింది. నూకలు కూడా రూ.1800 నుంచి 2500లకు చేరుకుంది. ధరలు పెరిగినా మొక్కజొన్న, నూకలు కూడా అతి కష్టం మీద కొనుగోలు చేసుకొనే పరిస్థితులు ఉండటంతో రైతుల ఇబ్బందులు పడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణలలో మొక్కజొన్న ను ఎక్కువగా పండిస్తుంటారు. అయితే పండిన పంటను రైతులు విత్తనాలు రూపంలో అమ్మడంవల్ల మొక్కజొన్నకు గిరాకీ ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. నూకలు అందుబాటులో ఉన్నా బీర్ల తయారీలో వినియోగించడం వల్ల తమకు దొరకడం లేదని పలువురు రైతులు చెబుతున్నారు. ఇక మేతలో సోయాబీన్ కూడా ఇటీవల క్విం టం రూ. 30 వేల నుంచి 40 వేలు వరకు పెరిగింది. మొక్కజొన్న, నూకలు కొరతను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు చేయాలని భావించినా అవసరమైన సరకు సరఫరాలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. సాగుదారుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకుని మొక్కజొన్న, నూకలు కోళ్ల మేతను రాయితీ ధరకు సరఫరా చేయాలని కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	105
స్కిన్ చికెన్	194
స్కిన్‌లెస్	214

కోడిగుడ్ల ధర (100): 420

హైస్కూలు ఎదుట కారుస్టాండు తొలగించాలి

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని ఓవీ రోడ్డులో జడ్పీ హైస్కూళ్ల వద్ద రోడ్డు మార్జిన్‌లో ఉన్న కారుస్టాండుతో విద్యార్థులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుండటంతో తక్షణం కారుస్టాండును అక్కడి నుంచి తీసివేయాలని మున్సిపల్ కమిషనర్ కె.అనూష యూనియన్ ప్రతినిధులకు శనివారం నోటీసులు జారీ చేశారు. జనార్దన కాలనీకి చెందిన షేక్ మంజూర్ బాషా అనేవ్యక్తి అక్కడ కారుస్టాండు వల్ల విద్యార్థులపై దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశాడని, దీంతో బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎంను వివరణ కోరగా కారుస్టాండు వల్ల ఎంతో అసౌకర్యం అనుభవిస్తున్నట్లు తెలిపారని ఆమె ఆ నోటీసులో పేర్కొన్నారు. ప్రధానంగా గేట్లుకు కూడా అడ్డంగా కార్లు పెడుతున్న పరిస్థితిలో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని, కార్లు వెనుకాల మూత్ర విసర్జన కారణంగా పాఠశాలలోకి తీవ్ర దుర్గంధం వస్తున్నదని, పరీక్షలు, ఇతర ముఖ్యదినాలలో ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడుతోందని వివరించారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో నెలరోజుల్లోగా అక్కడి నుంచి ఖాళీ చేయాలని ఆమె ఆదేశించారు.

'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' లక్ష్యం నెరవేరాలి



కందుకూరులో వీధులు శుభ్రం చేస్తున్నఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ,



కావలి : స్వచ్ఛాంధ్రకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేస్తున్న మున్సిపల్ అధికారులు, సిబ్బంది



వలేటివారిపాలెం : మాలకొండలో ప్రతిజ్ఞ చేస్తున్న డీసీ సాగర్‌బాబు, సిబ్బంది

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర లక్ష్యం నెరవేరాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని అజ్మల్‌హస్పేస్ ఆసుపత్రి సెంటర్‌లో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటూరితో పాటు సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో ఎమ్మెల్యే, సబ్ కలెక్టరు, ఇతర అధికారులు, టీడీపీ నేతలు చీపుర్లు పట్టి వీధులను శుభ్రం చేయటంతో పాటు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనాన్ని ప్రారంభించారు. అనంతరం స్థానికులకు జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. అనూష, డీఈఈ గణపతి, సీఐ వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీవైస్ ఛైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, నాయకులు దామా మల్లేశ్వరరావు, నార్నె రోశయ్య, షేక్ ఖలీల్, సలాం బాషా, తదితరులు పాల్గొన్నారు.

● స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర మాట్లాడారు. కళాశాలలోని వివిధ విభాగాలలోని 150 కిలోల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ పి.రాజగోపాలబాబు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కోటపాటి నరేష్‌రాజా, కంప్యూటర్‌సైన్స్ విభాగాధిపతి జె.హనుమంతరావు పాల్గొన్నారు.

కావలిలో ర్యాలీ

కావలి : స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్, ఎలక్ట్రానిక్ వస్తువుల నిర్వహణ, నియంత్రణకు కట్టుబడి ఉంటామని మున్సిపల్ అధికారులు స్పష్టం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ మేరకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, సచివాలయ సిబ్బంది మున్సిపల్ కార్యాలయం నుంచి ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ ర్యాలీ నిర్వహించారు. దారిపొడవున పాడైపోయి ఉన్న ఎలక్ట్రానిక్ వస్తువులను సేకరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరాం, రెవెన్యూ అధికారి ఫణీంద్ర పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కావలి రూరల్ : పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎమ్పీడీవో శ్రీదేవి, రూరల్ సీఐ రాజేశ్వరరావులు పేర్కొన్నారు. కావలి ఎమ్పీడీవో కార్యాలయం, రూరల్ పోలీస్ స్టేషన్‌ల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగింది. నివాసాలల్లో పాడైపోయిన ఎలక్ట్రిక్ వస్తువులు డిస్పోజ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు.అనంతరం రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి టీచర్స్ కాలనీ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు బాలకృష్ణయ్య, తిరుమలరెడ్డి, బాజీబాబు, ఈవోపీఆర్డీ సమద్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మండుటెండలో విద్యార్థుల అవస్థ

అల్లూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత అధికారులది. అయితే వార్తే పూర్తిస్థాయిలో ఈ కార్యక్రమాలకు హాజరుకారు. దీంతో స్థానకంగా కొందరు అధికారులు విద్యార్థులను వినియోగించుకోవడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమ ర్యాలీని నిర్వహించేందుకు అధికారులు అల్లూరుపేటలోని రామకృష్ణ విద్యాసంస్థల విద్యార్థులతోపాటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులను వినియోగించుకున్నారు. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో ప్రభుత్వం ఒంటిపూట బడులు నిర్వహిస్తూ ఎండ ప్రభావం నుంచి తప్పిస్తోంది. అయితే శనివారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉన్న సమయంలో మండుటెండలో రోడ్లపై ర్యాలీ పేరుతో విద్యార్థులను తిప్పడంపై వారి తల్లిదండ్రుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యం మెరుగుకు సహకరించాలి

కొండాపురం : పారిశుధ్యం మెరుగుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎంపీడీవో ఆదినారాయణరావు పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా కొండాపురంలో తహసీల్దారు ఎం.కోటేశ్వరరావు, ఎస్ఐ ఎం.వెంకటరావు తదితరులతో కలసి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బస్టాండు కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ నారాయణరావు, నాయకులు పీ.రమేష్, దాసరి అశోక్, సర్పంచ్ మాచర్ల, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, ఉపసర్పంచ్ మణి పాల్గొన్నారు.

● **కలిగిరి :** స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడి, ఎస్ఐ ఉమాశంకర్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్రకుమార్, నాయకులు యల్లకర సతీష్, పుల్లా వేమయ్య, ఆవుల ప్రభాకర్‌రెడ్డి, పుల్లారవి పాల్గొన్నారు.

● **బిట్రగుంట :** బోగోలు గ్రామపంచాయతీలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్వచ్ఛఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి జహీర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత

వలేటివారిపాలెం : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబు తెలిపారు. మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



బిట్రగుంట : బోగోలులో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో సుబ్రహ్మణ్యం



కొండాపురం : ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో ఆదినారాయణ, ఇతర అధికారులు, నాయకులు



కలిగిరి : స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

సర్టిఫికెట్ల పరిశీలనలో దివ్యాంగులకు ఇక్కట్లు!

● సమయపాలన పాటించని వైద్యులు

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): కందుకూరు ఏరియా ఆసుపత్రిలో వికలాంగత్వ సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం ప్రహసనంగా మారడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం దివ్యాంగుల సర్టిఫికెట్ల పరిశీలన కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టి ప్రతిరోజు వంద మందిని పరీక్షిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా సచివాలయాల నుంచి అందిన సమాచారం ప్రకారం దివ్యాంగులు కందుకూరు ఏరియా ఆసుపత్రికి వస్తుండగా ఇక్కడ డాక్టర్లు అందుబాటులో లేకపోతుండటంతో వారు అవస్థలు పడుతున్నారు. అనేకమంది వికలాంగులు ఒకరిద్దరు సహాయకులు లేనిదే రాలేని పరిస్థితికి తోడు



ఆటోలో నిరీక్షిస్తున్న దివ్యాంగుడు

ఆటోలాంటి ప్రత్యేక వాహనం ఏర్పాటు చేసుకుని రాక తప్పని పరిస్థితి. ఈ స్థితిలో ఒకటికి మూడునాలుగు సార్లు తిరగాల్సి వస్తున్నదని ఆర్థికంగా ఎంతో భారం అవుతోందని దివ్యాంగులు వాపోతున్నారు. ఉలవపాడుకు చెందిన వెలిచర్ల శివకోటయ్యకు గత గురువారం వికలాంగత్వ పరీక్ష కోసం మధ్యాహ్నం 2 గంటలకు ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సచివాలయ సిబ్బంది నోటీసు ఇచ్చారు. దానిప్రకారం వారు ఆరోజు మధ్యాహ్నం వెళ్లగా ఈరోజు డాక్టరు ముందుగానే వెళ్లిపోయాడని శనివారం రావాలని అక్కడి సిబ్బంది చెప్పారు. దీంతో పూర్తిగా నడవలేని స్థితిలో ఉన్న శివకోటయ్యను ముగ్గురు పట్టుకుని ఓ ఆటోలో కందుకూరుకి రాగా శనివారం కూడా సంబంధిత డాక్టర్లు రాలేదన్న సమాధానమే వారికి లభించింది. కనీసం ఎప్పుడు రావాలో కచ్చితంగా చెప్పమని అడిగినా సమాధానం చెప్పే పరిస్థితిలో వారు లేరని, సిబ్బంది నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నాడని దివ్యాంగులు వాపోయారు. అధికారులు తగినచర్యలు తీసుకుని దివ్యాంగులకు ఇచ్చిన టైమ్‌స్లాట్ ప్రకారం డాక్టర్లు అందుబాటులో ఉండి పరిశీలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

కావలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధమైన వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని వామపక్ష పార్టీలు శనివారం కావలి ట్రంకురోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు పసుపులేటి పెంచలయ్య, బలిజేపల్లి వెంకటేశ్వర్లు, పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు కరువది భాస్కర్, సీపీఐఎంఎల్ నాయకుడు లక్ష్మీరెడ్డి, ఆర్ఎస్పీ నాయకుడు గోసాల రవికాంత్‌లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వామపక్షాల నాయకులు నాగరాజు, దర్గాబాబు, బోసు, ఎల్ శ్యామల, కృష్ణమోహన్, కృష్ణయ్య, నరసింహం పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ర్యాంకులు

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో బీఆర్ ఆక్స్‌ఫర్డ్ ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని కళాశాల ఛైర్మన్ ఉన్నం భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, కళాశాల యాజమాన్యం, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు బాలభాస్కర్, బీ.నరేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు అభినందన

కావలిటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్‌లో కావలి నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. శనివారం విడుదలైన ఫలితాల్లో నారాయణ విద్యార్థులు 15మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కి అర్హత సాధించారు. కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగిరెడ్డి విద్యార్థులను అభినందించారు.

గౌతు లచ్చన్నకు ఘన నివాళి

కావలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న 20వ వర్థంతిని పురస్కరించుకుని శనివారం కావలి ట్రంకురోడ్డులోని ఆయన విగ్రహానికి టీడీపీ నాయకులు, బీసీ వర్గాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబూరావు, రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఉప్పాల వెంకట్రావు, టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు అర్షియాబేగం, మాజీ జడ్పీటీసీ నాయుడు రాం ప్రసాద్ పలువురు బీసీ నేతలు పాల్గొన్నారు.

పగలే వెన్నెల!



నలదలపూరులో పగలు కూడా వెలుగుతున్న వీధిలైటు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం మండలం నలదలపూరులో రెండు నెలల నుంచి పగలు రాత్రి అనే తేడా లేకుండా వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. దీంతో పంచాయతీపై అదనపు ఆర్థిక భారం పడుతుంది. సంబంధిత పంచాయతీ అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు కల్లూరు శ్రీనివాసులు, మరికొందరు తెలిపారు. గ్రామంలో మూడో లైను ఏర్పాటు చేసి టైమర్ అమర్చితే ఈ సమస్య పరిష్కారం అవుతుంది. విద్యుత్ వృథా చేయవద్దు పొదుపు చేయాలని ప్రభుత్వం పదే పదే హెచ్చరిస్తున్నా కింది స్థాయి అధికారులకు చెవి కెక్కడం లేదు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి వీధిలైట్లు పగలు రాత్రి వెలగకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్లాస్టిక్ నిషేధం అందరి బాధ్యత

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్‌ను నిషేధించాల్సి బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత తెలిపారు. మండలంలోని బడేవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం పౌష్టికాహారం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం మాలకొండయ్య, ఏఎన్ఎం లావణ్య, కార్యకర్తలు రమ, మనోహర, భారతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలకు గురువులే స్ఫూర్తి

● ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ

కావలిటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల జీవితాలకు గురువులే స్ఫూర్తి ప్రదాతలని, వారి స్ఫూర్తితోనే తాను ఈ స్థాయికి ఎదిగానని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. శనివారం జవహర్ భారతి డిగ్రీ కళాశాలలోని డాక్టర్ ఎస్ఆర్ శంకరన్ సెమినార్ హాల్లో కరస్పాండెంట్ సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన జేబీ స్పోర్ట్స్ డే వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా విశ్వోదయ వ్యవస్థాపకుడు డీఆర్, ఎస్ ఆర్ శంకరన్ చిత్రపటాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాలాజీతోపాటు మరో అతిథిగా పాల్గొన్న పూర్వ విద్యార్థి కృపారావులను సన్మానించారు. చివరగా క్రీడా విజేతలకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు, సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల డైరెక్టర్ ఆర్ మాల్యాద్రి, పీడీ ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులందిస్తున్న బాలాజీ

● **మిత్రబృందం ఆత్మీయ సత్కారం**

పుల్లారెడ్డినగర్‌లోని గొట్టిపాటి కల్యాణ మండపంలో బాలాజీ మిత్రబృందం ఆధ్వర్యంలో బాలాజీకి ఆత్మీయ సత్కారమందించారు.మిత్రులు ఆర్ మాల్యాద్రి, నరసింహారవు, ఏసుదాసు, లాయర్ మాల్యాద్రి, గొబ్బిళ్ళ కృష్ణయ్య, మధుసూదన్, కటారి నరసింహరావు పాల్గొన్నారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

బిట్రగుంట, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరు గ్రామంలో వెలసి ఉన్న కోదండరామస్వామి ఆలయంలో శనివారం సీతారాముల కల్యాణం వైభంగా జరిగింది. రాత్రి స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం వైభంగా జరిగింది.

అగ్నిప్రమాదాలపై అవగాహన

కందుకూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరిగితే ఎంతో ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయని, వాటిని అవగాహన ద్వారా నివారించవచ్చునని కందుకూరు అగ్నిమాపక అధికారి బీ. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏరియా వైద్యశాలలో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టరు ఇంద్రాణి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు మద్దతు ధర అందించాలి

● పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య

కలిగిరి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): రైతులకు మద్దతు ధర అందించాలని పొగాకు బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య వ్యాపారులకు సూచించారు. శనివారం స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని ఆయన సందర్శించారు. పొగాకు అమ్మకాలు, కొనుగోళ్లకు సంబంధించి వేలం ప్రక్రియను పరిశీలించారు. రైతులు పండించిన నాణ్యమైన పొగాకు గ్రేడింగ్‌కు మద్దతు ధర పూర్తి స్థాయిలో అందించాలని కంపెనీ ప్రతినిధులను కోరారు. అదే విధంగా రైతులు పొగాకు బేళ్లను మిక్సింగ్ గ్రేడింగ్ లేకుండా మార్కెట్ ప్రయోజనాన్ని పొందడానికి బోర్డు అధికారులు సూచించే నియమాలను అనుసరించి తీసుకురావాలని సూచించారు. సాగుదారులు పొగాకు పంటపైనే ఆధారపడకుండా ఇతర పంటల సాగుకు మొగ్గు చూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేలం నిర్వహణాధికారి మహేష్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్ ఉన్నారు.



పొగాకు కొనుగోళ్లు పరిశీలిస్తున్న బోర్డు వైస్‌చైర్మన్ బ్రహ్మయ్య

● **104 పొగాకు బేళ్లు తిరస్కరణ**

స్థానిక పొగాకు వేలం కేంద్రానికి శనివారం రైతులు 365 పొగాకు బేళ్లు అమ్మకానికి తీసుకొచ్చారు. వేలంలో 10 కంపెనీల ప్రతినిధులు పాల్గొని 261 బేళ్లు కొనుగోలు చేశారు. నోబిడ్-84, ఆర్ఆర్-3, సీఆర్-12, జంపింగ్‌లాట్స్-5 కారణాలతో 104 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.220, సగటు ధర రూ.252.40గా నమోదైనట్లు పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి మహేష్‌కుమార్ తెలిపారు.

లక్ష్మీనృసింహుడి సేవలో ముగ్గురు ఎమ్మెల్యేలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం కందుకూరు, సర్వేపల్లి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శాలువా, పూలమాలతో సత్కరించారు. అష్టోత్తర, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంగోమాతకు పూజలు నిర్వహించారు. ఆలయ డీసీ కేవీ.సాగర్‌బాబు, నాయకులు మాదాల లక్ష్మీనరసింహం, కాకుమాను హర్ష, మన్నం మాధవరావు, మన్నం నరేష్, సోమినేని రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



గోమాతకు అరటిపండు పెడుతున్న ఎమ్మెల్యేలు సోమిరెడ్డి, ఇంటూరి

ఆధార్‌కార్డులకు అర్హులం కాదా?

● **తహసీల్దార్ కార్యాలయం వద్ద యానాదుల నిరసన**

కావలి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత గ్రామాల్లో యానాదులు ఆధార్‌కార్డులు పొందడానికి అర్హులు కాదా అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. కావలి మండలం నడింపల్లికి చెందిన యానాదులతో శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ పీ.శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ యానాదులకు ఆధార్‌కార్డులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరికీ ఆధార్‌కార్డులు ఇచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాపూరు పంతులమ్మ, కత్తి వెంకటరమణ, జెడ్డా వాసు, తదితరులు పాల్గొన్నారు.

కావలిలో రన్ ఫర్ జీసస్ ర్యాలీ

కావలిటౌన్, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : కావలి పట్టణంలో శనివారం క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు. ఆరాధన టీవీ ఆధ్వర్యంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పాడేటి థామస్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో పీటర్ పాల్ మినిస్ట్రీస్ కన్వీనర్ పీటర్ దేవరకొండ సుధీర్ పాల్గొని పరుగును ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏసుబాబు, దైవజనులు కృపారావు, జోసఫ్ నిరీక్షణ్‌రావు పాల్గొన్నారు.

బిట్రగుంట : క్రైస్తవ సంఘాలు, క్రైస్తవులు పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడు శ్యాంసన్‌బాబు, కార్యదర్శి జీహెచ్ నాగరాజులతో కలసి విశ్వనాథరావుపేట నుంచి బోగోలు అంబేడ్కర్ విగ్రహం వరకు రన్ ఫర్ జీసస్ ర్యాలీ నిర్వహించారు.

చల్లగా వేచి ఉండండి !





● నగరంలో ఏసీ బస్ షెల్టర్లు

బస్సులు, ఆటో, ఇతర ఏ వాహనం కోసం వేచి ఉండే షెల్టర్లు చల్లని ఏసీతో ఉండటం ఇప్పటి వరకు విదేశాల్లోనే చూశాం. కానీ ఈ సౌకర్యం ఇప్పుడు నెల్లూరు నగరంలోనూ అందుబాటులోకి వచ్చింది. 2014 - 19లో టీడీపీ ప్రభుత్వ హయాంలో పురపాలక శాఖ వీటిని రాష్ట్రంలోనే ప్రత్యేకించి నెల్లూరులో ప్రయోగాత్మకంగా ఈ ఏసీ షెల్టర్లను నిర్మించింది. అయితే, ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వీటిని మూలనపడేసింది. వాటి బాగోగులు గాలికి వదిలేయడంతో ఏసీ యంత్రాలు సైతం చోరీకి గురయ్యాయి. 2024లో తిరిగి అధికారంలోకి వచ్చిన టీడీపీ తాజాగా నెల్లూరులోని ఆరు ప్రాంతాలలో సిద్ధంగా ఉన్న ఏసీ బస్‌షెల్టర్లను ఆధునీకరించి ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చింది. గాంధీబొమ్మ కూడలి, మద్రాసు బస్టాండ్ సెంటరు, శబరిశ్రీరామ క్షేత్రం, పెద్దాసుపత్రి జంక్షన్, అయ్యప్పగుడి కూడలి వద్ద ఇవి వినియోగంలో ఉన్నాయి.

- నెల్లూరు(సిటీ, ఆంధ్రజ్యోతి)

హిందుత్వ ఎజెండా కోసమే వక్ఫ్ సవరణ చట్టం

● దీన్ని అందరూ వ్యతిరేకించాలి ● రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : హిందుత్వ ఏజెండా కోసమే వక్ఫ్ సవరణ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో వక్ఫ్ చట్టంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్‌తో పాటు పలు ప్రజా సంఘాలు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ ముస్లింలు విచ్చలవిడిగా భూములు ఆక్రమించుకోడానికి గత వక్ఫ్ చట్టాన్ని ఉపయోగించారంటూ పదేపదే కేంద్రం చెబుతున్నదన్నారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణలో ముస్లిమేతరులను తాజా చట్టంలో చేర్పిందన్నారు. ఇది ముస్లింల హక్కులపై దాడేనని విమర్శించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సవరించిన వక్ఫ్ చట్టం వల్ల ముస్లిం, హిందూ ఐక్యతకు విఘాతం ఏర్పడుతుందని చెప్పారు. సీపీఐ సీనియర్ నేత రామరాజు మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసిన అమ్ముకోవాలన్న లక్ష్యంతో ప్రభుత్వ ఈ నూతన చట్టాన్ని తీసుకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీపీఎం నేత మాదాల వెంకటేశ్వర్లు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, పలు ఉద్యోగ,ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో అసోసియేషన్ సభ్యులు

షూటింగ్ బాల్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

కోవూరు, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈనెల 26, 27 తేదీల్లో జరగనున్న రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టును స్థానిక బాలికోన్నత పాఠశాలలో శనివారం ఎంపిక చేశారు. జిల్లా బాలుర జట్టుకు సాయి నిఖిల్, నందకిషోర్, భాను ప్రకాష్, ప్రభాస్, పవన్‌తేజ, యశ్వంత్, హర్ష, చరణ్‌సాగర్, అభిలాష్, గౌతమ్, నవీన్, అభిలాష ఎంపికయ్యారు. బాలికల జట్టుకు చందన, జానకి, అమూల్య, గాయత్రి, వైష్ణవి, అంజలిదీప్తి, హరిత, త్రిసత్య, వెంకటమాధవి, మధులేఖ, సింధు, గౌతమి ఎంపికైనట్లు అసోసియేషన్ ప్రకటించింది. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులను షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి భీమతాటి వెంకటరమణయ్య, పాటూరు జడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గణపర్తి వెంకటేశ్వర్లునాయుడు, ఉపాధ్యాయుడు పర్వతరెడ్డి జనార్దనరెడ్డి, వార్డెన్ నాగరాజు తదితరులు అభినందించారు.

సంగం బ్యారేజీ అసంపూర్తి పనులు పూర్తిచేస్తాం

● తెలుగుగంగ సీఈ వరప్రసాదరావు

సంగం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): అసంపూర్తిగా మిగిలిన సంగం బ్యారేజి పనులను పూర్తిచేస్తామని తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ వరప్రసాదరావు పేర్కొన్నారు. శనివారం ఆయన తెలుగుగంగ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి బ్యారేజిని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగం బ్యారేజ్ కం బ్రిడ్జిని నెల్లూరు - ముంబయి జాతీయ రహదారికి అనుసంధానం రోడ్డుతో పాటు బ్యారేజ్‌లో మిగిలిపోయిన వివిధ కాలువల లైనింగ్, ఫ్లడ్ బ్యాంక్‌ల నిర్మాణం, పెన్నా నదికి రెండు చోట్ల ఘాట్‌లు, గెస్ట్‌హౌస్, కనిగిరి ప్రధాన కాలువ, దువ్వూరు కాలువలపై ఉన్న వంతెనలు తొలగించి కొత్తవి ఏర్పాటుచేస్తామని తెలిపారు. ఈ పనులన్నింటికీ సుమారు రూ. 75 కోట్లతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ఆమెదం లభించిన వెంటనే టెండర్లు పిలిచి మిగతా పనులు పూర్తిచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఈఈ మేకల అనీల్‌కుమార్‌రెడ్డి, డీఈ శ్రీనివాసులురెడ్డి, ఏఈ విజయరామిరెడ్డి, వినయ్‌కుమార్, బ్యారేజి నిర్మాణ ప్రతినిధులు ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.



సంగం బ్యారేజీలో అసంపూర్తిగా ఉన్న పనులను పరిశీలిస్తున్న తెలుగుగంగ సీఈ వరప్రసాదరావు

'కామధేను'కు గొంతెండుతోంది!

● దాహంతో అల్లాడుతున్న పశువులు ● వేధిస్తున్న నిధుల కొరత
● పోస్టులు భర్తీ కాకపోవడంతో ఉన్నవారిపై పనిభారం



కామధేను పునరుత్పత్తి కేంద్రంలో ఆవులు

కొండాపురం, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : చింతలదీవి పశుసంవర్థక క్షేత్రంలోని కామధేను పునరుత్పత్తి కేంద్రంలో పశువులు దాహంతో అల్లాడుతున్నాయి. పచ్చిగడ్డి సాగుకు కూడా నీరు లేకపోవడంతో ఎండుగడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2015లో ప్రారంభమైన ఈ కేంద్రానికి అప్పటి కేంద్ర ప్రభుత్వం రూ.250 కేటాయించి, తొలి విడతగా రూ.25 కోట్లు మంజూరు చేసింది. తొలినాళ్లలో కేంద్రం పనులు చకచకా జరగ్గా ఆ తర్వాత నిధుల లేమితో నత్తనడకన సాగుతున్నాయి. తొలి విడత నిధులతో పశువుల షెడ్లు, సిబ్బందికి క్వార్టర్లు తదితర భవనాలు నిర్మించారు. దేశం నలుమూలల నుంచి దాదాపు 20 రకాల ఆవులను, గేదెలను కొనుగోలు చేశారు. కామధేను కేంద్రంలో 14 రకాల స్వదేశీ మేలుజాతి ఆవులు, 5 రకాల గేదెలు ఉన్నాయని అధికారులు చెబుతు న్నారు. వీటి నుంచి ఎంబ్రియో (వీర్యం)ను సేకరించి స్థానికంగా మేలుజాతి ఆవులు, గేదెలకు కృత్రిమ గర్భధారణ చేయిస్తున్నారు.

వేధిస్తున్న నీటిసమస్య

ఆర్ఐడీఎఫ్ పథకం కింద రాళ్లపాడు రిజర్వాయరు నుంచి నీటిని తరలించేందుకు 2017లో రూ.12.5 కోట్లను ప్రభుత్వం మంజూరుచేసింది. పనులు మొదలై దాదాపుగా సగం వరకు పూర్తవగా అనివార్యకారణాలతో ఆగిపోయాయి. ఆ తర్వాత మర్రిగుంట చెరువు నుంచి నీటిని తరలించేందుకు రూ.3.20 కోట్లు మంజూరయ్యాయి. పనులు పూర్తయినా నీరు మాత్రం కామధేను కేంద్రానికి చేరలేదు. చెరువు నుంచి నీటిని తరలించి కేంద్రంలో నిర్మించిన ప్రత్యేక స్టోరేజీ ట్యాంకులలో నిల్వ ఉంచి పశువులకు వాడుకోవాల్సి ఉంది. అయితే, నిధులు విడుదల చేయకపోవడంతో ట్యాంకు వినియోగంలోకి రాలేదు. ఇక కేంద్రంలో ఉన్న బోర్లు పశువుల నిత్యావసరాలకే సరిపోవడంలేదు. వేసవి కాలం కావడంతో నీటి సమస్య జటిలమవుతోంది. పశుగ్రాసం పెంచేందుకు కొత్త బోర్లు వేయాల్సి ఉంది. అలాగే షెడ్లు, పోస్ట్ మార్టం కోసం ప్రత్యేక గది తదితర భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం రూ.3.65 కోట్లు కేటాయించినా రెండు విడతలలో కేవలం రూ.1.82 లక్షలు మాత్రమే మంజూరయ్యాయి. సీఎల్ఎఫ్, కామధేను కేంద్రాలలోని ఆవులు, పశువులకు 50 ఎకరాలలో పచ్చగడ్డి సాగు చేస్తున్నారు. నీటి సమస్య కారణంగా ఎక్కువ విస్తీర్ణంలో గడ్డిని సాగుచేయలేకపోతున్నారు. రైతుల నుంచి 572 టన్నుల ఎండుగడ్డిని సేకరించాలని క్షేత్ర అధికారులు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటివరకు సుమారు 350 టన్నుల గడ్డిని మాత్రమే సేకరించారు.



కేంద్రంలో ఏర్పాటుచేసిన ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్‌ల్యాబ్

సిబ్బంది కొరత

కామధేను కేంద్రానికి ఒక జేడీ, ముగ్గురు ఏడీలు ఉన్నారు. సీనియర్ అసిస్టెంటు లేరు. ఆరుగురు ఎల్ఎస్ఏలు ఉండాల్సి ఉండగా నలుగురు, ఆరుగురు వీఏఏలకు ఒక్కరు కూడా లేదు. కాంపౌండర్లు నలుగురు ఉండాల్సి ఉండగా ఇటీవలే ముగ్గురిని కేటాయించగా ఇద్దరు మాత్రమే విధుల్లో చేరారు.

- వేంకటేశ్వర్లు జేడీ, ఎన్‌కేబీసీ

వెంటాడుతున్న వ్యాధులు

కామధేను కేంద్రంతోపాటు చింతలదీవి పశుసంవర్థక క్షేత్రం ఒకేచోట ఉండటంతో ఆవులు, గొర్రెలు ఒకే పొలంలో మేత మేయాల్సి వస్తోంది. గొర్రెలలో ఎక్కువగా ఉండే బ్రూసెల్లోసెస్ వ్యాధి ఆవులకూ సోకుతోంది. వ్యాధి సోకిన ఆవులకు వైద్యం చేసేందుకు ప్రత్యేక షెడ్లు అందుబాటులో లేవు. దీంతో వ్యాధి సోకిన ఆవు నుంచి ఇతర ఆవులకూ సోకుతోంది. కామధేను ప్రాజెక్టు ఏర్పాటయితే స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆశపడ్డ నిరుద్యోగుల ఆశలు నెరవేర లేదు. రోజువారీ కూలీలుగా పని చేస్తున్నారే తప్ప పర్మినెంటు ఉద్యోగ అవకాశం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక పోస్టులు కూడా భర్తీ కాకపోవడంతో ఉన్నవారిపై పనిభారం ఎక్కువ అవుతోంది.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించండి

● 5 ఎకరాల్లోపు పొలాలకు ఉచితంగా మొక్కలు
● ఖాళీగా ఉన్న భూములు గుర్తించండి : డ్వామా పీడీ గంగాభవాని

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సాగు చేసుకోలేని నిరుపేద రైతులకు ఆరుతడి పంటల సాగుకు సహకరించనున్నామని, ఇందుకు ఐదెకరాలలోపు పొలాలను గుర్తించాలని డ్వామా పీడీ గంగాభవాని అధికారులను ఆదేశించారు. డ్వామా, వ్యవసాయ, ఉద్యాన, గిరిజనాభివృద్ధి శాఖల అధికారులతో శనివారం తన చాంబర్‌లో ఆమె సమీక్షించారు. 5ఎకరాల లోపు పొలం ఉండి, సాగు చేసుకోలేని నిరుపేద రైతులకు ఉచితంగా ఆరుతడి పంటలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అన్నిశాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పొలాలను గుర్తించే కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించాలని ఆదేశించారు. ఈ ఏడాది 3500 ఎకరాలు సాగులోకి తీసుకు రావాలన్న లక్ష్యం ఉందని, దానికి మించి 5వేల ఎకరాల వరకు సాగుచేసేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఖాళీగా ఉన్న పొలాలను గుర్తించడంతో పాటు, మట్టి పరీక్షలు చేయించి, ఏ నేలలో ఏ పంటలు అనువుగా ఉంటాయో రైతులకు సూచించాలన్నారు. మామిడి, నిమ్మ వంటివే కాకుండా నేరేడు, సీతాఫలం, జీడిపప్పు పంటలను వేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు కావాల్సిన మొక్కలను ఉచితంగా అందించడమేగాక మూడేళ్లపాటు సంరక్షణను చేపడతామన్నారు. నీటి ఇబ్బందులు లేకుండా ప్రతి పొలంలో 5నుంచి 6 సెంట్లలో నీటిగుంటలు ఏర్పాటు చేస్తామని, దీంతో బోరులు, బావులలో నీటిమట్టాలు తగకుండా ఉండేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ సమీక్షలో ఏపీఎంఐపీ పథక సంచాలకులు బి. శ్రీనువాసులు, జిల్లా ఉద్యాన అధికారి సుబ్బారెడ్డి, ఐటీడీఏ, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి చెస్‌పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాచెస్ అసోసియేషన్, శ్రీఆనంద్ చెస్ వింగ్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని సిల్వర్‌ఓక్స్ పాఠశాలలో ఆదివారం రాష్ట్రస్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి వై.సుమన్ తెలిపారు. పోటీలకు సంబంధించిన పోస్టర్లను శనివారం పాఠశాల ప్రాంగణంలో విడుదల చేసి మాట్లాడారు. ఇప్పటికే అన్ని జిల్లాల క్రీడాకారులకు పూర్తి సమాచారం అందచేశామని, పెద్ద సంఖ్యలో క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు రూ.55వేల నగదు బహుమతులతోపాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు, సర్టిఫికెట్‌లు అందచేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉచిత భోజన, వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, టోర్నీ నిర్వాహకులు పాల్గొన్నారు.

వైసీపీలా 'చెత్త' ప్రభుత్వం కాదు!

● సమాజానికి మేలు చేయాలన్నది మా లక్ష్యం
● స్వచ్ఛ దివస్ ర్యాలీలో పురపాలక మంత్రి నారాయణ



స్వీపింగ్ యంత్రాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ, నుడా చైర్మన్ కోటంరెడ్డి తదితరులు

నెల్లూరు (సిటీ), ఏప్రిల్ 19,(ఆంధ్రజ్యోతి) : సమాజానికి మేలు చేయాలన్న లక్ష్యంతో రాష్ట్రంలో కూటమి ఆవిర్భవిం చిందని, వైసీపీలా చెత్త పై పన్నువేసి ప్రజలను పీడించు కుతినే ఆలోచనలు తమ ప్రభు త్వానికి లేవని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శనివారం నగరం లోని వీఆర్సీ కూడలి నుంచి నర్తకి సెంటర్ వరకు స్వచ్ఛ దివస్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ ఊరూవాడ శుభ్రంగా ఉంచుకునే బాధ్యతను ప్రజలందరూ తీసుకో వాలని పిలుపునిచ్చారు. ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే స్వచ్ఛతా ర్యాలీలో ఒక్కో కొత్త అంశాన్ని తెరపైకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు. గడిచిన వైసీపీ సర్కారు రూ. లక్షలు అప్పులతోపాటు 85 లక్షల టన్నుల చెత్తను డంపింగ్‌యార్డులో మిగిల్చిందని, దానిని బయోమైనింగ్ ద్వారా శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వీర్యం చేస్తున్నట్లు చెప్పారు.

● ఆకట్టుకున్న ర్యాలీ

స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా జరిగిన ఈ ర్యాలీ ఆకట్టుకుంది. నర్తకి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి మంత్రి నారాయణ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ ర్యాలీలోనే స్వీపింగ్ యంత్రాలను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి అల్లీపురంలోని డంపింగ్ యార్డు వద్ద బయోమైనింగ్ ప్లాంటును ప్రారంభించారు. కాగ స్టోన్‌హౌస్ పేటలోని బీవీఎస్ బాలికల స్కూల్ వద్ద ఈ వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను, పాతమున్సిపల్ కార్యాలయం వద్దనున్న అన్న క్యాంటీన్ భవనం పక్కన రూ.2లకే 20 లీటర్ల తాగునీటిని అందించే ఎన్టీఆర్ సృజల స్రవంతి తాగునీటి పథకం ప్లాంటును మంత్రి నారాయణ ప్రారంభించారు. ఈ కార్యక్రమాలలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఎన్ఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్, ఎంహెచ్‌వో చైతన్య, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, టీడీపీ నగర్ ఇన్‌చార్జి మధు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత.. ఉజ్వల భవిత!

నైపుణ్యాల పెంపునకు కేంద్ర ప్రభుత్వ పథకం

పేరుగాంచిన కంపెనీల్లో శిక్షణ ● దరఖాస్తు దాఖలకు 22 వరకే గడువు

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల 19 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువత ఉజ్వల భవిత పొందాలనే సదాశయంతో వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రధాన మంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద ఇప్పటికే జిల్లాలో 1,126 మంది దరఖాస్తు చేసుకోగా, ఈ నెల 22వ తేదీకి దరఖాస్తు గడువు ముగియనుంది.

● ఇంటర్న్‌షిప్ ఇలా..

బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, హాస్పిటాలిటీ, ఆయిల్, గ్యాస్ అండ్ ఎనర్జీ, మైనింగ్, టెలికాం, రిటైల్, సిమెంటు, బిల్డింగ్ మెటీరియల్, ఫార్మాసూటికల్, ఏవియేషన్, మాన్యుఫ్యాక్చరింగ్, అగ్రికల్చర్ తదితర రంగాల్లో ఇంటర్న్‌షిప్ అందిస్తారు. 12 నెలలపాటు శిక్షణ ఉంటుంది. వన్‌టైం గ్రాంట్ కింద రూ.6వేలతోపాటు ప్రతినెలా ప్రభుత్వం రూ.4500, కంపెనీ రూ.500 వంతున డీబీటీ ద్వారా జమ చేస్తారు. ఈ లెక్కన ఏడాదికి రూ.66 వేలు పొందే అవకాశం ఉంది.

● అర్హులు వీరే!

దరఖాస్తుదారులు కనీసం 10వ తరగతి లేదా దానికి సమాన విద్యార్హత కలిగి ఉండాలి. ఇంటర్, డిగ్రీ, డిప్లమో, ఐటీఐ పూర్తిచేసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని ప్రత్యేక సాంకేతిక నైపుణ్యాలు లేదా నిర్దిష్ట రంగాలలో అనుభవం ఉన్న అభ్యర్థులకు ఎంపిక ప్రక్రియలో ప్రాధాన్యం ఉంటుంది. 21 నుంచి 24 సంవత్సరాలలోపు వయసు కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ పీఎం ఇంటర్న్‌షిప్ పోర్టల్ ద్వారా తమ వివరాలు రిజిస్టర్ చేసుకోవాలి. ఆధార్ అనుసంధానమైన సెల్‌ఫోన్ నెంబరు, బయోడేటాతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అభ్యర్థి ప్రొఫైల్‌లో ఈకేవైసీ పూర్తి చేయాలి. వ్యక్తిగత వివరాలు, విద్యార్హత, చిరునామా, కేటగిరి, ఈమెయిల్ ఐడీ, బ్యాంకు ఖాతా వివరాలు నమోదు చేయాలి.

● ఎంపిక ఇలా

పీఎం ఇంటర్న్‌షిప్‌నకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆబ్జెక్టివ్ పద్ధతిలో పరీక్ష నిర్వహిస్తారు. అర్హులైన అభ్యర్థులు పీఎం ఇంటర్న్‌షిప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. అనంతరం ఎంచుకున్న పరిశ్రమలకు సంబంధించి నైపుణ్యాలు నేర్పిస్తారు. అర్హత సాధించిన వారికి ప్రధాన మంత్రి బీమా కవరేజ్ ఉంటుంది.



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా పెంచలోరి కల్యాణం

రాపూరు, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలో శనివారం పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాభిషేకం జరిపారు. అనంతరం స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం ఉంజల్ సేవ, సాయంత్రం స్వామి వారికి క్షేత్రోత్సవం నిర్వహించినట్లు ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

నిత్యాన్న దానానికి విరాళం

పెంచలకోన క్షేత్రంలో శ్రీవారి శాశ్వత నిత్యాన్నదాన పథకానికి శనివారం రాజంపేట నూనెవారిపల్లి వాస్తవ్యులు అన్నంగి జస్వంత్, షణ్ముకి 50,116 రూపాయలు నగదును అందజేశారు. వారికి అర్చకులు ప్రత్యేక పూజలు జరిపి, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు ఆలయ ఈవో పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

క్లిక్.. క్లిక్.. !

● వెలుగొండల్లో కెమెరాలకు చిక్కిన వన్యప్రాణులు

ఉదయగిరి రేంజ్ పరిధిలో విస్తరించిన వెలుగొండ అడవిలో వన్యప్రాణుల సంచారాన్ని కెమెరాలు బంధించాయి. జంతు గణనలో భాగంగా మార్చిలో అటవీ అధికారులు సీతారామపురం, అర్లపడియ, పంద్రింగి, కొత్తపల్లి, శకునాలపల్లి బీట్‌ల పరిధిలో తాగునీటి వనరులకు సమీపంలో సుమారు 40 ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆ కెమెరాల్లో డేటాను ఇటీవల అధికారులు పరిశీలించగా సీతారామపురం అటవీ ప్రాంతంలో చిరుతపులి, మిగిలిన అటవీ ప్రాంతాల్లో ఎలుగబంట్లు, చుక్కల దుప్పిలు, నెమళ్లు, ఇతరత్రా వన్యప్రాణులు సంచిరిస్తున్న దృశ్యాలు వెలుగుచూశాయి.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)



సీతారామపురం అడవుల్లో చిరుత





కెమెరాలకు చిక్కిన ఎలుగుబంటి, చుక్కలదుప్పి

మాలకొండలో అధిక రేట్లపై విచారణ

వలేటివారిపాలెం, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో దుకాణదారులు పూజా సామగ్రిని అధిక ధరలకు విక్రయించడంపై గుంటూరు డీసీ కేబీ శ్రీనివాసరావు శనివారం విచారణ చేపట్టారు. గత రెండు వారాల క్రితం మాలకొండలో భక్తుల నిలువ దోపిడీ అని ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించి విచారణ చేపట్టాలని గుంటూరు డీసీకి ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు ఆయన శనివారం మాలకొండకు చేరుకుని విచారణ చేపట్టారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్‌బాబును అడిగి వివరాలు తెలుసుకున్నారు. దుకాణాల వద్దకు వెళ్లి ధరల పట్టికలను పరిశీలించారు. విక్రయిస్తున్న ధరల వివరాలను భక్తులను అడిగి తెలుసుకున్నారు. నివేదిక దేవాదాయశాఖమంత్రి రామనారాయణరెడ్డికి అందజేస్తానని శ్రీనివాసరావు తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 8,77,549

మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ.8,77,549 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ కేవీ సాగర్‌బాబు తెలిపారు. ప్రతేక దర్శనానికి రూ.3,20,500, లడ్డూ ప్రసాదం ద్వారా రూ.2,03,545, అన్నదానం ద్వారా రూ.2,46,864, తలనీలాల సమర్పనకు రూ.45,250, రూము అద్దెలు ద్వారా రూ.31,490, కుంకుమార్చనకు రూ.16,940, వివిధ టిక్కెట్ల ద్వారా రూ.12,960 వచ్చినట్లు ఆయన తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్